ఆదివారం
గత వారంరోజుల పై విశ్లేషణ
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

రాజమహేంద్రవరం
: fb.com/vaartha Digital

Published from Rajahmundry, Vijayawada, Hyderabad, Visakhapatnam, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kurnool, Kadapa, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

22-6-2026 సోమవారం సంపుటి: 32 సంచిక: 142 పేజీలు: 8+4 వెల: 6.50

**సీఫుడ్స్‌లో అమ్మోనియా గ్యాస్ లీక్: ఏడుగురి మృతి** 5లో

**సొలిసిటర్ జనరల్‌గా తుషార్ మెహతా పునర్నియామకం**

## శత్రువును నిర్జించే 3 భారీ యుద్ధనౌకలు

### నావికాదళంలోకి ప్రవేశపెట్టిన ప్రధాని మోడీ

### పూర్తి స్వదేశీ సాంకేతికతతో రూపకల్పన

### దేశీయ రక్షణ సామర్థ్యానికి నిలువెత్తు నిదర్శనం: ప్రధాని




ఆదివారం కోల్‌కతాలోని శ్యాంప్రకాష్ ముఖర్జీ పోర్టులో మూడు నౌకలను కమిషనింగ్ కార్యక్రమంలో ప్రధాని మోడీ, నేవీ చీఫ్ కృష్ణ స్వామినాధన్, గవర్నర్ రవి, సిఎం సువేందు అధికారి

**కోల్‌కతా, జూన్ 21:** భారత రక్షణ రంగంలో చరిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతమైంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఆత్మనిర్భర్ భారత్ సంకల్పంతో పూర్తి స్వదేశీ సాంకేతికతతో తయారైన మూడు అత్యాధునిక యుద్ధనౌకలు ఒకేసారి భారత నౌకాదళంలోకి అడుగుపెట్టాయి. దేశీయ రక్షణ సామర్థ్యానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన ఐఎన్ఎస్ దూనగిరి, ఐఎన్ఎస్ సంశోధక్, ఐఎన్ఎస్ అగ్రయ్ యుద్ధనౌకలను ప్రపంచ హైడ్రోగ్రఫీ దినోత్సవ సందర్భంగా కోల్‌కతాలోని శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ పోర్టులో ప్రధానమంత్రి నరేంద్రమోడీ చేతుల మీదుగా వైభవంగా కమిషనింగ్ చేశారు. ఈ మూడు నౌకలు యుద్ధ, సర్వే, జలాంతర్గామి నిరోధక కార్యకలాపాల్లో నౌకాదళ సామర్థ్యాన్ని గణనీయంగా పెంచనున్నాయి. ఈ సందర్భంగా ప్రధాని మోడీ మాట్లాడుతూ బెంగాల్ గడ్డపై ప్రశంసల జల్లు కురిపించారు. భారతదేశ ఆలోచనలకు కొత్త దిశానిర్దేశం చేసి, దేశ పునరుజ్జీవనానికి ఊతమిచ్చిన గొప్ప భూమి బెంగాల్ అని కొనియాడారు. శతాబ్దాలుగా సముద్ర మార్గం ద్వారా భారతదేశాన్ని ప్రపంచంతో అనుసంధానించడంలో ఈ ప్రాంతం కీలక పాత్ర పోషించిందన్నారు. స్వయంసమృద్ధ, సురక్షితమైన, అభివృద్ధి చెందిన భారతదేశ నిర్మాణంలో ఇదొక మైలురాయని ఆయన అన్నారు. జూన్ 21న ప్రపంచ హైడ్రోగ్రఫీ దినోత్సవం రోజే, దేశంలోనే అత్యంత అధునాతన హైడ్రోగ్రఫీ నౌక ఐఎన్ఎస్ సంశోధక్‌ను నౌకాదళంలోకి ప్రవేశపెట్టడం ఒక అద్భుతమైన కాకతాళీయమని మోడీ చెప్పుకొచ్చారు. కొన్నేళ్ల క్రితం ఐఎన్ఎస్ విక్రాంత్‌ను జాతికి అంకితం చేసినప్పుడు సముద్ర శక్తిలో భారత్ కొత్త అధ్యాయాన్ని ప్రారంభించిందని గుర్తుచేశారు. ఐఎన్ఎస్ విక్రాంత్ నుంచి నేటి వరకు సాగిన ఈ ప్రయాణం >>2



ఆదివారం కోల్‌కతాలో జరిగిన యోగా దినోత్సవంలో పాల్గొన్న ప్రధాని మోడీ - '2'లో



ఆదివారం విజయవాడలో జరిగిన యోగా దినోత్సవంలో రామ్‌దేవ్ బాబాతో కలిసి యోగాసనాలు వేసిన సిఎం చంద్రబాబు

# గ్రామాల్లో యోగా మందిరాలు

- సంపూర్ణ ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం
- ఆగస్టు 15 నుంచి రాష్ట్రమంతా సంజీవని
- భారత్ శక్తిని ప్రపంచానికి చాటుతున్న ప్రధాని మోడీ
- తిరుపతిలో యోగాంధ్ర 2027
- అంతర్జాతీయ యోగా దినోత్సవంలో సిఎం చంద్రబాబు

**విజయవాడ,జూన్ 21,ప్రభాతవార్తప్రతినిధి:** ఆధ్యాత్మికత, యోగా సాధనతో హెల్తీ, వెల్తీ, హ్యాపీ ఆంధ్రప్రదేశ్ సాధ్యమవుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. ప్రధాని చొరవతో 190 దేశాల్లో యోగా దినోత్సవం నిర్వహిస్తున్నారని చెప్పారు. ప్రపంచానికి భారత్ విశ్వగురు ప్రపంచానికి మార్గనిర్దేశం చేయగలిగేది భారత్ అని వ్యాఖ్యానించారు. యోగా దినోత్సవం సందర్భంగా అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించిన అంతర్జాతీయ యోగా దినోత్సవంలో సిఎం చంద్రబాబు యోగాంధ్ర లోగో ఉన్న చొక్కా ధరించి పాల్గొన్నారు. సిఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్‌తో ప్రముఖ యోగా గురు రామ్ దేవ్ బాబా వివిధ ఆసనాలు వేయించారు. ప్రాణాయామం, అనులోమ, విలోమ పద్ధతుల్లో సిఎం చంద్రబాబు >>2



## బోయపాడు చేపల మృతిపై విచారణ జరపండి

### డి.సిఎం పవన్ ఆదేశం

**విజయవాడ జూన్ 21 ప్రభాతవార్త ప్రతినిధి:** అనకాపల్లి జిల్లా బోయపాడు తీర ప్రాంతంలో చేపలు మృతి చెందినట్లు వచ్చిన సమాచారంపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాన్ వాకబు చేశారు. ఈ ఘటనపై విచారణ చేపట్టి సమగ్ర నివేదిక ఇవ్వాలని ఎపి కాలుష్య నియంత్రణ మండల సభ్య కార్యదర్శిని ఆదేశించారు. చేపల మృతికి గల కచ్చితమైన కారణాలను అన్వేసించేందుకు శాస్త్రీయ పరిశోధనలు చేపట్టాలని కాలుష్య నియంత్రణ మండలి, మత్స్య శాఖ అధికారులు, మెరైన్ సైంటిస్టులకు సూచించారు. దీనిపై నిపుణులతో క్షుణ్ణంగా అధ్యయనం చేయాలన్నారు. చేపలు మృతి చెందిన ప్రాంతంలో నీటి నమూనాలు, మృతి చెందిన చేపల శాంపిల్స్ సేకరించి ఇప్పటికే పరీక్షల నిమిత్తం పంపారు. సంబంధిత శాఖలన్నీ సమన్వయంతో విచారణ పూర్తి చేయాలని ఉప ముఖ్యమంత్రి దిశానిరేద్శం చేశారు. సముద్ర జీవ వైవిధ్యంన, పర్యావరణ సమతుల్య పరిరక్షణ, మత్స్యకారుల జీవనపోధి సంరక్షణ. ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత అంశాలుగా ముందుకు తీసుకువెళ్తుందని తెలిపారు. బోయపాడు తీరంలో పరిస్థితిని ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తుందని శాస్త్రీయ నివేదికలు అందిన వెంటనే తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.




## ప్రశాంతంగా 'నీట్'

### 185 కేంద్రాల్లో పరీక్ష రాసిన విద్యార్థులు

**విజయవాడ, జూన్ 21,ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో నీట్ యూజీ పునఃపరీక్షకు ఆదివారం ప్రశాంతంగా ముగిసింది.రాష్ట్రవ్యాప్తంగా 27 పట్టణాల్లోని 185 కేంద్రాల్లో నీట్ రీఎగ్జామ్ నిర్వహించారు.. ఈ పరీక్షకు 65,790 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉంది. అయితే దాదాపు అంతా పరీక్షకు హాజరైనట్లు భావిస్తున్నారు. సాధారణ అభ్యర్థులకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5.15 వరకు, దివ్యాంగ అభ్యర్థులు సాయంత్రం 6.20వరకు పరీక్ష రాసేఅవకాశంకల్పించారు. విజయవాడలో అత్యధికంగా 31 కేంద్రాల్లో నీట్ పరీక్ష నిర్వహించారు.. విశాఖలో18, కర్నూలులో16, గుంటూరులో 14, కాకినాడలో 11 కేంద్రాలు, తిరుపతి, రాజమహేంద్రవరం, నెల్లూరులో 9, కడపలో 8, అనంతపురంలో 7, విజయనగరం, ఒంగోలు, ఏలూరులో 6 చొప్పున నీట్ పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా. అన్ని చోట్ల కట్టుదిట్టమైన ఏర్పాట్లు నడుమ పరీక్ష జరిగింది.

## బ్రహ్మనాయుడుపై మరో కేసు నమోదు

**వినుకొండ రూరల్.21 ప్రభాతవార్త:** అనుమతి లేకుండా ర్యాలీ నిర్వహించిన వినుకొండ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుపై పోలీసులు కేసు నమోదు చేశారు. హైదరాబాదులోని గండిపేటలో నకిలీ పత్రాలు సృష్టించి ఉన్నత అధికారుల సంతకాలు ఫోర్జరీ ప్రభుత్వ నకిలీ జీవోలు సృష్టించి ,సుమారు 1500 కోట్ల విలువైన ,పది ఎకరాల ప్రభుత్వ భూమిని, స్వాహా చేశారని ఆరోపణల నేపథ్యంలో హైదరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే, కోర్టులో బ్రహ్మనాయుడుని హాజరపరచగా 14రోజులు రిమాండ్ అనంతరం బ్రహ్మనాయుడుని షర తులతో కూడిన బెయిల్‌పై >>2

# రెండేళ్ల పాలనపై ప్రోగ్రెస్ రిపోర్టులు

### నేటి నుంచి కీలకాంశాలపై నివేదికలు విడుదల

### 4 అంశాలపై స్వయంగా రిలీజ్ చేయనున్న సిఎం చంద్రబాబు



ఆదివారం ప్రొగ్రెస్ రిపోర్టుల విడుదలపై మంత్రులు, అధికారులతో సిఎం చంద్రబాబు సమీక్ష జరుపుతన్న దృశ్యం

**విజయవాడ, జూన్ 21,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రజా ప్రభుత్వం సాధించిన విజయాలు ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు ప్రజా ప్రభుత్వ రెండేళ్ల పాలనపై ప్రగతి నివేదిక 2024-26పేరుతో విడుదల చేయాలని సిఎం చంద్రబాబు నాయుడు మంత్రులు, అధికారులను ఆదేశించారు. 2024లో అధికారం చేపట్టిన వెంటనే గత ప్రభుత్వ పాలనలో జరిగిన విధ్వంసంపై ఇచ్చిన 7 శ్వేత పత్రాలపై యాక్షన్ టేకెన్ రిపోర్టులా ఈ ప్రోగ్రెస్ రిపోర్టులు ఉండాలన్నారు. 7 శ్వేత పత్రాలతో పాటు... మరో 3 ముఖ్యమైన అంశాలపై ప్రోగ్రెస్ రిపోర్టుల విడుదల చేయాలని నిర్ణయించారు. ప్రొగ్రెస్ రిపోర్టుల విడుదలపై మంత్రులు, అధికారులతో క్యాంపు కార్యా లయంలో ఆదివారం ముఖ్యమంత్రి >>2

## సాయికృష్ణ అదృశ్యంపై విచారణకు సిట్

### టీమ్ చీఫ్‌గా ఐజి రవిప్రకాష్



### టాస్క్‌ఫోర్స్ పోలీసుల పాత్రపై దర్యాప్తు బృందం దృష్టి

### మాజీ సిఐ నాగరాజు అరెస్టుకు రంగం సిద్ధం

**విజయవాడ క్రైం,జూన్ 21,ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన సాయికృష్ణ అదృశ్యం కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న సిఐ నాగరాజు కేసు విచారణ నిమిత్తం ప్రత్యేక సిట్ బృందాన్ని ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం టాస్క్‌ఫోర్స్ పోలీసులు సింగ్‌నగర్‌లోని ఆయన నివాసంలో నాగరాజును ప్రశ్నిస్తున్నారు. పలువురు నుండి ఈ బృందం ఇప్పటికే స్టేట్‌మెంట్‌లు రికార్డు చేసింది. సంఘటనకు సంబంధించి పలు కీలకమైన సిసి పుటేజిలను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. సిట్‌ను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. సిట్ చీఫ్‌గా ఐజీ రవిప్రకాష్,సభ్యులుగా పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి,అల్లూరి సీతారామ రాజు జిల్లా ఎస్పీ అమిత్ బర్గర్, బాపట్ల జిల్లా అదనపు ఎస్పీ ఎల్.సుధాకర్‌లను దర్యాప్తు అధికారులుగా నియమించారు. ఇదిలా ఉండగా ఇప్పటికే మహిళా స్టేషన్‌ఎసిపి దైవప్రసాద్ ఈ కేసుకు సంబంధించి ఫిర్యాదురాలైన >>2

## ఎగసిన 'కాపు' సెగ!

### ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్

### పవన్ వ్యాఖ్యలపై బొత్స ఫైర్

### పాదయాత్ర చేస్తా: అంబటి

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,జూన్21,ప్రభాతవార్త:** కాపుల కోటలో పాగా వేసేందుకు వైఎస్ఆర్సిపి పావులు కదుపుతోంది.కూటమి 15 ఏళ్ల పాటు పాలన అంటూ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేస్తున్న వ్యాఖ్యలతో రేగుతున్న అలజడిని నుంచి వైసిపి ప్రత్యామ్నాయ వ్యూహం పన్నుతోంది.రానున్న స్థానిక ఎన్నికల నేపథ్యంలో ఇది మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. అండగా ఉన్న కాపు ఓటు బ్యాంకు కాపాడుకునేందుకు కాపు సామాజిక వర్గ వైసీపీ నేతలు సమయుత్తమవుతున్నారు. అందులో భాగంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వెంకటాయపాలెంలో లంచ్ బేటీ నిర్వహించారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆధ్వర్యంలో నిర్వహించిన వైసీపీ కాపు నేతల రౌండ్ టేబుల్ సమావేశం సుదీర్ఘంగా చర్చించింది. అందులో భాగంగా కాపు సామాజిక వర్గానికి సంబంధించి పలు తీర్మానాలను చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా కాపుసామాజిక వర్గానికి అండగా వుంటామని ప్రకటిస్తూ కూటమి ప్రభుత్వంపై దుమ్మెత్తి పోశారు. భవిష్యత్తు కార్యాచరణను కాపు సామాజిక వర్గ నేతలు ప్రకటించారు.రాష్ట్రంలో మరో రెండు ప్రాంతాల్లో కూడా సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించారు. అందులో భాగంగా తిరుపతి, విశాఖలలో సమావేశాలు నిర్వహిస్తామని ప్రకటించారు. కాపు కార్పొరేషన్ 9000 కోట్లు రూపాయలు కేటాయించాలని డిమాండ్ చేస్తూనే మరోపక్క సంచలనం రేగిస్తున్న సాయి కృష్ణ అదృశ్యంపై నేరుగా ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ సంఘటనపై సిబిఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. టాస్క్ ఫోర్స్ పేరుతో మూడు బృందాలను రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటుచేసి కాపు సామాజిక వర్గానికి అండగా నిలవాలని సమావేశం తీర్మానించింది. రౌడీలంటూ పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలపై బొత్స ఫైరయ్యారు. పాలకులు జాగ్రత్తగా మాట్లాడాలని రౌడీ షీట్ >>2

# ఇటు శాంతి.. అటు వార్నింగ్

- అమెరికా, ఇరాన్ మధ్య స్విట్జర్లాండ్‌లో కొనసాగుతున్న శాంతి చర్చలు
- మాట వినకపోతే గట్టి దెబ్బ కొడతానంటూ ఇరాన్‌కు ట్రంప్ హెచ్చరిక
- హర్ముజ్‌ను అధీనంలోకి తీసుకొంటామని హుంకరింపు
- మళ్లీ ఉద్రిక్తతలు పెరగడంపై ప్రపంచ దేశాల ఆందోళన





**స్విట్జర్లాండ్, జూన్ 21:** స్విట్జర్లాండ్ వేదికగా అమెరికా, ఇరాన్ మధ్య శాంతి చర్చలు ఒక వైపు కొనసాగుతుంటే, మరోవైపు ట్రంప్ ఇరాన్‌కు తీవ్ర స్థాయిలో వార్నింగ్ ఇచ్చారు. లెబనాన్‌లో ఇరాన్ ప్రాక్సీ హిజ్బుల్లాను వెంటనే ఆపాలని, లేదంటే గత వారం చేసినట్లే, ఈ సారి మరింత తీవ్రంగా ఇరాన్‌ను దెబ్బతీస్తామని హెచ్చరించారు. చర్చలు విఫలమైతే ఇరాన్‌లో విధ్వంసం సృష్టిస్తామని, హోర్ముజ్‌ను ఆధీనంలోకి తీసుకుంటామని ట్రంప్ వార్నింగ్ ఇచ్చారు. ట్రూత్ సోషల్ మీడియాలో ఆయన ఈ పోస్ట్‌చేశారు. ప్రాంతీయ భద్రత, హోర్ముజ్ జలసంధి, ఇరాన్ అణు కార్యక్రమం, పలు రంగాలలో కాల్పుల విరమణలపై విస్తృత చర్చలు నడుస్తున్న సమయంలో ఈ హెచ్చరికలు రావడం గమనార్హం. ప్రస్తుతం చర్చలు లెబనాన్‌పై ఇజ్రాయిల్ దాడులపైనే ఆధారపడి ఉన్నాయి. ఇరాన్, పాకిస్తాన్, ఖతార్‌లతో జరిగిన చర్చల అనంతరం అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ మాట్లాడుతూ లెబనాన్‌లో కాల్పులవిరమణ పరిరక్షించేందుకు ట్రంప్ ప్రభుత్వం పురోగతి సాధించిందని, పరిస్థితి ఇప్పటికీ >>2

## టెన్త్ ఉత్తీర్ణులకు సీపెట్‌లో ప్రవేశాలు

**విజయవాడ జూన్ 21 ప్రభాతవార్త ప్రతినిధి:** పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెట్రో కెమికల్స్ ఇంజినీరింగ్, టెక్నాలజీలో మూడేళ్ల వ్యవధి గల డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ టెక్నాలజీ, డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ మౌల్డ్ టెక్నాలజీ కోర్సుల్లో ప్రవేశాలకు అవకాశం కల్పిస్తున్నట్లు సీపెట్ డైరెక్టర్ శేఖర్ తెలిపారు. ఈ కోర్సులకు ఫీజు రియింబర్స్‌మెంట్ సదుపాయం ఉందని కోర్సులు పూర్తి చేసిన వారికి ప్లాస్టిక్స్ రంగంలో బహుళజాతి సంస్థలు, అనుబంధ కంపెనీల్లో ఉద్యోగాలు లభిస్తాయని వెల్లడించారు. నెలకు >>2



మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌లో యోగాలో పాల్గొన్న రాష్ట్రపతి ముర్ము



గువాహటి యోగా కార్యక్రమంలో కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్



యోగాసనాలు వేస్తున్న రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్




ఆదివారం విజయవాడలో జరిగిన యోగా దినోత్సవంలో రామ్‌దేవ్ బాబా, మంత్రి లోకేష్ యోగాసనాలు తిలకిస్తున్న సిఎం చంద్రబాబు

# గ్రామాల్లో యోగా మందిరాలు

>> యోగాభ్యాసం చేశారు. అలాగే యోగాభ్యాసంలో భాగంగా వివిధ ఆసనాలను సిఎం చంద్రబాబు సునాయాసంగా వేశారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఐజిఎం స్టేడియం విద్యార్థి, యువతీ, యువకులతో నిండిపోయింది. వివిధ స్థాయిల్లోని అధికారులు, ఉద్యోగులు, ప్రజలు అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొన్నారు. యోగాసనాలు వేశారు. ఉదయం ఐదు గంటల నుంచి రామ్ దేవ్ బాబా ప్రజలతో యోగ సాధన చేయించారు. సమాజహితం కోసం బాధ్యతతో వ్యవహరిస్తామని ప్రజలతో సిఎం చంద్రబాబు ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ..."ప్రశాంత వాతావరణంలో యోగా గురువు రామ్ దేవ్ బాబాతో కలిసి యోగాభ్యాసం చేయడం ఎన్నటికీ మరువలేం. యోగాకు ప్రపంచస్థాయి గుర్తింపు తెచ్చిన ప్రధాని నరేంద్ర మోదీకి ధన్యవాదాలు. ప్రధాని మోడీ ప్రపంచానికి భారతదేశ శక్తిని చాటుతున్నారు..దేశాన్ని అగ్రభాగాన నిలుపుతున్నారు. ప్రధాని చొరవతో 190 దేశాల్లో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహిస్తున్నారు. ప్రపంచానికి భారత్ విశ్వగురు... ప్రపంచానికి మార్గనిర్దేశం చేయగలిగేది భారతదేశం. ఫిజికల్, మెంటల్ ఫిట్ నెస్ పెంచేది యోగానే. యోగాను ప్రజలకు దగ్గర చేసిన రామ్ దేవ్ బాబా కృషి అమోఘం. సాంకేతికత.. ఆధ్యాత్మికత కాంబినేషన్‌తో వెళ్తేనే భవిష్యత్. ఆధ్యాత్మికత, యోగా సాధనతో హెల్తీ, వెల్తీ హ్యాపీ ఆంధ్రప్రదేశ్ సాధ్యం. ఆధ్యాత్మికాంధ్రప్రదేశ్ సాధించేందుకు కృషి చేద్దాం."అని ముఖ్యమంత్రి చెప్పారు.ప్రశాంత వాతావరణంలో యోగా గురువు రామ్ దేవ్ బాబాతో కలిసి యోగాభ్యాసం చేయడం ఎన్నటికీ మరువలేను.యోగాకు ప్రపంచస్థాయి గుర్తింపు తెచ్చిన ప్రధాని నరేంద్ర మోదీకి ధన్యవాదాలు.అన్నారు.పధాని మోడీ ప్రపంచానికి భారత దేశ శక్తిని చాటుతున్నారు... దేశాన్ని అగ్రభాగాన నిలుపుతున్నారు. సాంకేతికత.. ఆధ్యాత్మికత కాంబినేషన్‌తో వెళ్తేనే భవిష్యత్. ఆధ్యాత్మికత, యోగా సాధనతో హెల్తీ, వెల్తీ హ్యాపీ ఆంధ్రప్రదేశ్ సాధ్యం. ఆధ్యాత్మికాంధ్రప్రదేశ్ సాధించేందుకు కృషి చేద్దాం.యోగాంధ్ర2025లో విశాఖలో నిర్వహించి రికార్డులు సృష్టించాం.పధాని మోదీ సమక్షంలో గిన్నిస్ రికార్డులు, ప్రపంచ రికార్డులు సాధించాం.

వచ్చే ఏడాది తిరుపతిలో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహిస్తాం.1.33 లక్షల సెంటర్లల్లో కోటి మందికి పైగా యోగా సాధన చేస్తున్నారు. స్వర్ణ గ్రామ, వార్డు కార్యాలయాల్లో శాశ్వత యోగా మందిరాలు నిర్మిస్తాం.యోగా కార్యక్రమాల పర్యవేక్షణకు జిల్లా, మండల స్థాయి అధికారులను నియమిస్తాం.స్టాండర్డ్ యోగా ప్రోటోకాల్స్ రూపొందించేందుకు నిపుణుల బృందాన్ని ఏర్పాటు చేస్తాం.యోగాంధ్ర కోసం ప్రత్యేక పోర్టల్ ఏర్పాటు చేస్తాం. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నాం. రసాయన రహిత ఆహారాన్ని స్వీకరిస్తే అనారోగ్యం దరి చేరదు.రాష్ట్రంలో పచ్చదనాన్ని 50 శాతానికి పెంచుతాం.సంజీవని ప్రాజెక్టును ఆగస్టు 15వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేస్తాం.వైద్య నిపుణులను ప్రజలకు చేరువ చేస్తాం.సంజీవనిలో యోగాను చేరుస్తాం.రోజుకో గంట యోగా, ధ్యానం, ప్రాణాయామం చేయాలి.. ఆస్పత్రికి వెళ్లాల్సిన అవసరమే రాదు. కార్యక్రమం అనంతరం వ్యసన ముక్త భారత ప్రచార యాత్ర వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో యోగా ప్రాధాన్యత,ఇతరంశాలను వివరించే సంపుటిని సీఎం చంద్రబాబు ఆవిష్కరించారు. పలువురు కేంద్రమంత్రులు, రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. నగర వాసులు పెద్ద ఎత్తున యోగా కార్యక్రమానికి హాజరయ్యారు.

**>>యోగా కోసం ప్రత్యేక పోర్టల్..**

చంద్రబాబు ఈ కార్యక్రమంలో తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ యోగాంధ్ర2025లో విశాఖలో నిర్వహించి రికార్డులు సృష్టించాం. ప్రధాని మోడీ సమక్షంలో గిన్నిస్ రికార్డులు, ప్రపంచ రికార్డులు సాధించాం. నేను 30 ఏళ్ల నుంచి యోగా అభ్యాసం చేస్తాను. ప్రతి రోజూ బిజీగా ఉంటాను.. రకరకాల సమస్యలను ఫేస్ చేయాల్సి వస్తుంది. కానీ యోగాసాధన చేయడం వల్ల అన్ని ఇబ్బందులను అధిగమించగలుగుతున్నాను. టెక్నాలజీకి ఆధ్యాత్మికతత తోడైతే అన్ స్టాపబుల్. నేటి తరం టెక్నాలజీని అడాప్ట్ చేసుకున్నట్టే... యోగాను.. ఆధ్యాత్మికతను అడాప్ట్ చేసుకోవాలి."అని సీఎం చంద్రబాబు వివరించారు. రాష్ట్రంలో మొత్తం 1.07 కోట్లమంది పౌరులు, 2.5 లక్షల మంది శిక్షకులు యోగాలో పాల్గొన్నందుకు రెండు వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ దక్కాయి. వాటిని అధికారులు వేదికపై ముఖ్యమంత్రి చంద్రబాబుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో కేంద్రమంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, భూపతిరాజు శ్రీనివాస వర్మ, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్, రాష్ట్ర మంత్రులు సత్య కుమార్ యాదవ్, కందుల దుర్గేష్, అచ్చెన్నాయుడు, సవిత, పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని), రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మంతెన సత్యనారాయణ రాజు, మున్సిపల్ వ్యవహారాల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్. సురేష్ కుమార్, ఆయుష్ డైరెక్టర్ కేవీఎన్ చక్రధర్ బాబు, జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ, పతంజలి ఆయుర్వేద సహవ్యవస్థాపకులు ఆచార్య బాలకృష్ణ, వివిధ కార్పొరేషన్స్ చైర్మన్లు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. నగర వాసులు పెద్ద ఎత్తున ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో యోగాసనాలు ఆచరించడంతోపాటు పెద్దఎత్తున కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

# అంతా 'యోగముద్ర'లోనే

## ప్రపంచ వ్యాప్తంగా 12వ అంతర్జాతీయ యోగాడే

## కోల్‌కతా వేడుకల్లో పాల్గొన్న ప్రధాని మోడీ

## వివిధ రాష్ట్రాల్లో 'యోగా' చేసిన గవర్నర్లు, సిఎంలు

**న్యూఢిల్లీ,జూన్ 21:** ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్యం, శారీరక దృఢత్వాన్ని పెంపొందించే 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం ఆదివారం అట్టహాసంగా జరిగింది. భారత్‌తోపాటు ప్రపంచదేశాల్లోకూడా ఈ 12వ యోగాడేను సంపూర్ణ ఆరోగ్యజీవితానికి యోగా అన్న సందేశంతో నిర్వహించారు. ఐక్యరాజ్యసమితి, టైమ్స్ స్క్వేర్, చైనాలోని బీజింగ్ ఇతర ముఖ్యనగరాల్లోకూడా యోగాడే నిర్వహించారు. అంతేకాకుండా ప్రపంచదేశాల్లోని భారతీయ రాయబార కార్యాలయాల ఆవరణల్లో కూడా 12వ గ్లోబల్ యోగాడేను ఘనంగా నిర్వహించారు. ఈ ఏడాది భారతదేశపు ప్రధాన జాతీయ వేడుకకు పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలోని చారిత్రక రెడ్ రోడ్ వేదికైంది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఈ సభకు స్వయంగా హాజరై, వేలాది మంది ఉత్సాహవంతులైన ప్రతినిధులు, సాధారణ ప్రజలతో కలిసి సామూహిక యోగాసనాల కార్యక్రమంలో పాల్గొన్నారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లో ముఖ్యమంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్యేలతోపాటు గవర్నర్లు కూడా ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఈ సంవత్సరం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని 'ఆరోగ్యకరమైన వృద్ధాప్యం కోసం యోగా' అనే ప్రత్యేక నినాదంతో (థీమ్) నిర్వహించారు. వయసుతో సంబంధం లేకుండా శారీరక చలనశీలత, మానసిక ప్రశాంతత, రోగనిరోధక శక్తిని పెంపొందించుకోవడంలో యోగా ఎంతగానో దోహదపడుతుందని ఈ సందర్భంగా ప్రధాని నొక్కిచెప్పారు. రెడ్ రోడ్‌పై ఏర్పాటు చేసిన భారీ బహిరంగ వేదిక నుంచి మోడీ ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తూ యోగా అనేది ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మందిని అనుసంధానించే ఒక గొప్ప సామూహిక శక్తిగా ఎదిగిందని కొనియాడారు. మనం 20 ఏళ్ల వయసులో ఉన్నప్పటి కంటే 40 ఏళ్ల వయసు వచ్చేసరికి మరింత శారీరక ఫ్లెక్సిబిలిటీని సాధించడమే మన లక్ష్యం కావాలని పిలుపునిచ్చారు.

కోల్‌కతా నగరం ఈ ప్రధాన జాతీయ కార్యక్రమానికి ఆతిథ్యం ఇవ్వడం ఇదే తొలిసారి కావడంతో, నగరవ్యాప్తంగా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ఈ వేడుకల సన్నాహకంగా నగరంలో ముందస్తుగా దౌడ్ సే ధ్యాన్ (పరుగు నుండి ధ్యానం వైపు) మారథాన్, డ్రోన్ ప్రదర్శనలు నిర్వహించారు. ముఖ్యంగా గంగానదిపై 500 పడవల్లో ఒకేసారి యోగాసనాలు వేసి గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించేందుకు చేసిన ప్రయత్నం అందరినీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి సహా పలువురు ఉన్నతాధికారులు రాజకీయాలకు అతీతంగా పాల్గొని యోగా విశిష్టతను చాటారు. భారతదేశం ప్రతిపాదించిన ఈ యోగా సంస్కృతి ప్రపంచవ్యాప్తంగా డిజిటల్, భౌతిక రూపాల్లో విస్తరించింది. విదేశాల్లోని దాదాపు 210 భారతీయ దౌత్య కార్యాలయాల సమన్వయంతో అంతర్జాతీయంగా 2,500కి పైగా ప్రధాన నగరాలు, సాంస్కృతిక కేంద్రాలలో యోగా ఉత్సవాలు జరిగాయి. ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యాలయం కూడా ఈ దినోత్సవాన్ని ప్రత్యేకంగా నిర్వహించింది.

దేశంలోని కర్ణాటక, ఢిల్లీతో పాటు అన్ని రాష్ట్రాల్లోనూ స్వచ్ఛత, ఫిట్‌నెస్ కార్యక్రమాలతో ముడిపెట్టి సామూహిక యోగా సెషన్లను ఏర్పాటు చేశారు. ఖరీదైన పరికరాలు అవసరం లేకుండా, కేవలం శ్వాసపై నియంత్రణ, శారీరక సమతుల్యత ద్వారా ఒత్తిడిని తగ్గించి, నిద్రలేమి సమస్యలను దూరం చేసే యోగా విధానం ప్రస్తుత ఆధునిక వేగవంతమైన ప్రపంచంలో మానవాళికి ఒక సంజీవనిలా మారుతుందని ఆరోగ్య నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఇదిలా ఉంటే బెంగళూరు జైలులో 4000 మంది ఖైదీలు యోగా డే కార్యక్రమంలో పాల్గొన్నారు. దేశ సర్వోన్నత న్యాయస్థానంలో కూడా పలువురు న్యాయవాదులు, సిబ్బంది, న్యాయమూర్తులు 12వ అంతర్జాతీయ యోగా డేలో పాల్గొన్నారు. చీఫ్‌జస్టిస్ సూర్యకాంత్‌తోపాటు పలువురు సీనియర్ న్యాయమూర్తులుకూడా యోగాభ్యాసాలుచేసారు. ఆసియా,యూరోప్‌దేశాలు కూడా భారతీయ యోగా సంస్కృతికి ప్రాధాన్యతనిచ్చాయి. జపాన్, చైనా, అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్‌వంటి అభివృద్ధి చెందిన దేశాల్లో 12వ అంతర్జాతీయ యోగా డేను యోగా ఆచరణాత్మకంగా నిర్వహించడం గమనార్హం.

# మరో కేసు నమోదు

>> విడుదలయ్యారు. శనివారం నరసరావుపేట నుండి వినుకొండ వస్తుండగా విఠంరాజుపల్లివద్ద పోలీసులు మాజీ ఎమ్మెల్యే బ్రహ్మనాయుడుని అడ్డుకున్నారు. ఈ సందర్భంలో వైయస్సార్ పార్టీ కార్యకర్తలకు పోలీసులకు కొంత వాగ్వాదం జరిగింది, మాజీఎమ్మెల్యే సుమారు గంటలపాటు అంతరాయం జరిగింది. ఈక్రమంలో బొల్లాపైఅను మతిలేని ర్యాలీ, గుంపులుగుంపులుగా కార్యకర్తలు రోడ్లపైరావడంతో, పోలీసులు కేసు నమోదు చేసినట్లువినుకొండపట్టణ సిఐ ప్రభాకర్ తెలిపారు.

# సీపెట్‌లో ప్రవేశాలు

>> రూ.18 వేల నుంచి రూ.25 వేల వరకు జీతం అందేలా ఉద్యోగ అవకాశాలను సీపెట్ కల్పిస్తుందని తెలిపారు. పరిమిత సీట్లు మాత్రమే ఉన్నాయని, ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు ఇతర వివరాలకు 93985 35697 నంబరును సంప్రదించాలని సూచించారు.

## వారం - వర్జ్యం

22-06-2026, సోమవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
నిజ జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, శుక్లపక్షం, ఆరుద్ర కార్తె
అష్టమి మ.3.45
ఉత్తరఫల్గుణి ఉ.10.25
వర్జ్యం : రా.7.21-రా.9.03
దు.మ.12.35-మ.1.27
(2)మ.3.12-సా.4.04
రాహుకాలం - ఉ.7.30-9.00

## వార్తాఫలం

**మేషం :** స్త్రీ సంతాన విషయమై విశేషంగా శ్రమించి సత్ఫలితాలు సాధిస్తారు. సాంకేతిక విద్యలపై ఆసక్తి. బంధువుల కలయిక.

**వృషభం:**మీ ప్రతిభకు గుర్తింపు లభిస్తుంది. నూతన కార్యక్రమాలకు శ్రీకారంచుడతారు. విద్యా, ఉద్యోగావకాశాలు పొందుతారు.

**మిథునం:**అనుకోని ఆహ్వానాలు అందుకుంటారు. దీర్ఘకాలిక సమస్యలు తీరతాయి. వివాదాలకు దూరంగా వుండండి.

**కర్కాటకం:** సంఘంలో గౌరవ ప్రతిష్ఠలు పొందుతారు. ఋణాలు తీరి ఊపిరి పీల్చుకుంటారు. వాహన సౌఖ్యం.

**సింహం:** శ్రేయోభిలాషుల సూచనమేరకు నూతన వ్యాపారాలు ప్రారంభిస్తారు. మీ వారికి సహాయసహకారాలు అందిస్తారు.

**కన్య :** లీజులు, అగ్రిమెంట్లు పొడిగింపునకు ప్రయత్నం చేస్తారు. ఇంటియందు శుభకార్యాల ప్రస్తావన ఉంటుంది.

**తుల :** ఉద్యోగులు ఉన్నత పదవులు పొందుతారు. పారిశ్రామిక రంగాలలోని వారికి విదేశీ పర్యటనలు పొందుతారు.

**వృశ్చికం:**ప్రయాణాలలో వస్తుభద్రతకు ఎక్కువగా ప్రాధాన్యత ఇవ్వండి. కొన్ని సందర్భాలలో తప్పని వృథా ప్రయాణాలు.

**ధనుస్సు:** రిజిస్ట్రేషన్స్, ఇన్సూరెన్స్, లైసెన్స్‌ల పునరుద్ధరణ వంటివి సజావుగా సాగిపోతాయి. బంధువుల కలయిక.

**మకరం:** కొద్దిపాటి మానసిక ఆందోళనకు గురిచేసినా, ఆచరణలో చెడుఫలితాలను ఇవ్వదు. స్పెక్యులేషన్ మధ్యస్తంగా ఉంటుంది.

**కుంభం:** ముఖ్యమైన జటిలమైన సమస్యలు పరిష్కారమవుతాయి. మీమీద నమ్మకమును, గుడ్‌విల్‌ను ఋజువుచేసుకుంటారు.

**మీనం :** రాజకీయ విభేదములకు ఆస్కార మున్నది, జాగ్రత్తవహించండి. స్వంత విషయములలో ఇతరుల జోక్యమును రానీయకండి. వాహన సౌఖ్యం.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# 3 భారీ యుద్ధనౌకలు

>> కేవలం కొత్త యుద్ధ నౌకలది మాత్రమే కాదని, పెరుగుతున్న భారత స్వావలంబన ప్రయాణం అని ఆయన అభివర్ణించారు. "ఏ దేశానికైతే బలమైన సముద్ర శక్తి ఉంటుందో, ఆ దేశానికి బలమైన ఆర్థిక, వ్యూహాత్మక ప్రభావం ఉంటుంది. ఈ వాస్తవాన్ని భారత్ బాగా అర్థం చేసుకుని, అందుకు తగ్గట్టుగా సిద్ధమవుతోంది," అని మోడీ తెలిపారు. ఈ కార్యక్రమంలో నేవల్ స్టాఫ్ చీఫ్ అడ్మిరల్ కృష్ణ స్వామినాథన్, పశ్చిమ బెంగాల్ గవర్నర్ ఆర్ఎన్ రవి, రాష్ట్ర ముఖ్యమంత్రి సువేందు అధికారి తదితరులు పాల్గొన్నారు. జిఆర్ఎస్ఇ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అయిన కమోడోర్ పిఆర్ హరి (రిటైర్డ్) కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అడ్మిరల్ స్వామినాథన్ తన ప్రసంగంలో, గతంలో నావికాదళానికి అప్పగించిన అదే తరగతికి చెందిన ఫ్రిగేట్ (యుద్ధనౌక)తో పోలిస్తే, ఐఎన్ఎస్ దునగిరి నిర్మాణానికి 33 శాతం తక్కువ సమయం పట్టిందని పేర్కొన్నారు. అలాగే, ఐఎన్ఎస్ అగ్రయ్ వంటి యుద్ధనౌకల నిర్మాణంలో ప్రైవేట్ షిప్‌యార్డ్‌లు పోషించిన పాత్రను ఆయన అభినందించారు.

**మూడు నౌకల ప్రత్యేకతలు**

**దూనగిరి:** ఇది అత్యాధునిక స్టెల్త్ యుద్ధ నౌక. బ్రహ్మోస్ క్షిపణులు, మధ్యశ్రేణి గగనతల క్షిపణి వ్యవస్థ వంటి శక్తిమంతమైన ఆయుధాలు, సెన్సార్లతో దీన్ని తీర్చిదిద్దారు. సుదీర్ఘ సముద్ర కార్యకలాపాలకు అనువుగా, బహుముఖ ఆధిపత్యం ప్రదర్శించేలా దీనిని రూపొందించారు.

**సంశోధక్:** ఇది ఒక భారీ సర్వే నౌక. తీరప్రాంత, లోతైన సముద్ర జలాల్లో హైడ్రోగ్రాఫిక్ సర్వేలు నిర్వహించడానికి, రక్షణ, పౌర అవసరాల కోసం సముద్ర గర్భ డేటాను సేకరించడానికి ఇది ఉపయోగపడుతుంది. అటానమస్ అండర్‌వాటర్ వెహికల్స్, రిమోట్లీ ఆపరేటెడ్ వెహికల్స్ వంటి అధునాతన వ్యవస్థలు ఇందులో ఉన్నాయి.

**అగ్రే:** ఇది అర్నాల తరగతికి చెందిన జలాంతర్గామి విధ్వంసక నౌక. తీరప్రాంత జలాల్లో శత్రు జలాంతర్గాములను గుర్తించి, నాశనం చేసేందుకు దీన్ని రూపొందించారు. తేలికపాటి టార్పెడోలు, స్వదేశీ రాకెట్ లాంచర్లు, అత్యాధునిక సోనార్ వ్యవస్థలు దీని ప్రత్యేకతలు.

# ప్రోగ్రెస్ రిపోర్టులు

>> సమీక్షించారు. రెండేళ్ల క్రితం రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, పోలవరం ప్రాజెక్టు, రాజధాని అమరావతి, విద్యుత్ రంగం, శాంతి భద్రతలు, మైనింగ్, ఎక్సైజ్ రంగాలపై ముఖ్యమంత్రి శ్వేత పత్రాలు విడుదల చేశారు. గత ప్రభుత్వంలో విధ్వంసమైన రాష్ట్రాన్ని రెండేళ్లలో వికాసం వైపు ఎలా తీసుకెళ్లింది... రాష్ట్రం అన్ని రంగాల్లో ఎంతలా పురోగతి సాధించింది... వంటి అంశాలను తాజా ప్రోగ్రెస్ రిపోర్టులో పొందుపరచాలని ముఖ్యమంత్రి చెప్పారు. రెండేళ్లలో చాలా శాఖల్లో ఎన్నో మార్పులు తీసుకువచ్చామని, సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, గవర్నెన్స్‌లో తెచ్చిన సంస్కరణలు ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వాన్ని ఎలా గాడిలో పెట్టామో చెప్పడంతో పాటు ఫేక్ న్యూస్‌కు చెక్ పెట్టడమే ప్రోగ్రెస్ రిపోర్టుల ఉద్దేశమన్నారు. నాటి 7 శ్వేత అంశాలతో సహా ఈసారి కొత్తగా డెవలప్మెంట్, గవర్నెన్స్, వెల్ఫేర్ అంశాలపైనా రిపోర్టులు విడుదల చేయాలని సిఎం స్పష్టం చేశారు. అగ్రికల్చర్, ఇండస్ట్రీస్, ఇన్ఫ్రాస్ట్రక్చర్, టూరిజం అంశాలతో డెవలప్మెంట్ ప్రోగ్రెస్ రిపోర్ట్... ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత కొత్తగా తెచ్చిన పాలసీలు, అనుసరించిన విధానాలు, చేపట్టిన సంస్కరణలతో గుడ్ గవర్నెన్స్ ప్రోగెస్ రిపోర్ట్... సంక్షేమం, పి4 వంటి వాటితో వెల్ఫేర్ - ఎంపవర్మెంట్ ప్రోగ్రెస్ రిపోర్ట్ ఈసారి విడుదల చేయనున్నారు. వీటిలో ఫైనాన్స్, డెవలప్మెంట్, వెల్ఫేర్, గవర్నెన్స్... ఈ 4 అంశాలకు సంబంధించిన ప్రోగ్రెస్ రిపోర్టును ముఖ్యమంత్రి విడుదల చేస్తారు. 6 పేపర్లు మంత్రులు రిలీజ్ చేసిన తర్వాత... మిగిలిన 4 పేపర్లు ప్రజల ముందుంచాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. జూలై 18కల్లా మొత్తం అన్ని రిపోర్టులు విడుదల చేసేలా ప్రణాళికను సిద్ధం చేయాలని సిఎం సూచించారు. ఇవన్నీ విడుదల చేసిన తర్వాత... అన్నీ కలిపి పుస్తక రూపంలో తీసుకురావాలని సిఎం ఆదేశించారు. ప్రతీ ఏడాది ప్రోగ్రెస్ రిపోర్టులు తప్పనిసరిగా ఇవ్వాలని ఈ సందర్భంగా చెప్పారు. ప్రోగ్రెస్ రిపోర్టులో ముందుగా సోమవారం విద్యుత్ రంగంపై ప్రోగ్రెస్ రిపోర్ట్ విడుదల చేయనున్నారు. మంత్రులు పయ్యావుల కేశవ్, పొంగూరు నారాయణ, అనగాని సత్యప్రసాద్, వంగలపూడి అనిత, గొట్టిపాటి రవికుమార్, నిమ్మల రామానాయుడు, కొల్లు రవీంద్ర, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, పలువురు అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు. సీఎస్ సాయి ప్రసాద్, ఇతర ఉన్నతాధికారులు సమీక్షలో పాల్గొన్నారు.

# ఇటు శాంతి.. అటు వార్నింగ్

>> సున్నితంగానే ఉందని చెప్పారు. విస్తృత ప్రాంతీయ సంధిని సాధించడానికి ట్రంప్ కట్టుబడి ఉన్నారని, లెబనాన్ కాల్పుల విరమణ ఒక పరిష్కారం దిశగా కీలకమైన అడుగుగా భావిస్తున్నట్లు వాన్స్ చెప్పారు. అమెరికాను చిరాకు పరిచే విధానాలను ఇరాన్‌విడిచిపెడితే, ఆ దేశంతో కొత్త అధ్యాయం ప్రారంభించేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగాఉన్నట్లు ప్రకటించారు. అయితే, ఇరాన్ షరతులు నెరవేరితే తప్పా, చర్చల తదుపరి దశకు వెళ్లేందుకు సిద్దంగా లేదు. కీలకమైన చర్చల్లో అణు కార్యక్రమానికి సంబంధించిన అంశాలు, లెబనాన్‌పై ఇజ్రాయిల్ దాడుల్ని ఆపడం కీలకంగా మారాయి. ఇజ్రాయిల్, హిజ్బుల్లా మధ్య దాడులు ఆపడంతో అమెరికా విఫలమైందని ఇరాన్ నేతలు ఆరోపిస్తున్నారు. మరోవైపు, ప్రపంచ చమురుకు కీలకంగాఉన్న హార్ముజ్ జలసంధిపై నియంత్రణ సాధించేందుకు ఇరాన్ ప్రయత్నిస్తుండటం చర్చల్ని సంక్లిష్టంగా మార్చాయి.

**స్విట్జర్లాండ్‌లో శాంతి చర్చలు షురూ...**

శాంతి ఒప్పందానికి సంబంధించి తుది, సాంకేతిక అంశాలపై చర్చించేందుకు అమెరికా ఇరాన్‌లు రెడీ అయిన సంగతి తెలిసిందే. స్విట్జర్లాండ్ (స్విస్) వేదికగా జరగనున్న ఈ చర్చల కోసం అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఆదివారం స్విట్జర్లాండ్ చేరుకున్నారు. మిగతా అమెరికా ప్రతినిధులైన స్టీవ్ విట్‌కాఫ్, జారెడ్ కుష్నర్ ఇప్పటికే స్విస్‌లో ఉన్నారు. ఇరాన్ ప్రతినిధులు కూడా స్విట్జర్లాండ్ చేరుకున్నారు. ఈ చర్చల్లో ఇరాన్, అమెరికాతోపాటు మధ్యవర్తిత్వం వహిస్తున్న పాకిస్తాన్, ఖతార్ కూడా పాల్గొంటున్నాయి. ఈ చర్చల్ని సాంకేతికపరమైన అంశాలుగా పేర్కొంటున్నారు. ఆదివారమే ఈ చర్చలు జరిగే అవకాశం ఉంది. లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడుల నేపథ్యంలో ఇరాన్ చర్చలకు నిరాకరించింది. చర్చలు సానుకూలంగా సాగుతాయని ఆశిస్తున్నట్లు జేడీ వాన్స్ చెప్పారు. ఇరాన్ అణుకార్యక్రమంతోపాటు ప్రాంతీయ భద్రత ప్రధానంగా ఈ చర్చలు జరుగుతాయి. ఇరాన్‌లోని అణుకేంద్రాలను ఐక్యరాజ్యసమితి కమిటీ తనిఖీ చేసేందుకు అనుమతించాలని అమెరికా డిమాండ్ చేస్తోంది. ఖతార్‌లో నిలిపివేసిన ఆరు బిలియన్ డాలర్ల ఇరాన్ నిధులను తీసుకునేందుకు అమెరికా అంగీకరించనుంది. ఈ నిధుల్ని ఇరాన్ మానవతా అవసరాల కోసమే వాడాలని అమెరికా షరతు. ఈ డబ్బులతో ఆహారం, మందులు వంటివి మాత్రమే ఇరాన్ కొనుగోలు చేయాలి. హార్ముజ్ జలసంధి నిర్వహణ విషయంలో స్పష్టత రావాల్సి ఉంది. ఇదే సమయంలో లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు ఆపాలని ఇరాన్ డిమాండ్ చేస్తోంది. వీటిన్నింటిపై ఈ రోజు చర్చలు జరిపి, సాంకేతికంగా ఒక ఒప్పందానికి రావాల్సి ఉంది.

# సాయికృష్ణ అదృశ్యంపై విచారణకు సిట్

>> విజయలక్ష్మి ఆమె బంధువుల స్టేట్‌మెంట్‌లను రికార్డు చేసారు. అంతేకాక తొలుత సాయికృష్ణను తీసుకువచ్చిన టాస్క్‌ఫోర్స్ ఎసిపిని కూడా విచారించారు. కృష్ణలంక పోలీస్‌స్టేషన్‌లో సంఘటన జరిగినప్పుడు ఉన్న కానిస్టేబుళ్ళను కూడా విచారించినట్లు సమాచారం.అంతేకాక కృష్ణలంక పోలీస్‌స్టేషన్‌లో నేరారోపణలు ఎదుర్కొంటున్న వారిపై థర్డ్ డిగ్రీ అమలు పర్చడానికి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఏర్పాట్లను కూడ ఆయన పరిశీలించారు. సదరు స్టేట్‌మెంట్ల ట్యాంపరింగ్‌కు అవకాశం లేని విధంగా కేంద్ర హోంశాఖ రూపొందించిన 'ఈ సాక్ష్య' టూల్ ద్వారా విచారించిన వారి వాంగ్మూలాలను వీడియో రికార్డు చేశారు. అయితే ఘటన జరిగినప్పుడు పాలుపంచుకున్నారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న కొంత మంది కానిస్టేబుళ్లు మాత్రం సెలవులో వెళ్లినట్లు తెలియవచ్చింది. సిట్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసిన నేపథ్యంలో అవసరమైతే అదనపు సిబ్బంది,సాంకేతిక సహాయం,ఫోరెన్సిక్ మద్దతు తదితర వనరులను ఇతర విభాగాల నుండి తీసుకునే స్వేచ్ఛను ప్రభుత్వం కల్పించింది. రాష్ట్రంలోని అన్ని శాఖలు,ఫోరెన్సిక్ సంస్థలు,సంబంధిత అధికారులు సిట్‌కు పూర్తి సహకారం అందించాలని ప్రభుత్వం ఆదేశించినట్లు సమాచారం.

**విద్యుత్ దహన వాటికలో రికార్డుల స్వాధీనం**

సాయికృష్ణను విద్యుత్ దహన వాటికలో తగులబెట్టారని ఆరోపణలు ఎదుర్కుంటున్న నేపథ్యంలో అక్కడ కూడ పటమట సిఐ పావన్ కిషోర్ కృష్ణలంకలోని స్వర్గపురికి వెళ్లి కంప్యూటర్‌లో ఆయా తేదీలలో దహనం చేసిన మృతదేహాల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆపరేటర్ భాషా,కాటికాపరి శివ సెల్‌ఫోన్‌లను సైతం స్వాధీనం చేసుకున్నారు. వారిని విచారిస్తున్నారు. మే 23 నుండి 26 వరకు రాత్రి 8 గంటల సమయంలో రెండు అనాథ మృతదేహాలను పోలీసులు స్వర్గపురికి తెచ్చారని ఈ సందర్భంగా సిబ్బంది తెలిపినట్లు సమాచారం. వాటిని అక్కడ ఉంచేందుకు తొలుత నిరాకరించడంతో డివిజన్ శానిటరీ ఇనస్పెక్టర్ సిఫార్సుతో ఫ్రీజర్‌లో ఉంచి 24 మధ్యాహ్నం దహనం చేసినట్లు తెలిపినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో సిఐ నాగరాజుకు శానిటరీ ఇనస్పెక్టర్‌కు మధ్య ఈ విషయంపై వాదనలు జరిగినట్లుగా పోలీసు అధికారులకు వారు చెప్పినట్లు సమాచారం. ఇదిలా ఉండగా సిఐ నాగరాజు ఇంటికి వెళ్లి పోలీసులు ఆయన వాంగ్మూలాన్ని రికార్డు చేస్తున్నారు. బందరు రోడ్డులోని రమేష్ హాస్పటల్ సమీపంలో ఉన్న ఒక హోటల్‌లో సిఐ నాగరాజు పేరున 23వ తేదీన రూం తీసుకున్నట్లుగా ఈ బృందం విచారణలో తేలడంతో దాని గురించి కూడ మాజీ సిఐ నాగరాజును ప్రశ్నించినట్లు తెలియవచ్చింది.మాజీ సిఐ నాగరాజు అరెస్ట్‌కు రంగం సిద్దం చేస్తున్నట్లు సమాచారం.

# ఎగసిన 'కాపు' సెగ!

>> వుంటే చంపేస్తారా అలా చేయమని రాజ్యాంగం చెప్పిందా అని బొత్స సత్యనారాయణ ప్రశ్నించారు. కాపు నేతలను రౌడీలు అనడం సరికాదని ఒకవేళ ఆ పదాన్ని వాడాలనుకుంటే పవన్ కల్యాణ్‌కే వర్తిస్తుందని పేర్కొన్నారు.

కాపు, తెలగ, బలిజ, ఒంటరి, మున్నూరు కాపు వర్గాలకు అండగా నిలిచేందుకు రాష్ట్రవ్యాప్తంగా మూడు ప్రాంతీయ టాస్క్ ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. బాధితులకు తక్షణ ఆర్థిక సాయం అందించేందుకు అధునాతన క్లౌడ్ ఫండింగ్ విధానాన్ని తీసుకురావాలని తీర్మానించారు. కార్పొరేట్ వ్యాపారులకు కొమ్ముకాస్తూ, సామాన్య మరియు ఆక్వా రైతులను అప్పులపాలు చేస్తున్న ప్రభుత్వ వైఖరి మార్చుకోకపోతే సహించేది లేదని స్పష్టం చేశారు.ఈ ఆత్మీయ కలయిక కేవలం ఒక ప్రాంతానికే పరిమితం కాదని, రాబోయే రోజుల్లో భారీఎత్తున కాపు ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించి కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజాకోర్టులో తేల్చుకుంటామని నేతలు ప్రతిజ్ఞ చేశారు. రాష్ట్రంలో సాగుతున్న రెడ్ బుక్ రాజకీయం,కాపు సామాజికవర్గాన్ని లక్ష్యంగా చేసుకుని సాగుతున్న అణచివేతపై వైకాపా కాపు ప్రజాప్రతినిధులు,ముఖ్య నేతలు వ్యూహాత్మక సమరశంఖం పూరించారు.వైకాపా పాలనలో ఖీకాపు నేస్తంఖీ కింద మహిళల ఖాతాల్లో రూ.2,000 కోట్లు జమ చేసిన ఉదంతాన్ని గుర్తు చేస్తూ.. నేడు మహిళా సాధికారతను కూటమి ప్రభుత్వం గాలికొదిలేసిందని ఆరోపించారు. ఈ సమావేశానికి రాష్ట్రవైసీపీ ముఖ్య నాయకులు అంబటి రాంబాబు, పేర్ని నాని గుడివాడ అమర్నాథ్, కురసాల కన్నబాబు, తోట నరసింహం,కదిరి బాబురావు, ధర్మ శ్రీ, జ్యోతుల చంటిబాబు, సుంకర పావని, అంబటి మురళి, కొట్టు సత్యనారాయణ,జక్కంపూడి రాజా, రౌతు సూర్య ప్రకాష్, జి ఎస్ రావు, మాకినీడి శేషు కుమారి, బిహెచ్ రావు,,వంగా గీత, వంటెద్దు వెంకన్నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# సైబరాబాద్ సైబర్ క్రైం పోలీసులకు చిక్కిన ఆన్‌లైన్ ట్రేడింగ్ నేరగాళ్లు

**హైదరాబాద్, జూన్ 21, ప్రభాతవార్త:** ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరిట అమాయకులను ముంచుతూ అందినంత దోచుకుంటున్న ఓ ముఠాను సైబరా బాద్ సైబర్ క్రైం పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా వీరి వద్ద నుంచి 26.57 లక్షల రూపాయల నగదును జప్తు చేశారు. దీనికి సంబ ంధించిన వివరాలను సైబరాబాద్ సైబర్ క్రైం ఎసిపి రవీందర్ రెడ్డి ఆదివారం మీడియాకు వెల్లడించారు. సైబరాబాద్ పరిధిలో నివసించే శ్రీకా ంత్ రెడ్డి అలియాస్ సురేష్ రెడ్డికి గుర్తు తెలియని వ్యక్తులు ఎలెరా క్యాపిటల్ డెస్క్ పేరిట వాట్సాప్ సందేశాలు పంపి ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో దండిగా లాభాలు వస్తాయని నమ్మించారు. అనంతరం అతడిని తెలివిగా మోసం చేసి విడతలవారిగా 95 లక్షల రూపాయలను కాజేశారు. మొదట గా 46 లక్షల రూపాయలు పెట్టుబడిగా తీసుకుని రెండు లక్షల నాలుగు వేల రూపాయల లాభం చూపారు. అయితే ఇదంతా సెల్‌ఫోన్ స్క్రీన్ పై కనిపించినా దానిని డ్రా చేసుకునే అవకాశం ఇవ్వలేదు. అనంతరం మరోదఫా 49 లక్షల రూపాయలు వసూలు చేసి బోర్డు తిప్పేశారు. దీని పై బాధితుడి ఫిర్యాదు మేరకు సైబరాబాద్ సైబర్ క్రైం పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేబట్టగా ఇది ఆన్‌లైన్ ట్రేడింగ్ మోసంగా తేలి ంది. దీనిపై విచారణ చేయగా వైజాగ్‌లోని గాజువాకకు చెందిన ఒక ముఠా ఈ గోల్‌మాల్‌కు పాల్పడినట్లు తేలింది. ఈ ఏడుగురు ఇతర ప్రాంతాలలో వుండే బడా సైబర్ నేరగాళ్లకు మ్యూల్ ఖాతాలు ఇచ్చినట్లు తేలింది. ఈ నేరానికి పాల్పడిన వారిని రపర్తి గౌతం (ఇతను ఎ8 నిందితు డు), సేనాపతి పెంటయ్య (ఇతను ఎ9 నిందితుడు), బొడాల సాయికుమార్ (ఇతను ఎ10 నిందితుడు), మురపాకుల కుమార్ (ఇతను ఎ11 నిం దితుడు), విజ్జిపు సత్యనారాయణ (ఇతను ఎ13 నిందితుడు), మంత్రి సాయికుమార్ (ఇతను ఎ14 నిందితుడు) ఊట నారాయణ (ఇతను ఎ15 నిందితుడు)గా గుర్తించారు. ఈ ముఠా మనీలాండరింగ్‌కు పాల్పడు తున్నట్లు తేలింది.

## నేడు ఈదురుగాలులతో కూడిన వానలు

**విజయవాడ.జూన్ 21, ప్రభాతవార్తప్రతినిధి:** రాయలసీమ, దాని పరిసర ప్రాంతాలపై ఉపరితల ఆవర్తనం విస్తరించి ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. ఛత్తీస్‌గఢ్ నుండి తెలంగాణ వరకు ద్రోణి కొనసాగుతుందన్నారు.వీటి ప్రభావంతో సోమవారం మేఘవృతమైన వాతావరణంతో పాటు చెదురు మదురుగా మోస్తరు నుంచి భారీ వర్షాలు.. కురిసే అవకాశం ఉందన్నారు. బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండి తగిన జాగ్రత్తలు తీసుకో వాలని సూచించారు. సోమవారం శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, మార్కా పురం, ప్రకాశం, నెల్లూరు, రాయలసీమ జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు. కురిసే అవకాశం ఉందని తెలిపారు. అలాగే మిగతా జిల్లాల్లో కొన్ని ప్రాంతాల్లో పిడుగులతో కూడిన తేలిక పాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొ న్నారు. విద్యుత్ వైర్లు తెగిపడి ఉంటే వాటిని గమనిస్తూ వీలైనంత దూరంగా ఉండాలన్నారు. ఆకాశం మేఘావృతమై ఉరు ములు వినిపించిన వెంటనే పొలాల్లో పనిచేసే రైతులు,శ్రామికులు, పశుకాపరులు మరింత అప్రమత్తంగా ఉండి సురక్షిత ప్రాంతాలకు వెళ్లా లన్నారు.ఇక ఆదివారం ఏపీలో కోస్తా,ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో అక్కడక్కడ ఓ మోస్తరు వానలు పడ్డాయి.

## సిఎం చంద్రబాబుకు ముసలితనమే లేదు: కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

**విజయవాడ,జూన్ 21, ప్రభాతవార్తప్రతినిధి:** అమరావతిలో కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన విజయోత్సవ సభలో కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడారు. కూటమి ప్రభుత్వ నాయకులు ప్రజలకు సేవ చేయడానికి అంకితభావంతో పనిచేస్తున్నారని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు యువకుడిలా శ్రమిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు ప్రశంసించారు. రాష్ట్రానికి రావాల్సిన నిధుల కోసం అందరూ కలిసి పనిచేస్తామని, రాష్ట్ర అభివృద్ధి కోసం మరో 30 ఏళ్లు ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలో ఉండేలా ప్రజలు ఆశీర్వదించాలని ఆయన పిలుపునిచ్చారు. "కష్టం నేను పడతాను" అంటూ సీఎం చంద్రబాబు నాయుడు ఎంతో కష్టపడుతున్నారని రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు.

చంద్రబాబు నాయుడికి అసలు ముసలితనమే లేదని, ఆయన ఒక నవయువ కుడిలా పనిచేస్తున్నారని కొనియాడారు. ప్రజలకు ఎలాగైనా మంచి చేయాలనేదే మన సీఎం నిరంతర ఆలోచన అని ఆయన స్పష్టం చేశారు.

# తిరుమల సమాచారం



## యోగాభ్యాసంతో శారీరక దృఢత్వంతో పాటు మానసిక వికాసం: టిటిడి ఇఒ రవిచంద్ర

**తిరుమల,జూన్ 21ప్రభాతవార్తప్రతినిధి:** ప్రతిరోజూ యోగాభ్యాసం చేయడం ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక వికాసం, ప్రశాంతతను పెంపొందించుకోవచ్చని టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర తెలిపారు. శ్రీవారి సేవలో నిత్యం నిమగ్నమై లక్షలాది మంది భక్తులకు సేవలందించే టిటిడి ఉద్యోగులు యోగను అలవర్చుకుంటే ఆరోగ్యవంతమైన, ఆనందమయమైన జీవితం గడపడంతో పాటు వారి కుటుంబాల్లోనూ సంతోషం వెల్లివిరుస్తుందన్నారు.అంతర్జాతీయ యోగ దినోత్సవం సందర్భంగా ఆదివారం ఉదయం టిటిడి పరిపాలనా భవనం పరేడ్ మైదానంలో యోగ కార్యక్రమం జరిగింది. టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర యోగ ప్రాముఖ్యతను వివరించారు. గత 14 రోజులుగా క్రమశిక్షణతో యోగ సాధన చేసిన ఉద్యోగులు, సిబ్బందిని ఈవో ప్రత్యేకంగా అభినందించారు. తాను కూడా ఒకప్పుడు బలవంతంగా యోగ ప్రారంభించినప్పటికీ, అది క్రమంగా అలవాటై ఆరోగ్యవంతమైన జీవనశైలికి దారి తీసిందని తన అనుభవాన్ని పంచుకున్నారు. టిటిడి జెఇఒ డాక్టర్ ఎ. శరత్ మాట్లాడుతూ గతంలో అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని ఒక రోజు మాత్రమే నిర్వహించేవారని, ఇఒ ముద్దాడ రవిచంద్ర ఆదేశాల మేరకు జూన్ 7 నుండి 21 వరకు 14 రోజుల పాటు టిటిడి సంస్థల్లో విస్తృత స్థాయిలో యోగ శిక్షణ కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. ఉద్యోగులందరూ ఇదే స్ఫూర్తితో యోగను నిత్యజీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. ధ్యాన మూలమిదం జగత్' సీడీ, పుస్తకావిష్కరణ, స్విమ్స్ వారు రూపొందించిన బ్రోచర్ ను టిటిడి ఈవో ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముందు పూజా కార్యక్రమం, జ్యోతి ప్రజ్వలనతో యోగ దినోత్సవాన్ని ప్రారంభించారు. అనంతరం"ధ్యాన మూలమిదం జగత్","యోగ – ఒక పరిచయం" సీడీ మరియు పుస్తకాన్ని ఈవో ఆవిష్కరించారు. ఈషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన యోగాసనాలను అధికారులు, సిబ్బంది, విద్యార్థులు సమిష్టిగా అభ్యసించారు. గత 14 రోజుల యోగ శిక్షణలో ప్రతిభ కనబరిచిన అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులకు ఇఒ ప్రశంసా పత్రాలు అందజేశారు. టిటిడి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి పిఆర్ఒ (ఎఫ్ఏసీ) నీలిమ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యులు నన్నపనేని సదాశివరావు, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఇన్‌చార్జి కార్యదర్శి డాక్టర్ మేడసాని మోహన్, సివిఎస్ఒ కె.వి. మురళీ కృష్ణ, స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్‌వి కుమార్, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కేన్సర్‌ను పారద్రోలే పవిత్ర యజ్ఞం

### దేశంలోనే పేరొందిన సమగ్ర కేన్సర్ ఆస్పత్రిగా 'బసవతారకం' సేవలు
### హైదరాబాద్‌లో నేడు రజతోత్సవాలు
### హాజరుకానున్న సిఎం చంద్రబాబు

**విజయవాడ, జూన్ 21,ప్రభాతవార్తప్రతినిధి:** క్యాన్సర్ చికిత్సను సామాన్యులకు అందు బాటులోకి తీసుకురావాలనే సంకల్పంతో ప్రారంభమైన బసవతారకం ఇండోఅమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ 25 ఏళ్ల సేవా ప్రస్థానాన్ని పూర్తి చేసుకుందని మానవ వనరుల శాఖా మంత్రి నారా లోకేష్ తెలిపారు.ఈ మేరకు ఆయన కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. క్యాన్సర్ వ్యాధితో పోరాడుతున్న వారి జీవితాలు మధ్యలోనే ముగిసిపోకూడదన్న ఆలోచనతో దివంగత నందమూరి తారక రామారావు ఆధ్వర్యంలో 1988లో ఈ కార్యక్రమానికి అంకురార్పణ జరిగింది. వైద్య రంగ నిపుణులు, శాస్త్రవేత్తలు, ప్రవాస భారతీయులు, దాతల సహకారంతో ట్రస్ట్ ఏర్పాటుకు పునాదులు పడగా, 2000 సంవత్సరంలో అప్పటి ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయిచే 100 పడకలతో ఆస్పత్రి ప్రారంభమైంది. అనంతరం సేవల విస్తరణకు అనుగుణంగా దశలవారీగా అభివృద్ధి చెందుతూ ప్రస్తుతం 650 పడకల సామర్థ్యంతో దేశంలోనే ప్రముఖ సమగ్ర క్యాన్సర్ చికిత్స, పరిశోధనా కేంద్రంగా ఎదిగింది. గత పాతికేళ్లుగా సేవాభావం, మానవతా దృక్పథంతో వైద్య సేవలు అందిస్తూ బసవతారకం ఆస్పత్రి దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలతో పాటు పొరుగు రాష్ట్రాల నుంచి కూడా వేలాది మంది రోగులు బసవతారకం ఆస్పత్రికి వచ్చి చికిత్స పొందుతున్నారు. ప్రస్తుతం ప్రతేడాది 3 లక్షల మందికి పైగా అవుట్‌పేషెంట్లు, సుమారు 90 వేల మంది ఇన్‌పేషెంట్లకు ఆస్పత్రి సేవలందిస్తోంది. ఇప్పటివరకు 8 వేలకుపైగా క్యాన్సర్ శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహించగా, 86 బోన్ మ్యారో మార్పిడి చికిత్సలు నిర్వహించారు. క్యాన్సర్ చికిత్స కోసం ఆస్పత్రిని ఆశ్రయించే వారిలో 65 శాతం మందికిపైగా ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన వారే ఉన్నారు. ఆయా రంగాల్లో ప్రత్యేక నైపుణ్యం కలిగిన సుమారు 250 మంది వైద్యులు, వైద్య సిబ్బంది రోగులకు సేవలందిస్తున్నారు. దాతృత్వం, వైద్య నిపుణుల ప్రతిభ, సమాజం వైపు నుంచి లభించే మద్దతు, ప్రభుత్వ ప్రజారోగ్య కార్యక్రమాలను సమన్వయం చేసుకుంటూ క్యాన్సర్‌పై సమర్థవంతమైన పోరాటం చేయవచ్చని ఈ సంస్థ తన 25 ఏళ్ల ప్రస్థానంతో చాటిచెప్పింది. ఈ వైద్యసంస్థ రజతోత్సవ వేడుకలు సోమవారం సాయంత్రం హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీ నోవోటెల్‌లో నిర్వహించనున్నారు. నందమూరి బాలకృష్ణ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు సహా వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, వైద్య నిపుణులు, దాతలు, ఆస్పత్రి సేవలతో అనుబంధం కలిగిన అతిథులు హాజరు కానున్నారు.

## ఈతకు దిగి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మృతి

**విజయవాడ,జూన్ 21,ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీకాకుళం జిల్లా లావేరు గ్రామానికి చెందిన యువ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ పోతిరెడ్డి మురళీ (24) ఉండవల్లి కరకట్ట వద్ద విషాదకరంగా మృతి చెందాడు. విప్రో సంస్థలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న మురళీ ప్రస్తుతం తన ఇంటి నుండే వర్క్ ఫ్రమ్ హోమ్ చేస్తున్నారు.తన స్నేహితుడి సోదరికి విజయవాడలో ఆదివారం నీట్ పరీక్ష రాయాల్సి ఉంది. దాంతో తన మిత్రుడు,అతని సోదరితో పరీక్ష రాయించడానికి మురళీ విజయవాడకు వచ్చారు.ఈ క్రమంలో ఆదివారం ఉదయం ఉండవల్లి కరకట్టలోని ఎత్తిపోతల పథకం వద్ద సరదాగా ఈత కొట్టేందుకు నీటిలోకి దిగగా ప్రమాదవశాత్తు గల్లంతయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు గాలింపు చేపట్టగా మురళీ మృతదేహం లభ్యమైంది. తాడేపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మురళీ అకాల మరణంతో లావేరు గ్రామంలో మరియు స్నేహితుల వర్గాల్లో తీవ్ర విషాదం నెలకొంది.



## వేంకటేశ్వర సుప్రభాతం.. గోవిందనామ స్మరణతో చంద్రబాబు యోగా సాధన

**విజయవాడ, జూన్ 21 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో యోగాంధ్ర కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించింది. ప్రముఖ యోగా గురువు బాబా రాందేవ్ సమక్షంలో పలువురు యోగాసనాలు సాధన చేశారు. రెండు చోట్ల 7వేల మంది కూర్చొని యోగాసనాలు వేసేలా ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు మంత్రి లోకేశ్ తదితరులు పాల్గొన్నారు. సీఎం చంద్రబాబు మంత్రి లోకేశ్ రాందేవ్ బాబు ప్రాణాయామం చేయించారు. వేంకటేశ్వర సుప్రభాతం గోవిందానమా స్మరణతో సీఎం యోగా సాధన చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ రోజు అరగంట వ్యాయానం చేయాలని ప్రతి రోజూ మెడిటేషన్ ప్రాణామాయం చేస్తే ఆసుపత్రికి వెళ్లే అవసరం లేకుండా జీవించవచ్చున్నారు. విజవయాడ అంబేద్కర్ కళావేదికలోనూ యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు, యువతీ యువకులు యోగాంధ్రలో పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## ఎస్వీ ప్రాణదానం ట్రస్ట్‌కు రూ.కోటి విరాళం

**తిరుమల,జూన్ 21ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలో నిరుపేద రోగులకు ప్రాణదాతగా సేవలందిస్తున్న వేంకటేశ్వర ప్రాణదానం ట్రస్ట్‌కు దాతలు విరాళాలందిస్తున్నారు. హైదరాబాద్‌లోని షేక్‌పేట్ వేంకటేశ్వరస్వామి ఆలయ వ్యవస్థాపకుడు, చైర్మన్ అన్నే శ్రీనివాసరావు కోటి రూపాయలు విరాళాన్ని అందజేశారు. విరాళానికి సంబంధించిన డిడిని ఆదివారం తిరుపతిలో టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర కు అందించారు. ఈ సందర్భంగా ఎస్వీ ప్రాణదానం ట్రస్ట్‌కు ఉదారంగా కోటి విరాళం అందించిన దాత అన్నే శ్రీనివాసరావును ఇఒ అభినందించి, వారి సేవాభావాన్ని ప్రశంసించారు.

ఈ కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యుడు ఎన్. సదాశివరావు, దాత కుటుం బ సభ్యులు పాల్గొన్నారు.

## టిటిడి అదనపు ఇఒ కార్యాలయం తిరుపతికి మార్చండి
### బాలాజీ రైల్వే డివిజన్ సాధన సమితి గిరిధరకుమార్

**తిరుపతి,జూన్ 21ప్రభాతవార్తప్రతినిధి:** ధార్మికసంస్థ టిటిడిలో రోజురోజుకూ పెరుగుతున్న ఖర్చులు, ఇతరత్రా వ్యవహారాలతో దర్శనం కోసం కేటాయించిన అదనపు ఇఒ కార్యాలయాన్ని తిరుమల నుండి అలిపిరి (తిరుపతి)కి మార్చాలని రాష్ట్ర ప్రభుత్వానికి బాలాజీ రైల్వే డివిజన్ సాధన సమితి కన్వీనర్ గిరిధరకుమార్ తెలిపారు. ఈ మేరకు సిఎం చంద్రబాబునాయుడుకు, ప్రభుత్వానికి లేఖ రాశారు. ప్రభుత్వ పొదుపు చర్యలకు అనుగుణంగా ఘాట్‌రోడ్డు రద్దీ తగ్గిస్తూ భక్తుల సౌకర్యాన్ని పెంపొందించడం కోసం ఈ ఆలోచన చేయాలన్నారు. తిరుమలలో మరుసటి రోజు దర్శనం కోసం ముందు రోజు సిఫార్సు లేఖలను సమర్పించే ప్రస్తుత విధానానికి సంబంధించి అత్యంత నిర్మాణాత్మకమైన సూచన చేశారు.

ప్రస్తుతం ఈ ప్రక్రియ తిరుమలలోని అదనపు ఇఒ కార్యాలయం తిరుపతికి తరలిం చడం ద్వారా అనేక దీర్ఘకాలిక ప్రయోజనాలు ఉన్నాయన్నారు.

# ప్రతి ఇంట్లో యోగా సాధన జరగాలి

### యోగాకు ప్రపంచ గుర్తింపు తెచ్చిన ఘనత ప్రధానిదే: మంత్రి నారాయణ

**నెల్లూరు, జూన్ 21, ప్రభాతవార్త-వైద్యం:** యోగాతోనే దేశ ఆర్థికాభివృద్ధి చెందుతుందని మంత్రి నారాయణ పేర్కొన్నారు. ఆదివారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా నెల్లూరు గాంధీ బొమ్మ సమీపంలోని స్వతంత్ర పార్క్‌లో అదివారం జరిగిన యోగా వేడుకల్లో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ పాల్గొన్నారు. వాకర్స్, కరాటే విద్యార్థులతో కలిసి యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భారతీయ సంస్కృతి అయిన యోగాకు ప్రపంచవ్యాప్తంగా 190 దేశాల్లో గుర్తింపు తేవడం భారతీయులందరికీ గర్వకారణమని, దీనికి కృషి చేసిన ప్రధానమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రాష్ట్రంలోని అన్ని సచివాలయాల్లో యోగా వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. యోగాతో మానసిక, శారీరక ఆరోగ్యం చేకూరుతుందని, ప్రజలు ఆరోగ్యంగా ఉంటేనే రాష్ట్ర, దేశ ఆర్థికా భివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. 2024 నాటికి అస్తవ్యస్తంగా ఉన్న స్వతంత్ర పార్క్‌ను కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎంపిక చేసిన 45 పార్కుల్లో చేర్చి, పచ్చదనంతో అద్భుతంగా పునరుద్ధరించామని వెల్లడించారు. పార్క్‌ను ఇంత అందంగా తీర్చిదిద్దిన, కమిషనర్‌తో పాటు మున్సిపల్ అధికారులను,స్థానికులకు ప్రతిరోజూ యోగా నేర్పిస్తున్న ట్రైనర్ విక్రమ్‌ను మంత్రి అభినందించారు. ప్రతి ఒక్కరూ నిత్య జీవితంలో రోజూ కొద్ది నిమిషాల పాటు యోగాను భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో కమిషనర్ నందన్, అదనపు కమిషనర్ హిమ బిందు,స్థానిక నాయకులు పోకలరవి తది తరులు పాల్గొన్నారు.



ఆదివారం యోగాడే వేడుకల్లో పాల్గొన్న మంత్రి నారాయణ

## విద్యావ్యవస్థలో నెల్లూరును నెం.1 చేస్తా: మంత్రి నారాయణ

**నెల్లూరు, జూన్ 21, ప్రభాతవార్త - వైద్యం:** నెల్లూరులో కార్పొరేట్‌ను మించిన రీతిలో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారుతున్నాయి. విద్యావ్యవ స్థలో మంత్రి నారా లోకేష్ తెస్తున్న విప్లవాత్మక మార్పుల్లో భాగంగా నెల్లూరు నగరంలోని మూలాపేట బాలికోన్నత పాఠశాలను 20 కోట్ల సీఎస్సార్ నిధులతో డిఎస్సార్ కన్‌స్ట్రక్షన్స్ అధినేత దేవిరెడ్డి సుధాకర్ రెడ్డి అంతర్జాతీయ ప్రమాణాలతో అద్భుతంగా తీర్చిది ద్దుతున్నారు. స్కూల్ ఆధునీకరణ పనులను, అత్యాధునిక ప్లే గ్రౌండ్‌ను మంత్రి నారాయణ ఆదివారం స్వయంగా పరిశీలించి, దాతలను అభినందించారు. అనంతరం డిఈఓ బాలాజీరావు, ఉపాధ్యా యులతో అడ్మిషన్లపై సమీక్ష నిర్వహించారు. పాఠశాల నిర్వహణపై పలు సూచనలు ఇచ్చారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ సొంత నిధులు, సీఎస్ఆర్ ఫండ్స్‌తో ప్రభుత్వ స్కూల్స్ ను ఆధునీకరిస్తుంటే అవినీతి జరిగిపోతోందని వైఎస్ఆర్సిపి నేతలు మాట్లాడటం హాస్యా స్పదమని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వం మూసేసిన విఆర్సీ స్కూల్‌ను తెరిపించి 1100 మంది పేద పిల్లలకు కార్పొరేట్ స్థాయి ఉచిత విద్యను అందిస్తున్నామన్నారు.అదే తరహాలో మూలాపేట స్కూల్‌లో తొలి విడతగా 24 వేల చదరపు అడుగుల నిర్మాణం పూర్తి చేసి, ఈ ఏడాది నుంచే నర్సరీ నుండి 10వ తరగతి వరకు తరగతులు ప్రారంభిస్తున్నామని తెలిపారు. మరో 13 పాఠశాలలను కూడా అభివృద్ధి చేసి విద్యావ్యవస్థలో నెల్లూరును దేశంలోనే నంబర్ వన్‌గా నిలబెడతానని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కమీషనర్ నందన్, డిఈఓ బాలాజీ రావు, ఎంఈఓ తిరుపాలయ్య, సర్వశిక్ష అభయాన్ పీడీ సుబ్బయ్య, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ పాల్గొన్నారు.

## సిఎం చంద్రబాబును కలిసిన దర్శకుడు మెహర్ రమేష్

**విజయవాడ,జూన్ 21,ప్రభాతవార్తప్రతినిధి:** చలన చిత్ర దర్శకుడు మెహర్ రమేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిసారు. మెహర్ రమేశ్‌కు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో కీలక పదవి లభించింది. ఏపీ రాష్ట్ర ఫిల్మ్, టీవీ, థియేటర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వైస్ చైర్మన్‌గా ఆయనను ఏపీలోని కూటమి ప్రభుత్వం ఇటీవల నియమించింది. మెహర్ రమేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు.ఈ భేటీ అనంతరం మెహర్ రమేశ్ సోషల్ మీడియా ద్వారా తన ఆనందాన్ని పంచుకున్నారు. తనకు ఈ అవకాశం కల్పించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు.

ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ తన పేరును ప్రతిపాదించి, మద్దతు ఇచ్చారని ఆయన పేర్కొ న్నారు. ఈ సందర్భంగా చంద్రబాబును ఆంధ్రప్ర దేశ్ రాష్ట్రానికి గాడ్‌ఫాదర్ అంటూ మెహర్ రమేశ్ అభివర్ణించారు.రాష్ట్రంలో చలనచిత్ర, టీవీ, నాటక రంగాల అభివృద్ధికి ఈ కార్పొరేషన్ పనిచేస్తుంది. ఈ కీలక బాధ్యతను తనకు అప్పగించడం పట్ల మెహర్ రమేశ్ సంతోషం వ్యక్తం చేశారు. ఇదే సమయంలో, తన కుమార్తె వివాహానికి హాజరుకా వాల్సిందిగా ముఖ్యమంత్రి చంద్రబాబును ఆయన వ్యక్తిగతంగా ఆహ్వానించారు.



ముఖ్యమంత్రి చంద్రబాబును ఆయన వ్యక్తిగతంగా ఆహ్వానించారు.

# పవన్ ఓ ప్యాకేజీ స్టార్



## పోలీసులు యమకింకరుల్లా తయారయ్యారు: ఆర్.కె.రోజా

**పుత్తూరు, జూన్ 21 ప్రభాతవార్త :** జనసేన అధినేత పవన్ కల్యాణ్ ప్రజల కోసం పార్టీ పెట్టలేదని, ప్యాకేజీల కోసమే పెట్టాడని వైసిపికి చెందిన పర్యాటక శాఖ మాజీ మంత్రి ఆర్.కె.రోజా ఆరోపించారు. ఇటీవల రాష్ట్రంలో జరిగిన కొన్ని సంఘటనల పట్ల పవన్‌కల్యాణ్ స్పందించిన తీరుపై ఆమె తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. అసలు పవన్‌కల్యాణ్ రాజకీయాలకే పనికిరాడని పేర్కొన్నారు.

ఆదివారం నియోజకవర్గంలోని వడమాలపేట మండలంలో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న ఆమె పవన్‌కల్యాణ్ చేస్తున్న రాజకీయాలను ఎండగట్టారు. విజయవాడ వద్ద కృష్ణలంక పోలీస్‌స్టేషన్‌లో కాపు కులానికి చెందిన గాదె సాయికృష్ణను పోలీసులు లాకప్‌డెత్ చేసిన సంఘటనలో పవన్ కల్యాణ్ రెండు నాల్కల ధోరణితో వ్యవహరించారన్నారు. సాయికృష్ణ లాకప్‌డెత్‌పై సిబిఐ విచారణ వేసేంత వరకూ తాము వదిలిపెట్టమని హెచ్చరించారు. జనసేన పార్టీకి చెందిన వాళ్లయినా, తన కులానికి చెందిన వారైనా అన్యాయంగా చనిపోతే తనకు ఏమీ పట్టనట్టుగా వుంటాడన్నారు. ప్రజల కోసం రాజకీయాలు చేయడని, కేవలం ప్యాకేజీల కోసం రాజకీయాలు చేస్తాడని ఎద్దేవా చేశారు. వైసిపి అధినేత వై.ఎస్.జగన్మోహనరెడ్డి గట్టిగా మాట్లాడడం వల్లే సాయికృష్ణ తల్లికి న్యాయం జరిగిందని తెలిపారు. జగనన్న సీన్‌లోకి వచ్చిన తర్వాతే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు లాకప్ డెత్ చేసిన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నాగరాజును సస్పెండ్ చేసి, కేసు విచారణకు ప్రత్యేక విచారణ బృందాన్ని నియమించారన్నారు.

# యోగ సాధనతో సంపూర్ణ ఆరోగ్యం

### కలెక్టర్ హిమాన్షు శుక్ల



**నెల్లూరు కలెక్టరేట్, జూన్ 21, ప్రభాతవార్త:** శ్వాస మీద ధ్యాస నిలిపి ప్రతి రోజు యోగా చేయండి సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందండని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల పిలుపునిచ్చారు. ఆదివారం 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని నెల్లూరు పట్టణంలోని ఎసి సుబ్బారెడ్డి స్టేడియంలో జరిగిన యోగాంధ్ర కార్యక్రమంలో జేసి మొగిలి వెంకటేశ్వర్లతో కలసి జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల పాల్గొన్నారు. యోగా గురువుల సూచనల మేరకు హాజరైన పలువురు ప్రముఖులతో పాటు ప్రజలందరూ యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని మనం ఘనంగా జరుపుకుంటున్నాం. ఇది మన రాష్ట్రం, దేశానికే కాక ప్రపంచానికే గర్వకారణం. యోగా అనేది మన భారతీయ సంస్కృతికి ప్రతీక మాత్రమే కాకుండా, ఆరోగ్యానికి మార్గదర్శి అని చెప్పవచ్చున్నారు. ఆరోగ్య ప్రమాణాలను మెరుగు పరిచే శరీర శుద్ధి, మనస్సు నియంత్రణ, ఆత్మ సాధన అనేవి యోగా సాధనలో ఉన్నాయన్నారు. ఇలాంటి మహత్తరమైన యోగా కార్యక్రమానికి ఈరోజు పెద్ద సంఖ్యలో హాజరైన వారందరినీ అభినందిస్తున్నాను. మీరు చూపిన ఆసక్తి యువతలో చైతన్యం, ఆరోగ్యంపై అవగాహన పెంచేందుకు మార్గం చూపుతుందన్నారు. యోగాను ప్రతి ఒక్కరూ దైనందిన జీవితంలో భాగంగా మార్చుకుంటే ఎటువంటి ఆరోగ్య సమస్యలు తలెత్తవన్నారు. మీ ఇంట్లోనే ఒక అరగంట యోగ సాధన చేస్తే ఆరోగ్యమే కాక మానసిక ఉల్లాసానికి దోహదపడుతుందని, ఈ యోగా కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లాలన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకొని యోగా, ధ్యానం, వాకింగ్ వంటి మంచి అలవాట్లను జీవితంలో భాగం చేసుకోవాలన్నారు. ఏదైనా కొత్త అలవాటు చేసుకోవాలంటే దానిని కనీసం 21 రోజుల పాటు నిరంతరంగా ఆచరించాలని నిపుణులు చెబుతున్నారు. ధూమపానం వంటి చెడు అలవాట్లను మానుకోవడంలోనూ, యోగా వంటి మంచి అలవాట్లను పెంపొందించుకోవడంలోనూ ఈ విధానం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ నెల 8వ తేదీ నుంచి జిల్లా వ్యాప్తంగా యోగా కార్యక్రమాలు నిరంతరంగా నిర్వహిస్తున్నామని, ఇప్పటికే ప్రజల్లో యోగాపై మంచి అవగాహన ఏర్పడిందని చెప్పారు. మరో కొన్ని రోజులు ఇదే ఉత్సాహంతో కొనసాగితే యోగా ప్రజల దైనందిన జీవితంలో భాగమవుతుందని పేర్కొన్నారు.

ప్రస్తుతం ఉదయం వేళల్లో వాకింగ్‌కు వచ్చే అనేక మందిని చూస్తున్నామని, వారిని ఎవరూ బలవంతం చేయకపోయినా అది వారి జీవనశైలిలో ఒక భాగంగా మారిందని చెప్పారు. అదే విధంగా ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు ఏదో ఒక ఆరోగ్యకరమైన శారీరక కార్యకలాపాన్ని తప్పనిసరిగా అలవర్చుకోవాలని సూచించారు. గత 13 రోజులుగా యోగా కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించడంలో అధికారులు, సిబ్బంది విశేష కృషి చేశారని కలెక్టర్ అభినందించారు. ముఖ్యంగా జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా సమన్వయం చేస్తూ వివిధ ప్రాంతాల్లో నిర్వహించడంలో కీలక పాత్ర పోషించారని ప్రశంసించారు. మనం అందరం ప్రతి రోజు యోగా సాధన చేసి ఆరోగ్యవంతమైన సమాజం నిర్మించుకుందామన్నారు. గత నెల రోజులుగా జరుగుతున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు ప్రతి ఒక్కరికి కలెక్టర్ ధన్యవాదాలు తెలియజేశారు.

**సర్టిఫికెట్ల ప్రధానం:** 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని జరిగిన యోగా పోటీలలో రాష్ట్ర, జిల్లా స్థాయిలో గెలుపొందిన వారితో పాటు యోగా గురువులను, విన్యాసాలను చేసిన చిన్నారులకు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా సర్టిఫికెట్లను అందించి, సన్మానం చేశారు.

**ప్రత్యేక ఆయుష్ వైద్య శిబిరాలు ఏర్పాటు:** ఈ సందర్భంగా హోమియోపతి, యునాని, ఆయుర్వేద వైద్య విభాగాల ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరాలు, అవగాహన స్టాళ్లను సంబంధిత అధికారులు ఏర్పాటు చేశారు. శిబిరాలను సందర్శించిన సుమారు 400 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను పంపిణీ చేశారు. అలాగే ఆయుష్ వైద్య విధానాల ప్రాముఖ్యత, ఆరోగ్య ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అంతకు ముందు జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో యోగాంధ్ర జిల్లా ఆయుష్ నోడల్ అధికారి డాక్టర్ శ్రీనివాస రాజు, మెప్మా పీడి కిరణ్ కుమార్, డిఎం హెచ్ఒ డా.సుజాత, స్కిల్ డెవలప్మెంట్ ఆఫీసర్ అబ్దుల్ ఖయూమ్, జిల్లా అధికారులు, విద్యార్థులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

వార్త

చేయక తప్పని పనిలో కూడా జాప్యం చేస్తే కాలం ఆ పనిని నిష్ప్రారంగా మార్చివేస్తుంది.

- జి.ముర్రే

# గాంధీ సరో'వరం'


భాగ్యనగర అభివృద్ధి చరిత్రలో గాంధీ సరోవర్ ప్రాజెక్టు అత్యంత కీలకంగా మారనుంది. మూసీ నది పునరుజ్జీవన కార్యక్రమంలో భాగంగా బాపుఘాట్ ప్రాంతంలో ప్రతిపాదించిన ఈ ప్రాజెక్టుకు దాదాపు ఇకపై ఎలాంటి ఆటంకాలు ఉండబోవు. ఈ ప్రాజెక్టును తెలంగాణ ప్రభుత్వం సాంస్కృతిక, పర్యావరణ, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని తలపోసింది. తాజాగా అందుకు అవసరమైన 83 ఎకరాలకుపైగా భూమిని బదలీ చేసేందుకు కేంద్ర రక్షణ శాఖ అనుమతించడాన్ని స్వాగతిద్దాం. హైదరాబాద్‌కు అంతర్జాతీయ గుర్తింపు కలిగేలా మూసీనదిని కాలుష్యరహితంగా మార్చి కొత్త పర్యాటక కేంద్రాలను సృష్టించేందుకు ఈ సరోవర్ ప్రాజెక్టు దోహదపడుతుందన్నది ప్రభుత్వ వ్యూహం. ప్రభుత్వ ప్రతిపాదిత ప్రణాళికల ప్రకారం గాంధీ సరోవర్‌లో మహాత్మా గాంధీ నిలువెత్తు విగ్రహం, మ్యూజియం, విజ్ఞాన కేంద్రం, హ్యాండ్లూమ్ శిక్షణ కేంద్రం, ధ్యానసిద్ధి గ్రామం, పర్యాటక విశేష ప్రాజెక్టుగా రూపొందుతుంది. జంటనగరాల ప్రజలకే కాకుండా దేశవ్యాప్త పర్యాటకులకు ఈ ప్రాజెక్టు ద్వారా గాంధీజీ స్ఫూర్తిని మదిలో నింపే ప్రయత్నం మంచి ఆలోచనే. ఈ ప్రాజెక్టును గొప్ప సాంస్కృతిక చిహ్నంగా, వివాదారహితంగా రూపుదిద్దుకోవాలంటే కేవలం కాంక్రీట్ నిర్మాణాల సమాహారంగా కాకుండా హైదరాబాద్ ప్రజల మానస పుత్రికగా మార్చాలి. అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, సామాజిక న్యాయం, అనే మూడు అంశాల ప్రాతిపదికగా ఈ ప్రాజెక్టును నిర్మించినప్పుడే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుంది. ఈ ఆశయాల నేపథ్యంలో సమతుల్యత సాధించాలి. గాంధీ సరోవర్ ప్రాజెక్టును సక్రమంగా నిర్మించి, సజావుగా పూర్తి చేయాలనే చిత్తశుద్ధి పక్కాగా ఉండాలి. ఈ ప్రాజెక్టు పరిసర ప్రాంతాలలో ఉండే కొన్ని నివాస ప్రాంతాలపై ప్రభావం పడుతుంది. వాటి విషయంలో ప్రభుత్వ మానవతా దృక్పథంతో వ్యవహరించి ప్రాజెక్టును విజయవంతంగా పూర్తి చేయాల్సిన అవసరముంది. నిర్వాసితుల సమస్య ఏర్పడినప్పుడే రాజకీయ అవరోధాలు పుట్టుకొస్తాయి. ఇలాంటి సందర్భంలో స్థానికులు, పౌరసంఘాలు ఆందోళనలు వెల్లువెత్తుతుంటాయి. వీటన్నిటినీ ఎదురొడ్డి పరిష్కారాలు చూపితేనే ప్రజల్లో ప్రభుత్వ పట్ల విశ్వాసం పెరుగుతుంది. ప్రభుత్వ లక్ష్యాలను పరిపూర్ణం చేయవచ్చు.ప్రధానంగా రేపొచ్చే ప్రయోజనాల విషయమై రాజీపడరాదు. పర్యావరణ పరిరక్షణ పేరిట ప్రజల జీవనోపాధిపై ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చూడాలి. గోల్కొండ ఆర్టిలరీ పరిధిలోని రూ. 533 కోట్ల విలువైన భూముల బదలాయింపునకు అనుమతితోపాటు వర్క్ పర్మిషన్ ఇస్తూ కేంద్ర రక్షణ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. నిరంతరం మూసీ నదిలో మంచినీరే ప్రవహించాలన్న లక్ష్యంతోపాటు ఆ ప్రాంత పునరుజ్జీవనానికి ప్రభుత్వం నడుంకట్టిన విషయం విదితమే. కొన్ని అవాంతరాలున్నా ముందుకు సాగాలనే సంకల్పంతో ఉంది. నదీ పరీవాహక ప్రాంతాన్ని సంపద సృష్టించే ఆర్థిక నడవాగా, పర్యావరణ, సాంస్కృతిక కేంద్రంగా తీర్చిదిద్దితే భాగ్యనగరం స్వరూపమే మారిపోతుంది. గాంధీ సరోవర్ ప్రాజెక్టుగా చేపట్టి బాపూఘాట్ త్రివేణి సంగమం వద్ద 200ఎకరాల్లో ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేయనున్నది.రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం బండ్లగూడ గ్రామం, రాజేంద్రనగర్ మండలంలోని హైదర్‌గూడ, గోల్కొండ మండలంలోని ఖిలా మహ్మద్ నగర్ గ్రామాల పరిధిలో నాలుగు విభాగాలుగా విస్తరించి ఉన్న 83.814ఎకరాల భూమి తాజా ఉత్తర్వులలోప్రభుత్వానికి దఖలు పడనున్నాయి. వర్కింగ్ పర్మిషన్ అందినందున మూసీ నదీ పరీవాహక ప్రాంత అభివృద్ధి సంస్థ భూ సర్వే చేపట్టి పనులు ప్రారంభిస్తుంది. ఈ ప్రాజెక్టులోనే పర్యాటక శాఖకు చెందిన 36 ఎకరాలున్నందున ప్రాజెక్టు సర్వాంగ సుందరంగా సకలసౌకర్యాలతోనిర్మించి ప్రాజెక్టు చేసేందుకు అన్ని వనరులు దక్కాలన్న లక్ష్యం పూర్తి ప్రాజెక్టుతో హైదరాబాద్ అభివృద్ధిలో అందున గాంధీ సరోవర్ మూసీనదీ పరివాహక ప్రాంతాన్ని అభివృద్ధి చేయడంవలన నగరంలో మరిన్ని సౌకర్యాలు ఏర్పడతాయని నగర ప్రజలు ఆనందిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా ఈప్రాజెక్టు అభివృద్ధిపట్ల చిత్తశుద్ధితో ఉన్నందునే రక్షణశాఖ భూమిని ప్రభుత్వానికి ధారాదత్తం చేయడంలో ఎలాంటి అసౌకర్యం కలగలేదు. కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఈ ప్రక్రియను పూర్తి చేయడంలో చేసిన సహకారానికి ముఖ్యమంత్రి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సహకారముంటే రాజకీయాలకు అతీతంగా ప్రాజెక్టులుసజావుగా పట్టాలెక్కుతాయనడానికి నేటి క్లియరెన్స్ నిదర్శనం. కేవలం పేరుకే కాకుండా గాంధీతత్వశాస్త్రాన్ని బోధించే అతి పెద్ద మ్యూజియంను ఈప్రాజెక్టులో భాగంగా నిర్మిస్తారు. పర్యాటకంగా ఈప్రాంతం విశేష అభివృద్ధికి వీలైన అన్ని ప్రణాళికలనూ ఈ ప్రాజెక్టులో చేర్చింది. ఇవన్నీ నగర వాసులకు వరంగానే చెప్పాలి. మూసీ, ఇసా నదుల సంగమస్థలిలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకం చేపడుతున్న గాంధీ సరోవర్ ప్రాజెక్టు, గుజరాత్‌లోని సర్దార్ సరోవర్ ప్రాజెక్టు స్థాయిలో వెలుగొందగలదు. ఆశయం ఎంత గొప్పదైనా అమలులో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కోవడం కష్టమేనని ఏ భారీప్రాజెక్టు అయినా వెల్లడిస్తుంది. మహాత్మా గాంధీ అస్థికలు నిమజ్జన ప్రదేశంలో ఈ ప్రాజెక్టు తలపెట్టినందున ప్రాజెక్టుకు సంబంధించిన నామకరణంపై ఇబ్బందులు రావు. మూసీ నిర్వాసితుల వ్యవహారమొక్కటే పకడ్బందీగా పరిష్కరించుకోగలిగితే మూసీ నది ప్రాజెక్టులో జలసిరులు పొంగుతాయి. గాంధేయ విలువలతో ప్రపంచ స్థాయి ఆధ్యాత్మిక, సాంస్కృతిక కేంద్రాన్ని కొత్త తరానికి పరిచయం చేయడం ఎంతో అవసరం.

అంతులేని కోరికలుండడమే పెద్ద దోషం. ఇతరుల గురించి చెడుగా చెప్పడమే పెద్ద పాపం. సత్యంగా ప్రవర్తించడమే నిజమైన తపస్సు.



గురజాడ అప్పారావు

అతి సామాన్యమైన జీవితం గడపడానికి ఆసక్తి, అధికమైన ఆలోచనా శక్తి గొప్పవారి జీవిత సూత్రాలు.



వి. జాన్సన్

## ప్రజావాక్కు

### సాంకేతికత మానవాళికి సేవకుడిగానే ఉండాలి

కృత్రిమ మేధస్సు అనే సాంకేతికవిప్లవం, హరిత ఇంధన పరివర్తన అనే పర్యావరణ ఉద్యమం ఈ ఇరవై ఒకటో శతాబ్దపుఅత్యంత కీలకమైనమార్పులు.కృత్రిమ మేధస్సు లేనిప్రపంచంలో స్వచ్ఛమైన ఇంధనంవైపు సాగే ప్రయాణం సరళంగా అనిపించవచ్చు, కానీ అలా చేయడం వల్ల ఉత్పాదకత,ఆవిష్కరణలు,సామర్థ్యాలలో లభించే అపారమైన ప్రయోజనాలను కోల్పోతాము. కృత్రిమ మేధస్సు శాస్త్రీయపరిశోధనలను వేగవంతం చేయగలదు, విద్యుత్ గ్రిడ్‌లనుసమర్థవంతంగా నిర్వహించగలదు,వనరుల వినియోగాన్ని మెరుగుపరచగలదు. ఇది ఆరోగ్యరక్షణను పటిష్టంచేస్తూ,వాతావరణమార్పులకుఅనుగుణంగా మారుతూ హరిత పరివర్తనను మరింత వేగంగా, ప్రభావవంతంగా మారుస్తుంది. సాంకేతికత ఎల్లప్పుడూ మానవాళికి సేవకుడిగానే ఉండాలి తప్ప యజమాని కాకూడదు.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### ప్రమాదకరంగా గ్రామీణ రోడ్డు ప్రయాణాలు

వాతావరణమార్పులతో ఇటీవలకాలంలో తీవ్రమైన ఈదురుగాలులతో కూడిన వర్షాలు పడుతుండడంతో గ్రామీణ రోడ్ల వెంటప్రయాణాలు ప్రమాదకరంగా మారుతున్నాయి. తరుచుగా చెట్ల కొమ్మలు విరిగి రోడ్లపై పడుతుండడం, విద్యుత్‌స్తంభాలు విరిగి పడుతుండడంతో కరెంట్ తీగలుతెగి రోడ్లు ప్రమాదకరంగా మారుతున్నాయి. గ్రామస్థాయిలో అధికారులు వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండి ఇలాంటి పరిస్థితులలో వెంటనే రోడ్లపై ఉన్న చెట్లను తొలగించే విధంగా చర్యలు చేపట్టాలి. విద్యుత్ శాఖవారు విద్యుత్ వైర్లు తెగినచోట ప్రమాదాలు జరగకుండా తగిన హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేసి మరమ్మత్తులు చేయాలి. రోడ్లు బాగా దెబ్బతిన్న చోట సంబంధిత అధికారులు మరమ్మత్తులు చేసే విధంగా చర్యలు చేపట్టాలి.

- తోట యోగేందర్, నల్లగొండ జిల్లా

### ఇండ్ల స్థలాలలో మరుగుదొడ్ల నిర్మాణం

తెలంగాణ రాష్ట్రంలోని మండల కేంద్రాలలో ఇండ్ల స్థలాలలో అగ్రవర్ణాల వాళ్ళు అక్రమంగా భూ కబ్జాలు చేసి మరుగుదొడ్లు నిర్మించారు. అడిగితే దాడులు, దౌర్జన్యాలు చేస్తున్నారు. పోలీస్, రెవిన్యూ అధికారులకు ఫిర్యాదు చేసి నా పట్టించుకోవడం లేదు. అక్రమంగా మరుగుదొడ్లు నిర్మిం చిన వారిపై 1989 ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి. రెవిన్యూ రికార్డులు పరిశీలించి మాదిగలకు న్యాయం చేయాలి.

- కదురు శ్రీనివాస్, వరంగల్

### బాబాలందరూ ఒకటే..మోసగాళ్ళు

పూణేలో ఒక మహిళా భక్తురాలిని 15ఏళ్లుగా బంధించి అత్యాచారం జరిపిన రాధామోహన్ మిశ్రాబాబా లాంటివారే బాబాలందరూ.ఒక్కొకడు ఒక్కోరకం.ఒకడు మహిళలను లొంగదీసుకుంటాడు.ఇంకొకడు దిట్టమైన మొగవాళ్ళను ఆకర్షిస్తాడు. మరొకడు ప్రభుత్వభూములు ఆక్రమించి ఆశ్రమం నిర్మిస్తాడు. ఇంకొకడు హత్యలు,మరొకడు అత్యాచారాలు, మాదకద్రవ్యాల అమ్మకాలు ఇంకొకడు, కల్తీసరుకులు, కల్తీమందులు విక్రయిస్తుంటారు. ఇలాంటి బాపతులు దేశమంతా ఉన్నారు.వీరంతా దొంగలే. ఐతే తమాషా ఏమిటంటే వీరికి మన ముఖ్య మంత్రులు, ప్రధానులు సన్మానాలు చేస్తారు. గురుపూజోత్సవం రోజు శాలువాలు కప్పుతారు. సహజంగా బాబాల వద్ద మహిమలు, మహత్యాలు ఉన్నాయని ముఖ్యమంత్రులే భావిస్తారు. మహిమలు మహత్యాలు ఎవరివద్ద లేవు.మోసం, అబద్ధం అది ప్రకృతి సూత్రాలకు విరుద్ధం.మరి ఎందుకు ఇలాంటి వారిని అరెస్ట్ చేసి జైళ్లలో పెట్టకుండా ఈసన్మనాలు ఏంటీ?

- నార్నెవెంకట సుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### చేసిన మేలు మరువరు

కేంద్ర ప్రభుత్వం 2014లో ప్రారంభించిన స్వచ్ఛ భారత్ కొత్తదేమీ కాదు. ఇందిరాగాంధీ హయాంలోను ఈ పథకం ఉంది. పరిసరాల శుభ్రతకు ఎంతో ప్రాధాన్యత ఇచ్చిన వారు ఇందిరాగాంధీ. ఈవిషయంలో మొట్టమొదట ప్రజలలో చైతన్యం తెచ్చినవారు ఇందిరాగాంధీ. ఇప్పుడు మన్ కి బాత్ అంటు ప్రధాని మోడీ రేడియో ద్వారా తన మనసులోని భావాలనుప్రజలతో పంచుకుంటున్నట్లుగానే ఆనాటి ప్రధాన మంత్రులు, కేంద్రమంత్రులు, ప్రకృతి వైపరీ త్యాలు,పొరుగు దేశాలతో యుద్ధం వంటివి వచ్చినప్పుడు రేడి యోలో తమ సందేశం వినిపించేవారు.ప్రజలను వ్యక్తి గతంగా కలుసుకుని ధైర్యం చెప్పేవారు.కొండంత చేసినా గోరంత ప్రచారం చేసుకొనేవారు. మహనీయులను మరువరాదు.

- ఎమ్.ఎస్.శర్మ, హైదరాబాద్

### మండలాల పునర్విభజన అవసరం

జనాభాలో భారత దేశం ప్రపంచంలో మొదటి స్థానంలో ఉంది.దేశంలో లోక్‌సభ,రాజ్యసభ, అసెంబ్లీ స్థానాలా సంఖ్య త్వరలో పెరగనున్నాయి. అదే తరహాలో తెలంగాణ రాష్ట్రంలో 10జిల్లాలున్న వాటిని 33 జిల్లాలుగా ఏర్పాటు చేయడం జరిగింది. పరిపాలన సౌలభ్యం కొరకు రవాణా సౌకర్యం, విద్య, వైద్యం, మార్కెట్, ప్రభుత్వ కార్యా లయంలో పనులను దృష్టిలో పెట్టుకొని మండలాల పునర్విభజన చేయాలి.

-ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్ జిల్లా

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# గుర్తొచ్చినప్పుడు 'సర్' చేస్తామంటే ఎలా?

**కొత్తగా ఓటు పొందాలంటే మీరు భారతీయ పౌరులేనని రుజువు చేసుకోవాలని ఎన్నికల సంఘం నిర్దేశించింది. పౌరసత్వం ఏ విధంగా నిరూపించుకోవాలో వివరా లు ఇవ్వలేదు. నిజానికి స్వతంత్ర భారతదేశంలో ప్రత్యే కంగా పౌరసత్వకార్డు విధానమే లేదు. లేని పౌరసత్వాన్ని నిరూపించుకోవాలని ప్రజలను నిర్దేశించడం ఆశ్చర్యం కలిగి స్తోంది. సహజంగా పాస్పోర్టు, పాన్ కార్డు, ఓటరు కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, ఆధార్ కార్డులుగా గుర్తింపు కార్డులుగా చెలామణి అవుతున్నాయి. అయితే ప్రజలందరికీ అందు బాటులో వున్న ఏకైకకార్డు ఆధార్కార్డు. కానీ ఇది పౌర సత్వకార్డుగా పరిగణించరని కేంద్రప్రభుత్వం ప్రకటించింది. ఈ స్థితిలో ప్రజలు తమ వద్దవున్న కార్డులను ఎన్నికల సంఘం ఉద్యోగులకు చూపిస్తే, ఆ కార్డులను ఎన్నికల సంఘం ఉద్యోగి అంగీకరిస్తే మీకు కొత్తగా ఓటు వచ్చే అవకాశం వుంటుంది. లేదంటే లేదు.**



అన్నవరపు బ్రహ్మయ్య

ఎంతమంది దోషులైన తప్పించుకోవచ్చుకాని, ఒక్క నిర్దోషికి కూడా శిక్షపడకూడదనేది భారత దేశ న్యాయవ్యవస్థ సిద్ధాంతమని చెబుతుంటారు. అదే తరహాలో'అర్హత కలిగిన ఏ పౌరుడుని వదిలేయ కూడదు.. అర్హతలేని ఏ వ్యక్తిని ఓట్ల జాబితా చేర్చకూడదు' అంటూ స్పెషల్ ఇంటెన్సీవ్ రివ్యూ (సర్) సందర్భంగా భారత ఎన్నికలసంఘం ప్రకటన విడుదల చేసింది. కానీ ఆచరణలో పరిస్థితులు ఇందుకు విరుద్ధంగా కనిపిస్తున్నాయి. తరచూ ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి వలస వెళ్లడం, ఒకే వ్యక్తి రెండు మూడు ప్రాంతాల్లో ఓటు కలిగి వుండటం, చనిపోయిన వ్యక్తుల ఓట్లను తొలగించకపోవడం, భారత్లో అక్రమంగా చొరబడిన విదేశీయులు ఓటు కలిగి వుండటం వంటి కారణాలవల్ల ఈ స్పెషల్ ఇంటెన్సీవ్ రివ్యూ అవసరమని ఎన్నికల సంఘం చెబుతోంది. తెలుగు రాష్ట్రాలలో జూన్ 15 నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమం జులై 14వ తేదీ వరకు కొనసాగుతుంది. ఆ తర్వాత జులై 21నుంచి ఆగస్టు 20వ తేదీల మధ్య ఓటర్లు నుంచి అభ్యంతరాలు తెలియ చేయవచ్చు. చివరకు 2026, సెప్టెంబరు 22వ తేదీ ఫైనల్ ఓటర్ల జాబితా ప్రచురితమవుతుంది. స్పెషల్ ఇంటెన్సీవ్ రివ్యూ 1951 నుంచి 2002వ సంవత్సరం వరకు ఎనిమిది సార్లు చేసినట్టు ఎన్నికల సంఘం చెబుతోంది. చివరిగా 2002లో చేసినట్టు పేర్కొంది. ప్రతి ఐదేళ్లకు ఎన్నికలు నిర్వహించినట్టుగా ప్రతి 5లేక 10ఏళ్లకు స్పెషల్ ఇంటెన్సీవ్ రివ్యూచేస్తే బాగుంటుంది. కానీ ఎన్నికల సంఘానికి గుర్తు వచ్చినప్పుడు స్పెషల్ ఇంటెన్సీవ్ రివ్యూ చేయడం, ఓటు కావాలంటే తమపౌరసత్వాన్ని నిరూపించుకోవాలని ప్రజలకు నిర్దేశించడం ఆశ్చర్యం కలిగిస్తోంది. 21 సంవత్సరాలుగా మౌనంగా వున్న ఎన్నికల సంఘం ఇప్పుడే స్పెషల్ ఇంటెన్సీవ్ రివ్యూ చేయాలని నిర్ణయించడం, దానికి 2002-04 ఎన్నికల ఓటర్ల జాబితా ప్రామాణికంగా తీసుకుకోవడానికి ప్రామాణికత ఏమిటి? స్పెషల్ ఇంటెన్సీవ్ రివ్యూ చేసే ఎన్నికల సంఘం ఉద్యోగి పరిశీలనకు వచ్చినపుడు ఒకసాధారణ ఓటర్లు తాను 2002-04వ సంవత్సరంలో ఓటు చేశానని రుజువుచేసుకోవాలి. అలా చేసుకోలేదనుకో ఇబ్బందుల్లో పడ్డట్టే. అంటే ఒక సామాన్య ఓటరు/పౌరుడు 2002-04వ సంవత్సరంలో ఏ నియోజకవర్గంలో నివసించింది, ఏ పోలింగ్ బూత్‌లో ఓటు చేసింది గుర్తు తెచ్చుకోవాలి. సహజంగా గ్రామీణ ప్రాంతాల్లో నివసించే ప్రజలకు పంట పొలాలు, ఇళ్లు వుంటాయి కాబట్టి అక్కడే వుండే అవకాశం వుంటుంది. కానీ పట్టణ, నగర ప్రాంతాల్లో జీవించే ప్రజలలో 80 శాతం మంది ఇతర ప్రాంతాల నుంచి వలస వచ్చినవారే వుంటారు. వారు ఎక్కడ పని దొరికితే అక్కడ, ఎక్కడ చౌకగా ఇల్లు అద్దెకు లభిస్తే అక్కడకు మారుతుంటారు. ఇలా వలసవచ్చిన వారిలో అక్షరాస్యులు కూడా తక్కువగా వుంటారు. కానీ వీరందరూ తమ ఇంటికి ఎన్నికల సంఘం ఉద్యోగులు వచ్చినప్పుడు 2002-04 ఎన్నికల్లో తాము ఓటు చేసింది ఎక్కడో గుర్తుతెచ్చుకొని చెప్పాలి. లేదంటే కష్టాలుతప్పవు. గత ఎన్నికల్లో మీరు ఓటు చేసినప్పటికీ 2002-04 ఎన్నికల ఓటరు లిస్టులో మీరు పేరులేకపోతే మీరు కొత్తగా మరల ఓటరుగా చేరాలి.అయితే కొత్తగా ఓటు పొందాలంటే మీరు భారతీయ పౌరులేనని రుజువు చేసుకోవాలని ఎన్నికల సంఘం నిర్దేశించింది. పౌరసత్వం ఏ విధంగా నిరూపించుకోవాలో వివరాలు ఇవ్వలేదు.





నిజానికి స్వతంత్ర భారతదేశంలో ప్రత్యేకంగా పౌరసత్వకార్డు విధానమే లేదు. లేని పౌరసత్వాన్ని నిరూపించుకోవాలని ప్రజలను నిర్దేశించడం ఆశ్చర్యం కలిగిస్తోంది. సహజంగా పాస్పోర్టు, పాన్ కార్డు, ఓటరు కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, ఆధార్ కార్డులుగా గుర్తింపు కార్డులుగా చెలామణి అవుతున్నాయి. అయితే ప్రజలందరికీ అందుబాటులో వున్న ఏకైకకార్డు.. ఆధార్కార్డు. కానీ ఇది పౌరసత్వకార్డుగా పరిగణించరని కేంద్రప్రభుత్వం ప్రకటించింది. ఈ స్థితిలో ప్రజలు తమ వద్ద వున్న కార్డులను ఎన్నికల సంఘం ఉద్యోగులకు చూపిస్తే, ఆ కార్డులను ఎన్నికల సంఘం ఉద్యోగి అంగీకరిస్తే మీకు కొత్తగా ఓటు వచ్చే అవకాశం వుంటుంది. లేదంటే లేదు. ప్రతి ప్రభుత్వ కార్యకలాపాలకు ఆధార్ను లింక్ చేసే ప్రభుత్వం, ఆధార్ను అధికారికంగా గుర్తించకపోవడం ఆశ్చర్యంకలిగిస్తోంది.బ్యాంకులు మొదలుకొని ఆర్థిక లావాదేవీలు జరిగే ప్రతి కార్యాలయంలోనూ ప్రజలు కె.వై.సి. (నో యువర్ కస్టమర్) ఆధార్‌ను అనుసంధానం చేసుకోవాల్సివుంది. ఎన్నికల సంఘం కూడా ఆధార్‌కార్డు తమ అనుసంధానం చేసుకోమని గతంలో పిలుపు నిచ్చింది. కానీ ఇప్పుడు స్పెషల్ ఇంటెన్సీవ్ రివ్యూకు మాత్రం ఆధార్‌ను పరిగణలోకి తీసుకోలేమని చెప్పడం ప్రభుత్వ ద్వంద్వ విధానాన్ని బహిర్గతం చేస్తోంది. చీఫ్ ఎలక్ట్రోల్ ఆఫీసర్, డిస్ట్రిక్ట్ ఎలక్ట్రోల్ ఆఫీసర్, ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్లు ముందుగా గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల నాయకులను కలసి ఈ స్పెషల్ ఇంటెన్సీవ్ రివ్యూ విధానాన్ని వివరించాలి. ఆయా రాజకీయ పార్టీలకు చెందిన బూత్ లెవల్ ఎజంట్లకు శిక్షణ ఇవ్వాలి. బూత్ లెవెల్ ఏజంట్లు ప్రజల నుంచి రోజుకి 50 అప్లికేషన్ల వరకు సేకరించి ఎన్నికల అధికారులకు సమర్పించవచ్చు. ఈ నేపథ్యంలో ఓటర్ల నమోదు, సమీక్షలో రాజకీయపార్టీల ప్రతినిధులు ప్రమేయం కీలకం అయ్యే అవకాశం వుంది. ఓటర్ల నమోదు, సమీక్ష జరిగిన తర్వాత ఎన్నికలసంఘం ఓటర్ల జాబితా ప్రకటిస్తుంది. జాబితాలో మీరు పేరు లేకపోతే జిల్లా కలెక్టరు/డిస్ట్రిక్ట్ ఎలక్ట్రోల్ ఆఫీసర్కు ఫిర్యాదు చేయాలి. అక్కడ కూడా మీకు ఓటు లభించకపోతే చీఫ్ ఎలక్ట్రోల్ ఆఫీసర్కు ఫిర్యాదు చేసి ఓటుపొందవచ్చు.అయితే బూత్ లెవెల్ అధికారి ఓటు తిరస్కరించిన తర్వాత ఓటర్లు ఎవరికి వారు సొంతగా ఫిర్యాదుచేసి ఓటు పొందడం అంత తేలికైన వ్యవహారంకాదు. భారతదేశంలో సగటు అక్షరాస్యత 80.9 శాతం అయినా, గ్రామీణ ప్రాంతాల్లో 77 శాతంగా వుంది. ఈఅక్షరాస్యత శాతం కూడా నిజంకాదు.ఎందుకంటే ప్రజలకు సంతకం చేయడం నేర్పించి అదే అక్షరాస్యతగా రికార్డు చేస్తున్నారు. అక్షరాస్యత అంటే ఏదైన ఒక అంశాన్ని పూర్తిగా సొంతగా చదవకలిగి,ఆపైన విశ్లేషణ చేయగల సామర్థ్యం వున్నప్పుడు మాత్రమేదాన్ని అక్షరాస్యతగా భావించాలి. కంప్యూటర్ అక్షరాస్యత వచ్చి 12 నుంచి 25 శాతం మాత్రమేనని రికార్డులు చెబుతున్నాయి. ఈ స్థితిలో ప్రజలు తమ ఓటు హక్కును 2002-04ఎన్నికల ఓటర్ల జాబితాకు మ్యాచ్ చేయాలని నిర్దేశించడం ఆశ్చర్యం కలిగిస్తోంది. అప్రస్తుతమైన ఈ సందర్భంగా ఒక విషయం చెప్పాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఓటర్ల జావితా విషయంలోనే కాదు, ప్రజల పరిజ్ఞానాన్ని పరిగణలోకి తీసుకోకుండానే అనేక ప్రభుత్వశాఖల తమ సేవలను ఆన్లైన్‌లోకి మార్పు చేశాయి. కార్యాలయాలను కంప్యూటరైజేషన్ చేసినప్పుడు అందులో పనిచేసే సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ప్రజలకు మాత్రం ఎటువంటి శిక్షణ వుండదు, కానీ ఆన్లైన్లోనే పనులు చేసుకోమని చెబుతారు. ఆన్లైన్ చేయడం వల్ల అంతంత మాత్రపు చదువుకున్న సామాన్య ప్రజలు ఎక్కడలేని ఇబ్బందులకు గురవుతున్నారు.ఉదాహారణకి గతంలో రైలు ప్రయాణం కోసం స్టేషన్‌కు వెళ్లి డబ్బుతీసుకొని అడిగిన రిజర్వేషన్ టిక్కెట్ ఇచ్చేవారు. ఇప్పుడు కంప్యూటరైజేషన్ వల్లసామాన్య మానవులెవ్వరూ టిక్కెట్ పొందలేరు, తప్పనిసరిగా మధ్యవర్తిని ఆశ్రించవలసిందే. అదే విధంగా రిజిస్ట్రేషన్ కార్యాయాలు, ఆర్టీవో కార్యాలయాలలో చేతిరాతతో పనులు జరిగేవి, ఇప్పుడు కంప్యూటరైజేషన్ చేయడం వల్ల మధ్యవర్తులకు వేల రూపాయలు ఖర్చుచేయవలసి వస్తోంది. ఇదే సమయంలో ప్రభుత్వాలు మధ్యవర్తులను ఆశ్రించవద్దు అంటూ పెద్దపెద్ద బోర్డులు పెడతాయి. ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలు, ప్రజలతో సంబంధం లేకుండా చేస్తున్న కంప్యూటరైజేషన్ చూస్తుంటే తెలుగునాట వున్న 'చదువుకోక ముందు కాకర కాయ అని, చదువుకున్న తర్వాత కీకర కాయ అని పలికినట్టు' అనే నానుడి గుర్తుకు వస్తోంది. ●

# ప్రతీకార దాడులతో ప్రయోజనమేమిటి?


కనుమ ఎల్లారెడ్డి

రష్యా, ఉక్రెన్ యుద్ధం ఎడతెగక సాగుతోంది. రెండు దేశాలు ప్రతీకార దాడులతో రెచ్చిపోతున్నాయి. ఇటీవల రష్యా రాజధాని మాస్కోపై ఉక్రెయిన్ కనివినని రీతిలో దాడులు చేసింది. రష్యాలోని ఒక రిఫైనరీలో తీవ్ర దాడి జరిగింది. ఇది ఆగ్నేయ మాస్కోలో ఉంది. ఇది అత్యంత పెద్ద రిఫైనరీ. దీని పైనే ఉక్రెయిన్ కన్నేసింది. దీన్ని దెబ్బ తీస్తే రష్యా ఆర్థిక మూలాలు దెబ్బ తింటాయానే ఉద్దేశంతో కపోట్నా జిల్లాలో వున్న రిఫైనరీ పైనే మూడు సార్లు దాడి చేసింది. ఈసారి జరిగిన దాడిలో ఆ రిఫైనరీలో మంటలు ఉవ్వెతున్న ఎగిసిపడ్డాయి. ఆ దాడికి ఆకాశమంతా దట్టమైన పొగలతో నిండిపోయింది. ఈ దాడితోరష్యా ఆగ్రహం ప్రకటించింది.మేము అనుకున్న విధంగానే రష్యాను దెబ్బ తీశామని ఉక్రెయిన్ కూడా ప్రకటన గుప్పించింది. ఉక్రెయిన్‌ను దెబ్బతీస్తే, మాస్కోను కూడా తీవ్రంగా దెబ్బ తీస్తామని, ఈసారి మా దాడి అత్యంత భయకరంగా ఉంటుందని, ఇక యుద్ధం ముగిపు పలికే సమయం ఆసన్నమైందని, దౌత్య పరంగా రష్యానే యుద్ధంకు ముగింపు పలకాలని అందుకు తగిన చర్యలు తీసుకోవాలని జెలెన్ స్కీ అభిమతంగా ఉంది. కానీ రష్యా అందుకు సుముఖం గా లేదు. ఇదిలా ఉంటే రష్యా ప్రకటన మరో విధంగా ఉంది. ఉక్రెయిన్‌కు చెందిన దాదాపు వెయ్యి డ్రోనులు, నాలుగు క్షిపణులు ధ్వంసం చేశామని రష్యా ప్రకటించింది. ఇలా ప్రతీకార దాడులతో రెండు కూడా సామరస్యంగా ఆలోచించకుండా దాడులతోనే రెచ్చిపోతున్నాయి. అయితే ఫ్రాన్స్‌లో జరిగిన జి 7దేశాల సదస్సులో ఐరోపాకు చెందిన సభ్య దేశాలు ఉక్రెయిన్‌కు మద్దతు ప్రకటించాయి. అమెరికా అధ్యక్షులు ట్రంప్ సమక్షంలో ఈ ప్రకటన చేయడం గమనార్హం. ట్రంప్ ఆలోచన వేరేగా ఉంది. యుద్ధాన్ని నివారించడానికి శాంతిపై మనసు పెడతామని ట్రంప్ ప్రకటించారు. ట్రంప్ ఆరాటం అంతా రెండు దేశాలు శాంతి బాటపట్టాలి అనే తలంపుగా ఉంది. వాస్తవానికి ఇలా ప్రతీకార దాడులతో నష్టం మనకే అనే విషయం రెండు దేశాలు గ్రహించకపోవడం శోచనీయం. ఇంకా ఎన్నాళ్ళు అని ఈదాడులు నివారించలేని అమెరికా, ఇరాన్ యుద్ధమే శాంతితో ముగిసింది. ఇప్పుడు దృష్టి అంతా రష్యా, ఉక్రెయిన్‌పైనే ఉంది. దీని నివారణకు ట్రంప్ ఆలోచనలో ఉన్నారు. చిన్న దేశమైనా ఉక్రెయిన్‌కు ఐరోపా దేశాలు అండగా నిలుస్తున్నాయి.అటు వంటప్పుడు ఉక్రెయిన్‌కే ఈ ఐరోపా దేశాలు నచ్చజెప్ప వచ్చు అనే మీమాంస ఎదురవుతోంది. చిన్న దేశమైనా ఉక్రెయిన్ దాడిచాలా భీతహంగా ఉంది. రాజీ చర్యలు ఉక్రెయిన్ నుంచే రావాలి అని రష్యా పట్టుదలగా ఉంది. ఇక్కడ యుద్ధం ఆగాలి అంటే ఉక్రెయిన్‌కే ఐరోపా దేశాలు చెప్పాలి. ట్రంప్ కూడా ఉక్రెయిన్‌కే చెబితే యుద్ధం ఆగిపోయే అవకాశాలున్నాయి. ఒకవేళ ఉక్రెయిన్ రాజీకి ఒప్పుకుంటే దాని పునర్ నిర్మాణానికి అంటే రష్యా దాడులతో నష్టపోయిన ప్రాంతాలను, కట్టడాలను రష్యానే నిర్మాణం చేపట్టాలి. మరి ఉక్రెయిన్ దాడితో నష్టపోయిన రష్యాలోని కట్టడాలను ఎవరు పునర్ నిర్మిస్తారు అనే ప్రశ్న ఉదయిస్తుంది. అదే పెద్దసమస్యగా ఉంది. దీనికి ఒక కార్యాచరణ రూపొందించాలి. ప్రతీకార దాడులతో నష్టాన్ని నివారించాలి. రెండు దేశాలకు ఆమోదయోగ్యమైన చర్యలు చేపడితే యుద్ధం నివారణ ఆగిపోగలదు. దీనికి భారత్ కూడా ప్రయత్నం చేయాలి. ట్రంప్, మోడీ కలిసి ఈ యుద్ధానికి ముగింపు పలుకుతారని ఆశిద్దాం. ●

# శాస్త్రీయతతో మూఢ విశ్వాసాలు కరిగిపోతాయా?

దాడిశెట్టి శ్యామ్ కుమార్

మానవుడు జీవనం కొనసాగిస్తున్న దశ నుండి చివరి వరకు ప్రతీదీ అనాదిగా వస్తున్న ఆచారాల వ్యవహారాల్లో ఉండే విశ్వాసాలను ఎక్కువగా అనుసరిస్తూనే ఉంటారు. కొన్నిసార్లు అతివిశ్వాసాలు అనర్థదాయకాలుగా గోచరిస్తుంటాయి. తెలిసి తెలియక పూర్తిస్థాయిలో అవగాహన లేకపోవడం వలన కావచ్చు, కొన్ని అపోహలను కల్పించుకొని సమాజంలో వాస్తవికతకు దూరంగా ఉండడం వలన దైనందిన జీవితంలో అనేక సమస్యలు ఎదురవుతూ ఉంటాయి. ఈ క్రమంలోనే మానవ మేధస్సు ఊహాత్మకమైన మానసిక సంఘర్షణకు లోనుఅయ్యే క్రమంలోనే మూఢ నమ్మకాలు విస్తరిస్తున్నాయేమో అని అనిపిస్తుంది. అట్లాని సమయ సందర్భానుచితంగా కొన్ని విషయాలు నమ్మగలిగే రీతిలో ఉంటే నమ్మకాలు వమ్ము కావేమో. మితిమీరిన మూఢనమ్మకాలు సమాజంలో మానవుల మానసిక వికాసంపై ప్రభావాన్ని చూపిస్తూ ఉంటాయి. నమ్మకాలు ప్రగతిశీలకమైనవిగా ఉండాలి తప్ప సమాజాన్ని అంధకారంలోకి తీసుకుపోయే విధంగా ఉండకూడదు. నమ్మకాలు మానవ జీవన విధానాల్లో క్రియాశీలకంగా ఉంటున్నప్పటికీ, మూఢ నమ్మకాలు మాత్రమే సమాజంలో చాలా సార్లు అనర్థాలను సృష్టిస్తుంటాయి. చేతబడి , దెయ్యాలు, భూతాలు ఇలాంటి పదాలన్నీ కూడా మానవ జీవన విధానాల్లో మూఢ విశ్వాసాలకు దగ్గరగా ఉన్నట్టుకనిపిస్తుంటాయి. మానవ మేధస్సులోకి చొచ్చుకు వస్తున్న అనేక భిన్న ఆలోచనలు మానవుల్లో అనేక సందేహాలు సమస్యలకు కారణం అవుతున్నాయి.సమస్యలు ఎదురైనప్పుడు వాటిని ఎదుర్కోలేని పరిస్థితిల్లో లేనప్పుడు ఈ క్రమంలో కొన్నిసార్లు కొందరు సమస్యలకు వ్యతిరేక శక్తులే కారణం కావచ్చునే సంఘర్షణతో మూఢ విశ్వాసాల వైపు మొగ్గుచూపుతుండడం గమనార్హం. అయితే మూఢనమ్మకాలు మానవ జీవన విధానాలకు అవరోధాలుగా మిగిలిపోకూడదు. మనోవిజ్ఞాన శాస్త్ర ప్రకారం మానవుడు తన చుట్టూ ఉన్న పరిసరాల్లో తిలకించే ప్రతి విషయాన్ని అవగాహన చేసుకుని క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత ఎందుకు, ఏమిటి ,ఎలా అనే ప్రశ్నలకు వేసుకుని సమాధానం దొరికినప్పుడే దానికి సరిగా స్పందించే తీరు నమ్మకమైనదిగా ఉంటుందని అనిపిస్తుంది. నిర్దిష్టమైన సరైన విశ్వాసం మనిషి ఆత్మ స్థైర్యానికి ప్రతీకగా నిలుస్తుంది ఇదే గనుక వ్యతిరేకంగా స్పందిస్తే అది మరో రూపం దాలుస్తుంది. చివరకు అచేతన స్థితిలోకి నెట్టి వేయబడుతుంది. ఇది మానవునిఆలోచన ధోరణిని బట్టి మారుతూ ఉంటుంది. సాంకేతికపరమైన అభివృద్ధి ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న శాస్త్రాన్ని సాంకేతికతను ఆధ్యాత్మికంతో జోడించే విధానం తరచుగా గోచరిస్తూ ఉంటుంది. అంతరిక్ష ప్రయోగాల నుండి మొదలు మానవుని దైనందిన జీవితం వరకు జీవితంలో నిర్ణీతమైన మంచి ఘడియలు, పంచాంగాల లాంటి వాటి పరిమితిలోనే పనులు చేయడం అనేది చూస్తుంటాం. చాలావరకు ముహూర్తాలను పెట్టుకుని పనులను ప్రారంభిస్తుంటారు. ప్రేతాత్మలు ఉంటాయని వాటిని



నిలువరించేందుకు పరమాత్మ స్వరూపాన్ని నమ్ముకోవడం చేసిన పనులు సక్రమంగా జరగడానికి విఫలం కాకుండా ఉండడానికి పూజలను నిర్వహించడం వ్యతిరేక భావనలను దుష్టశక్తులను అధిగమించడానికి దైవం అనే అంశం ముందుకు తీసుకురావడం ఇలాంటి ఎన్నో విషయాలు గమనిస్తే కొన్నిసార్లు మానవ మేధస్సు ఎంత ఉన్నతమైందో అంత భయం భక్తితో కూడుకున్నదని అనిపిస్తుంటుంది. గారడి విద్యలు లాంటివి ఎన్నో వినోదాత్మకంగా చాలావరకు అందరినీ రంజిపచేస్తుంటాయి. ఇలాంటి గారడీ విద్యలే మోసగాళ్ల చేతిలోకి వెళ్లి సమాజంలో మూఢవిశ్వాసాలను అధికంగా నమ్మేవారిని మోసం చేయడానికి దోహదపడతాయి. సాధ్యమైనంత వరకు భౌతికపరంగా వాస్తవికతను గుర్తించి నిజాన్ని కళ్ళతో చూసినప్పుడే విశ్వాసాలను నమ్మాలి కానీ ఏదో చెప్తే ఊహ ప్రపంచంలో కెళ్ళి చెప్పింది నమ్మితే అది నిజం కాదు. అలాంటప్పుడు అతి విశ్వాసాలు కూడా మితిమీరితే ఉపద్రవాలే వస్తాయి. విశ్వాసం ఉంటేనే మనిషి బతుకు జీవన విధానంలో అనుకున్నది సాధించగలరు. అదే మూఢవిశ్వాసాలు అయితే మానవ జీవన విధానాలు అనేక రకమైనటువంటి సమస్యలు తెచ్చి పెడుతుంటాయి . గతంతో పోలిస్తే సైన్స్ బాగా అభివృద్ధి చెందినప్పటికీ ఇప్పటికి ఎక్కువ శాతం మూఢవిశ్వాసాలపైన ఆసక్తి కనబరుస్తున్న వారులేకపోలేదు. కొందరు జన్మనామాన్ని, రాశులు నక్షత్రల ప్రామాణికంగా జాతకాలను సరిపోల్చుకుంటారు . చంద్రగ్రహణం సూర్యగ్రహణం ప్రభావాలను సైన్స్ దృష్టితో సరిచూడని వారు ఇప్పటికీ లేకపోలేదు. ఇలాంటివి ఎన్నో విషయాలు మానవ సమాజంలో అడపా దడపా గోచరిస్తుంటాయి. ఆధునిక యుగంలో కూడా మూఢవిశ్వాసాలపై ఆసక్తి అధికంగానే చూపిస్తున్న వారు ఎక్కువగానే ఉంటున్నారు. తద్వారా కొంతమంది వీటిని ఆసరా చేసుకుని సొమ్ము చేసుకోవడానికి వివిధ అవతారాలు ఎత్తి ప్రజలను నమ్మబలికి వారి నమ్మకాలను చివరికి వమ్ము చేసి మోసం చేస్తున్న మోసగాళ్ల మూఢవిశ్వాసాల పేరు మీద లక్షలాది రూపాయలు వసూలు చేసి పారిపోతున్నారు. నమ్మకాలు కూడా కొన్నిసార్లు అర్థరహితంగా మారుతుంటాయి. ఒక విషయంపై లోతుగా ఆలోచించే విధానం మానవ సమూహాల మధ్య ఒకేవిధంగా ఉండదు. ఏదైనానష్టం కలిగిస్తుందని మనసుకు అనిపిస్తే సరైన రీతిలో మానవ మేధస్సుకు జవాబు దొరకని పరిస్థితుల్లో మూఢవిశ్వాసాలకు దగ్గరవుతుంటారు. కొన్నిసార్లు సమాజంలో చేతబడి చేస్తున్నారనే నెపంతో కొన్ని ప్రాంతాల్లో అనాగరికంగా అనుమానితులపై దాడులు కూడా జరుగుతున్నాయి. సమాజంలో కొంతమంది మనిషి మానసిక బలహీనతను ఆసరాగా చేసుకుని మంత్రగాళ్లుగా కొత్త అవతారాలు ఎత్తుకొని మోసం చేసే రీతిలో ఏవో కట్టుకథలు చెప్పి డబ్బును దోచుకుపోతున్నారు. కారణాలేవైనా మనసు బలహీనంగా ఉన్నప్పుడే మూఢ విశ్వాసాలను బలంగా నమ్ముతారు. అలాంటి మానసిక బలహీనతల నుండి బయటపడేందుకు వాటిపై అవగాహన కలిగినటువంటి బోధకులు ఆధ్యాత్మిక గురువులు మానసికవేత్తలు శాస్త్రవేత్తలు సామాజిక స్పృహ కలిగిన వారందరూ నిరంతరం సమాజంలో మూఢవిశ్వాసాలపై సమాజానికి స్పృహ కలిగే విధంగా వివరణాత్మకమైన సందేశాలను మరింతగా సమాజంలో విస్తృతపరచాల్సి ఉంటుంది. ●

# 3 నౌకల ద్వారా భారత్‌కు చమురు

## మరిన్ని రప్పించేందుకు యత్నాలు

**టెహ్రాన్, జూన్ 21:** భారత సముద్ర వాణిజ్యానికి, ఇంధన భద్రతకు పెద్ద ఊరట లభించింది. వ్యూహాత్మకంగా అత్యంత కీలకమైన హార్ముజ్ జలసంధిని మూడు భారత జెండా కలిగిన భారీ క్రూడ్ ఆయిల్ ట్యాంకర్లు విజయవంతంగా దాటాయి. 8.6 లక్షల మెట్రిక్ టన్నుల ముడిచమురుతో ఈ నౌకలు ప్రస్తుతం భారత ఓడరేవుల వైపు ప్రయాణిస్తున్నాయి. పశ్చిమాసియాలో నెలకొన్న రాజకీయ, భౌగోళిక ఉద్రిక్తతల కారణంగా కొన్నాళ్లుగా నిలిచిపోయిన ఈ జలమార్గంలో రవాణా తిరిగి ప్రారంభం కావడం భారత్‌కు శుభపరిణామం.

ఈ విషయాన్ని కేంద్ర పోర్టులు, షిప్పింగ్, జల మార్గాల శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్ 'ఎక్స్' ద్వారా ప్రకటించారు. 'దేశ్ వైభవ్'. 'దేశ్ విభోర్', 'సన్మార్ హెరాల్డ్' అనే మూడు నౌకలు 94మంది భారత సిబ్బందితో హార్ముజ్ జలసంధిని సురక్షితంగా దాటినట్లు ఆయన తెలిపారు. 'ప్రధాని నరేంద్రమోడీ నిర్ణయాత్మక నాయకత్వంలో భారత ప్రభుత్వం దేశ సముద్ర ప్రయోజనాల పరిరక్షణకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తోంది. మన నావికుల భద్రత, దేశ ఇంధన సరఫరా మార్గాల పరిరక్షణ కోసం మా మంత్రిత్వ శాఖ అన్ని సంబంధిత ఏజెన్సీలతో సమన్వయం చేసుకుంటూ పనిచేస్తోంది' అని సోనోవాల్ తన పోస్టులో పేర్కొన్నారు. అధికారికక వర్గాల సమాచారం ప్రకారం ఈ మూడు నౌకలు జూన్ 24 నుంచి జూలై 1 మధ్య భారత తీరానికి చేరుకోనున్నాయి. 'దేశ్ వైభవ్' జూన్ 24న గుజరాత్‌లోని వాడినార్ పోర్టుకు, 'దేశ్ విభోర్' అదే రోజున సిక్కా పోర్టుకు



చేరుకునే అవకాశం ఉంది. ఇక జూన్ 20న హార్ముజ్ జలసంధిని దాటిన 'సన్మార్ హెరాల్డ్' నౌక జూలై 1న ఒడిశాలోని పారాదీప్ పోర్టుకు చేరుకోనుంది. ఈ పరిణామం వెనుక అంతర్జాతీయంగా చోటుచేసుకున్న కీలక దౌత్యపరమైన పరిణామాలు ఉన్నాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలను తగ్గించే లక్ష్యంతో అమెరికా, ఇరాన్ మధ్య ఇటీవల ఒక ఒప్పందం కుదిరింది. ఇదిలా ఉంటే ఈ నౌకలు సురక్షితంగా గమ్యస్థానాలకు చేరడం అనేది ఒకవైపు అంతర్జాతీయ దౌత్య విజయాన్ని, మరోవైపు భారత ప్రభుత్వం తన ఇంధన భద్రతకు, సముద్ర ప్రయోజనాలకు ఇస్తున్న ప్రాధాన్యతను సూచిస్తోందని విశ్లేషకులు భావిస్తున్నారు.

**హార్ముజ్‌లో టోల్ వసూలు చేస్తాం : డొనాల్డ్ ట్రంప్**

హార్ముజ్ జలసంధిని ఇరాన్ మళ్లీ మూసివేయడంపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 60 రోజుల్లో ఇరాన్‌తో తుది ఒప్పందం కుదరకపోతే జలసంధి మార్గంలో టోల్ విధిస్తామని హెచ్చరించారు. పశ్చిమాసియా దేశాలకు యుఎస్ అందించిన రక్షణ సేవలకు



గానూ ఆ డబ్బును తీసుకోనున్నట్లు వెల్లడించారు. ఇటీవల కుదిరిన ఒప్పందం ప్రకారం 60 రోజుల పాటు టోల్-రహిత ప్రయాణం ఉండాలన్నారు. మరోవైపు హార్ముజ్ ప్రస్తుతం ఇరాన్ నియంత్రణలో లేదని, రవాణా నిరంతరాయంగా కొనసాగుతోందని యుఎస్ సెంట్రల్ కమాండ్ ప్రతినిధి కెప్టెన్ టిమ్ హాకిన్స్ వెల్లడించారు. పరిస్థితి ఇలాగే ఉండేలా అమెరికా దళాలు చర్యలు తీసుకుంటున్నాయన్నారు.

శనివారం 17 మిలియన్ బ్యారెళ్లకు పైగా చమురుతో 55 వాణిజ్య నౌకలు జలసంధిని దాటినట్లు తెలిపారు. కాగా, ఇరాన్‌తో అణు చర్చల నిమిత్తం అమెరికా ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ బృందం స్విట్జర్లాండ్‌కు బయల్దేరింది.

**లెబనాన్‌పై కొనసాగుతున్న దాడులు**

ఒవైపు అమెరికా-ఇరాన్ ప్రతినిధుల మధ్య స్విట్జర్లాండ్‌లో చర్చలు మొదలుకానుండగా.. మరోవైపు ఇజ్రాయెల్ లెబనాన్‌పై దాడులు కొనసాగిస్తోంది. సరిహద్దుల వద్ద పలువురు ఇజ్రాయెల్ ప్రజలు పాలస్తీనీయులపై దాడులు చేసినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. కాల్పుల ఒప్పందాన్ని ఉల్లంఘించి ఇజ్రాయెల్ చేస్తున్న దాడులను ఎదుర్కోవడానికి తాము ఎదురు దాడులు చేయాల్సి వస్తోందని హెజ్‌బొల్లా ఆరోపించింది. శనివారం లెబనాన్‌లోని 100కు పైగా లక్ష్యాలపై వైమానిక దాడులు చేయడంతో పలువురు ప్రాణాలు కోల్పోయారని.. అనేక పౌర నివాసాలు ధ్వంసమయ్యాయని తెలిపింది.



## భారత్- ఇయు స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై డిసెంబర్‌లో సంతకాలు


### 2027 ఫిబ్రవరి-మార్చి నుంచి అమలు

### 93శాతం వస్తువులు డ్యూటీ ఫ్రీగా ఎగుమతి

### కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్

**న్యూఢిల్లీ, జూన్ 21:** భారత్, 27 దేశాల కూటమి అయిన యూరోపియన్ యూనియన్ (ఇయు) మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై డిసెంబర్ నాటికి సంతకాలు జరుగుతాయని, వచ్చే ఏడాది ఫిబ్రవరి-మార్చి నాటికి ఇది అమలులోకి వచ్చే అవకాశం ఉందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ ఆదివారం తెలిపారు. ఈ ఏడాది జనవరి 27న 'అత్యంత కీలకమైన ఒప్పందం' కోసం చర్చలు పూర్తయినట్లు భారత్, ఇయు ప్రకటించాయి. "ఇప్పుడు, దాదాపు సున్నా సుంకంతో, మొత్తం యూరోపియన్ మార్కెట్ మనకు అందుబాటులోకి రానుంది. ఇయుతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టిఎ)పై డిసెంబర్ నాటికి సంతకాలు జరుగుతాయి. ఫిబ్రవరి-మార్చి నాటికి అది అమల్లోకి వస్తుంది" అని ముంబైలో చార్టర్డ్ అకౌంటెంట్లతో జరిగిన సమావేశంలో గోయల్ పేర్కొన్నారు. తనతో వాణిజ్య ఒప్పంద చర్చలు జరపడానికి అమెరికా వాణిజ్య ప్రతినిధి జేమిసన్ గ్రీర్ ఈ వారంలో భారత్‌కు వస్తున్నారని కూడా ఆయన చెప్పారు. "ప్రపంచమంతా భారత్ వైపు చూస్తోంది" అని మంత్రి అన్నారు. భారత్- ఇయు ఎఫ్‌టిఎ కింద, భారతీయ ఎగుమతులలో సుమారు 93శాతం వస్తువులు 27 దేశాల కూటమికి సుంకం లేకుండా ఎగుమతి చేసే అవకాశం లభిస్తుంది, అదే సమయంలో ఇయు నుండి విలాసవంతమైన కార్లు, వైన్ల దిగుమతి చౌకగా మారుతుంది. భారత్- ఇయు కలిసి ప్రపంచ జిడిపిలో 25 శాతం, అంతర్జాతీయ వాణిజ్యంలో (సుమారు 33 ట్రిలియన్ల డాలర్లు) మూడవ వంతు (సుమారు 11 ట్రిలియన్ల డాలర్లు) వాటాను కలిగి ఉన్నాయి.

## పాఠశాల పుస్తకాల్లో యోగా




**న్యూఢిల్లీ, జూన్ 21:** హర్యానా ప్రభుత్వం పాఠశాలల్లో యోగా విద్యను భారీగా విస్తరిస్తున్నట్లు అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రకటించింది. ప్రస్తుత విద్యాసంవత్సరం (2026-27) నుండి 6వ తరగతి పాఠ్యప్రణాళికలో యోగాను చేర్చనున్నారు. వచ్చే ఏడాది దీనిని 3 నుండి 9వ తరగతుల వరకు పొడిగిస్తారు. విద్యార్థుల్లో సంపూర్ణ ఆరోగ్యం, శారీరక దృఢత్వాన్ని పెంపొందించడమే దీని ముఖ్య ఉద్దేశం. ఈ క్రమంలో ఉపాధ్యాయులకు, శారీరక శిక్షకులకు యోగా ఆసనాలపై ప్రభుత్వం ప్రత్యేక శిక్షణ ఇవ్వనుంది.

# సీఫుడ్స్‌లో అమ్మోనియా గ్యాస్ లీక్..

### ఏడుగురు మృతి, 74 మందికి తీవ్ర అస్వస్థత

**తిరువళ్లూరు,జూన్ 21:** తమిళనాడులో ఘోర పారిశ్రామిక ప్రమాదం చోటుచేసుకుంది. తిరువళ్లూరు జిల్లాలోని ఓ ప్రైవేట్ సీఫుడ్ ప్రాసెసింగ్ కంపెనీలో అమోనియా గ్యాస్ లీక్ కావడంతో ఏడుగురు కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో ఆరుగురు మహిళలు ఉన్నారు. ఈ దుర్ఘటనలో మరో 74 మందికి పైగా తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వారిని సమీప ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. వివరాల్లోకి వెళితే, తిరువళ్లూరు జిల్లా పెరియపాళయం సమీపంలోని కన్నిగైపెట్టై గ్రామంలో ఉన్న రొయ్యల ప్రాసెసింగ్ కంపెనీలో ఈ ప్రమాదం జరిగింది. ఫ్యాక్టరీలో అమోనియా గ్యాస్ ఒక్కసారిగా లీక్ కావడంతో అక్కడ పని




చేస్తున్న కార్మికులు ఊపిరాడక కుప్పకూలిపోయారు. బాధితుల్లో ఎక్కువ మంది ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చిన వారేనని తెలుస్తోంది. వీరిలో చాలా మంది 24,25 ఏళ్ల వయసున్న యువతులే ఉన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే బాధితులను సమీపంలోని వేల్స్, వెంకటేశ్వర ఆసుపత్రులకు తరలించారు. వీరిలో 9 మంది పరిస్థితి విషమంగా ఉండటం తో, మెరుగైన చికిత్స కోసం చెన్నైలోని స్టాన్లీ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం 11 మంది వెంటిలేటర్లపై ఉన్నారని, మరికొందరికి ఇంట్యూబేషన్ చేశామని వైద్యులు తెలిపారు. కోల్డ్ స్టోరేజ్ యూనిట్‌లోని వాల్వ్ ఫెయిల్ కావడంవల్లే గ్యాస్ లీక్ అయినట్లు ప్రాథమికంగా గుర్తించారు. సమాచారం అందుకున్న తిరు వళ్లూరు జిల్లా కలెక్టర్ ఎస్. కవిత ఘటనా స్థలాన్ని, ఆసుపత్రులను సందర్శించారు. ప్రమాదానికి గల కారణాలపై, కంపెనీలో భద్రతా లోపాలపై పూర్తిస్థాయి విచారణకు ఆదేశించినట్లు ఆమె వెల్లడించారు.

## సొలిసిటర్ జనరల్‌గా తుషార్ మెహతా పునర్నియామకం

### ఐదుగురు అదనపు జనరల్స్ కూడా..

**న్యూఢిల్లీ, జూన్ 21:** సుప్రీంకోర్టులో భారత సొలిసిటర్ జనరల్‌గా సీనియర్ న్యాయవాది తుషార్ మెహతాను మరో మూడేళ్ల కాలానికి పునర్నియమించేందుకు క్యాబినెట్ నియామకాల కమిటీ (సిసిఎ) ఆమోదం తెలిపింది. కేంద్ర సిబ్బంది మరియు శిక్షణశాఖ జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం, మెహతా కొత్త పదవీకాలం జులై 1, 2026 నుండి అమల్లోకి వస్తుంది. ఈ నియామకం మూడేళ్లపాటు లేదా తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు (ఏది ముందైతే అది) కొనసాగుతుంది. మెహతా అక్టోబర్ 10, 2018 నుండి సొలిసిటర్ జనరల్‌గా సేవలందిస్తున్నారు. అంతకుముందు, జూన్ 30, 2026 వరకు కొన సాగేలా జులై 1, 2023 నుండి ఆయనను పునర్నియమించారు. సుప్రీంకోర్టులో ఐదుగురు అదనపు సొలిసిటర్ జనరల్స్ (ఎఎస్‌జిల) పునర్నియామకానికి కూడా సిసిఎ ఆమోదం తెలిపింది. సీనియర్ న్యాయవాదులు విక్రమ్‌జిత్ బెనర్జీ, కె.ఎం. నటరాజ్ జులై 1, 2026 నుండి అమల్లోకి వచ్చేలా ఎఎస్‌జిలుగా పునర్నియమించబడ్డారు. సీనియర్ న్యాయవాదులు సూర్యప్రకాష్ వి.రాజు,



ఎన్.వెంకటరమన్, ఐశ్వర్య భాటి జూన్ 30, 2026 నుండి అమల్లోకి వచ్చేలా పునర్నియమించబడ్డారు. వీరి నియామకాలు కూడా మూడేళ్లపాటు లేదా తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు (ఏది ముందైతే అది) ఉంటాయి.

ఢిల్లీ హైకోర్టుకు ఎఎస్‌జిగా సీనియర్ న్యాయవాది చేతన్ శర్మను తిరిగి నియమించడానికి కూడా సిసిఎ ఆమోదం తెలిపింది. శర్మకు 2026 జులై 1 నుండి లేదా తదుపరి ఆదేశాలు వెలువడే వరకు వీటిలో ఏది ముందైతే అప్పటి వరకు మరో ఆరు నెలల పదవీకాలం పొడిగించబడింది.

# కాంగ్రెస్‌లో మళ్లీ లొల్లి



### శశిథరూర్ వర్సెస్ పవన్ ఖేరా

### ప్రధాని మోడీపై థరూర్ ప్రశంసలు

### థరూర్, మోడీపై ఖేరా విమర్శలు

**న్యూఢిల్లీ, జూన్ 21:** కాంగ్రెస్ పార్టీలో మళ్లీ సీనియర్ నాయకుల మధ్య మాటల యుద్ధం మొదలైంది. సీనియర్ ఎంపీ శశి థరూర్ మరోమారు తన సొంత పార్టీలోనే తీవ్ర వివాదానికి కేంద్రబిందువుగా మారారు. జీ7 సదస్సు వేదికగా పశ్చిమాసియా ఉద్రిక్తతల నడుమ భారతీయ వాణిజ్య నౌకల నావికుల భద్రత గురించి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేసిన వ్యాఖ్యలను శశి థరూర్ ప్రశంసించడం ఇందుకు కారణమైంది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో జరిగిన బహిరంగ, వ్యక్తిగత సమావేశాల్లో పౌర నావికులను సైనిక దాడుల లక్ష్యాలుగా చేసుకోకూడదనే స్పష్టమైన సందేశాన్ని మోడీ బలంగా వినిపించారని థరూర్ కొనియాడారు. అయితే ఈ వ్యాఖ్యలపై కాంగ్రెస్ ప్రచార విభాగం కన్వీనర్ పవన్ ఖేరా స్పందిస్తూ శశి థరూర్‌పై సోషల్ మీడియాలో సెటైర్లు వేశారు. విదేశాంగ శాఖ విడుదల చేసిన భారత్-అమెరికా అధికారిక ఉమ్మడి ప్రకటనలో ఒమన్ గల్ఫ్‌లో అమెరికా దళాల దాడి వల్ల ముగ్గురు భారతీయ నావికులు మరణించిన ఉదంతం గురించి ఎక్కడా ప్రస్తావన లేదని స్పష్టం చేశారు. "ప్రధాని మోడీపై శశి థరూర్‌కున్న ఆరాధన భౌతిక ప్రపంచ సరిహద్దులను దాటిపోయింది. అందుకే మోడీ అనని మాటలను కూడా ఆయన వినగలుగుతున్నారు" అంటూ పవన్ ఖేరా ఎద్దేవా చేశారు. దీనికి తోడుగా, విపక్ష నేత రాహుల్ గాంధీ అభిప్రాయాలకు భిన్నంగా థరూర్ ప్రభుత్వం వైపు మాట్లాడటంపై కాంగ్రెస్ శ్రేణులు అసంతృప్తి వ్యక్తం చేశాయి. ఈ పరిణామాన్ని సొమ్ము చేసుకునేందుకు రంగంలోకి దిగిన బిజెపి ప్రతినిధి షెహజాద్ పూనావాలా కాంగ్రెస్ అంతర్గత విభేదాలను ఎండగడుతూ రాహుల్ గాంధీ పుట్టినరోజు నాడే శశి థరూర్ ఆయనకు గట్టి షాక్ ఇచ్చారని వ్యాఖ్యానించారు.

సొంత పార్టీ నుంచే విమర్శలు వెల్లువెత్తడంతో శశి థరూర్ ఎక్స్ వేదికగా దీటుగా బదులిచ్చారు. దేశ పౌరుల ప్రాణాల రక్షణ, నావికుల భద్రత వంటి జాతీయ ప్రాధాన్యం ఉన్న అంశాన్ని కేవలం రాజకీయ లబ్ధి కోసం వివాదంగా మార్చడం అత్యంత విచారకరమని ఆయన అన్నారు. ముగ్గురు భారతీయులు ప్రాణాలు కోల్పోయిన ఈ అంశంలో రాజకీయం చేయడం కంటే పౌరుల క్షేమం కోసం అందరూ ఏకమవ్వాలని హితవు పలికారు. అంతేకాకుండా, తాను మీడియాలో వచ్చిన కథనాలు, గూగుల్ జెమిని సారాంశాల ఆధారంగానే నిజాలు మాట్లాడానని, తన జీవితంలో ఎప్పుడూ వాస్తవాలను వక్రీకరించలేదని శశిథరూర్ సమర్థించుకున్నారు.



## దంపతులపై కత్తులతో దాడి: మహిళ మృతి

**న్యూఢిల్లీ, జూన్ 21:** బైక్ పార్కింగ్ విషయంలో దంపతులు, పొరుగువారి మధ్య గొడవ జరిగింది. ఈ నేపథ్యంలో పొరుగున నివసించే వ్యక్తులు ఆ జంటపై కత్తితో దాడి చేశారు. కత్తిపోటు వల్ల మహిళ మరణించగా ఆమె భర్త తీవ్రంగా గాయపడ్డాడు. దేశ రాజధాని ఢిల్లీలో ఈ సంఘటన జరిగింది. భార్యాభర్తలైన ఆరతి, విక్కీ బిందాపూర్ ప్రాంతంలో నివసిస్తున్నారు. శనివారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో రోడ్డుపై బైక్ పార్కింగ్ విషయంలో ఆ దంపతులకు, పొరుగువారితో గొడవ జరిగింది. ఈ నేపథ్యంలో పొరుగింటి వ్యక్తులు కత్తితో వారిపై దాడి చేసి పొడిచారు. ఆరతి, ఆమె భర్త విక్కీ తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన ఆ దంపతులను దీన్ దయాళ్ ఉపాధ్యాయ ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆరతి మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు.

# ట్రంప్ వట్టి అబద్ధాలకోరు..

**రోమ్, జూన్ 21:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ఆయన మిత్రురాలి నుంచే ఊహించని రాజకీయ ఎదురుదెబ్బ తగిలింది. యూరప్‌లో ట్రంప్‌కు అత్యంత సన్నిహితురాలిగా, ఆయన విధానాలకు మద్దతుదారుగా పేరు పొందిన ఇటలీ ప్రధానమంత్రి జార్జియా మెలోనీ, ఇప్పుడు ఆయనపై తీవ్ర స్వరంతో విరుచుకుపడ్డారు. ట్రంప్ ఒక అబద్ధాల కోరని, మిత్రులను కాదని శత్రువులకు వంత పాడతారని ఆమె తీవ్రంగా విమర్శించారు. అంతేగాక నవంబర్ మధ్యంతర ఎన్నికలు సమీపిస్తున్న వేళ, పడిపోతున్న తన పాప్యులారిటీని చూసుకోవాలంటూ ట్రంప్‌కు చురకలు అంటించారు. జీ7 దేశాల నేతల్లో మరెవరూ చేయని సాహసాన్ని మెలోనీ చేయడం ఇప్పుడు అంతర్జాతీయ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. ఇటీవల జరిగిన జీ7 శిఖరాగ్ర సమావేశం ఎంతో ఉత్సాహభరితంగా ముగిసిందని ట్రంప్ ప్రకటించిన కొద్ది గంటల్లోనే ఈ అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. ఈ సమావేశంలో ఇరాన్‌తో శాంతి ఒప్పందంపై ట్రంప్ తీసుకున్న నిర్ణయంపై పలువురు నేతలు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేసినా, చివరికి అంతా సర్దుకుపోయారు. కానీ, సమావేశం ముగిసిన వెంటనే మెలోనీ నేరుగా ట్రంప్‌ను లక్ష్యంగా చేసుకోవడం అందరినీ ఆశ్చర్యపరిచింది. ఈ పరిణామాల నేపథ్యంలో, మయామిలో జరగాల్సిన యూఎస్ఇటలీ బిజినెస్ ఫోరమ్‌ను ఇటలీ విదేశాంగశాఖ రద్దు చేసింది. ఈ ఫోరమ్‌లోనే అమెరికా ప్రతిష్మాత్మకంగా భావిస్తున్న ఖిపాక్స్ సిలికాఖి అనే కీలక ఖనిజాల ఒప్పందంపై ఇటలీ అధికారికంగా సంతకం చేయాల్సి ఉంది. తాజా విభేదాలతో ఈ ఒప్పందం భవిష్యత్తు అగమ్యగోచరంగా మారింది. నిజానికి 2025లో ట్రంప్ తిరిగి అధ్యక్ష బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి యూరప్‌లోని చాలా మంది నేతలు ఆయనతో నేరుగా ఘర్షణకు దిగడం నష్టదాయకమని భావిస్తూ వచ్చారు. గతంలో ట్రంప్ మెలోనీ అందాన్ని పొగిడినప్పుడు, దానిపై విమర్శలు వచ్చినా ఆమె మౌనంగానే ఉన్నారు. కానీ ఇప్పుడు ఆమె వైఖరి పూర్తిగా మారింది. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్, యూకే ప్రధాని కీర్ స్టార్మర్, జర్మనీ ఛాన్సలర్ ఫ్రెడరిక్ మెర్జ్ వంటి



### అమెరికా అధ్యక్షుడిపై ఇటలీ ప్రధాని ధ్వజం

నేతలు ట్రంప్‌తో విభేదించినా, సర్దుకుపోయే ధోరణినే ప్రదర్శించారు. కానీ, మెలోనీ మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరించారు. వచ్చే ఏడాది ఇటలీలో జరగనున్న ఎన్నికలే మెలోనీ వ్యూహం మార్చుకోవడానికి కారణమని విశ్లేషకులు భావిస్తున్నారు.

## యోగాసనాలలో ఏనుగులు

**కోల్‌కతా, జూన్ 21:** అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా పశ్చిమ బెంగాల్‌లోని జల్దపార నేషనల్ పార్కులో ప్రకృతి ఒడిలో ప్రత్యేక వేడుకలు నిర్వహించారు. పచ్చని అడవి



మధ్య, నదీ తీరాన అటవీ శాఖ సిబ్బంది ఉత్సాహంగా యోగాసనాలు వేశారు. ఈ ప్రదర్శనలో సిబ్బందితో పాటు మావటిల సమక్షంలో ఏనుగులు కూడా పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఇందుకు సంబంధించిన వీడియోలు, ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

# టిఎంసి రూ.440 కోట్ల బ్యాంకు ఖాతాల స్తంభన



**కోల్‌కత్తా,జూన్ 21:** పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో పెను సంచలనం రేకెత్తిస్తూ అధికార తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) పార్టీకి చెందిన మూడు బ్యాంకు ఖాతాలను అధికారులు స్తంభింపజేశారు. సుమారు రూ.440కోట్ల నిధులున్న ఈ ఖాతాలపై వేటుపడటం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. పార్టీలో కొంతకాలంగా కొనసాగుతున్న అంతర్గత విభేదాల నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. తిరుగుబాటు నేత రిత్నబ్రత బెనర్జీ వర్గానికి చెందిన 10 మంది ఎమ్మెల్యేలు బిధానగర్ సైబర్ క్రైమ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఈ చర్యలు ప్రారంభమయ్యాయి. పార్టీ ఖాతాల్లో జమ అయిన నిధుల మూలాలపై సమగ్ర విచారణ జరపాలని, అందులో కట్‌మనీ, బలవంతపు వసూళ్లు, ప్రజాధనం దుర్వినియోగం వంటి అక్రమాలు ఉన్నాయని వారు ఆరోపించారు. ఈ ఫిర్యాదును పరిగణనలోకి తీసుకున్న పోలీసులు కోల్‌కతాలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సెంట్రల్ ప్లాజా బ్రాంచ్‌లో ఉన్న పార్టీ ఖాతాల నుంచి నగదు ఉపసంహారణ (డెబిట్ ఆపరేషన్స్) నిలిపివేయాలని బ్యాంకు అధికారులను ఆదేశించారు. ఇటీవలి ఎన్నికల అనంతరం టీఎంసీలో విభేదాలు పొడచూపిన విషయం విదితమే. ఈ క్రమంలోనే పార్టీ మాజీ కోశాధికారి అరూప్ బిస్వాస్ జూన్ 12న బ్యాంకు యాజమాన్యానికి లేఖ రాస్తూ పార్టీలో అంతర్గత వివాదాలు ఉన్నందున లావా దేవీలను నిలిపివేయాలని అభ్యర్థించారు. తిరుగు బాటు ఎమ్మెల్యేల ఫిర్యాదుతో ఈ వ్యవ హారంలోకి పోలీసులు ప్రవేశించి కఠిన నిర్ణయాలు తీసుకున్నారు. ఈ పరిణామాలను టీఎంసీ అధికా రిక వర్గాలు తీవ్రంగా ఖండిస్తూ, ఇదంతా రాజ కీయ ప్రేరేపితమని ఆరోపిస్తున్నాయి. తమ పార్టీ ఆర్థిక లావాదేవీలన్నీ పారదర్శకంగానే ఉన్నాయని, ఈ వ్యవహారాన్ని చట్టపరంగా ఎదుర్కొంటామని స్పష్టం చేశాయి. మరోవైపు, అరూప్ బిస్వాస్‌కు పార్టీ ఇప్పటికే షోకాజ్ నోటీసు జారీ చేసింది. పార్టీ నిధు లపై పూర్తిస్థాయి దర్యాప్తు జరగాల్సిందేనని తిరుగుబాటు వర్గం పట్టుబడుతోంది.

# సంక్షిప్త వార్తలు

## కాంగ్రెస్ ర్యాలీతో నీట్ రాయలేకపోయిన విద్యార్థినులు..




**బెంగళూరు,జూన్ 21:** నీట్ పేపర్ లీకేజీపై దేశవ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తూ, విద్యార్థుల భవిష్యత్ గురించి మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ ఈ విషయంలో బాధ్యతతో వ్యవహరించలేకపోయింది. కాంగ్రెస్ పార్టీ చేసిన ర్యాలీ వల్ల ట్రాఫిక్‌లో ఇరుక్కుని ముగ్గురు విద్యార్థినులు నీట్ పరీక్ష రాయలేకపోయారు. రెండు నిమిషాలు ఆలస్యం కావడంతో వారిని పరీక్షకు అనుతించలేదు. దీంతో విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. ఈ ఘటన ఆదివారం కర్ణాటక రాజధాని బెంగళూరులో జరిగింది. బెంగళూరులోని ఆర్సీ గవర్నమెంట్ కాలేజీలో ఆదివారం నీట్ పరీక్ష జరిగింది. ఈ పరీక్ష కోసం ముగ్గురు అభ్యర్థులు వెళ్తుండగా బెంగళూరు నగరంలో ట్రాఫిక్ జామ్ తలెత్తింది.

## వీణా పినరయి విజయన్‌కు ఇడి నోటీసులు

**తిరువనంతపురం, జూన్ 21:** కేరళ మాజీ సీఎం పినరయి విజయన్‌కు ఈడీ షాకిచ్చింది. ఆయన కూతురు టీ వీణాకు మనీ లాండరింగ్ కేసులో సమన్లు జారీ చేసింది. సీఎంఆర్ఎల్ అనే మైనింగ్ కంపెనీతోపాటు ఆమె ఐటీ కంపెనీకి సంబంధించి మనీ లాండరింగ్ జరి గిందనే ఆరోపణలపై ఈడీ నోటీసులు ఇచ్చింది. ఈనెల 29న వీణా తమ ఎదుట వ్యక్తిగతంగా హాజరుకావాలని నోటీసుల్లో పేర్కొంది. వీణాకు కేంద్ర దర్యాప్తు సంస్థ ఈడీ నోటీసులు ఇవ్వడం ఇది రెండోసారి. గతంలోనే ఒకసారి నోటీసులు ఇచ్చి విచారణ జరిపింది. ఈనెల 17న ఆమెను



కోచిలోని ఈడీ ఆఫీసులో అధికారులు విచా రించారు.దాదాపు తొమ్మిదిగంటలకుపైగా ఆమె ను విచారించారు. ఆమెపై పీఎంఎల్‌ఏ యాక్ట్ కింద నమోదైన కేసుపై ఈవిచారణ సాగుతోంది.

## రెండుకోట్ల సభ్యత్వ రికార్డు నమోదు చేసిన విజయ్ టివికె..



**చెన్నై,జూన్ 21:** తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కజగం (టీవీకే) పార్టీ సభ్యత్వ నమోదులో రెండు కోట్ల మైలురాయిని అధిగమించింది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఘనవిజయం సాధించి, అధికార పగ్గాలు చేపట్టిన కొద్ది వారాల్లోనే ఈ ఘనతను సొంతం చేసుకోవడం పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహాన్ని నింపింది. ఈ మేరకు పార్టీ వర్గాలు శనివారం అధికారికంగా ప్రకటన విడుదల చేశాయి. మై టీవీకే మొబైల్ యాప్ ద్వారా చేపట్టిన డిజిటల్ ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌కు విశేష స్పందన లభించడంతో సభ్యుల సంఖ్య భారీగా పెరిగినట్లు పార్టీ వెల్లడించింది. ఇటీవల ముగిసిన తమిళనాడు అసెంబ్లీ ఎన్నిల్లో టీవీకే 108 స్థానాలను కైవసం చేసుకుని అతిపెద్ద పక్షంగా ఆవిర్భవించిన సంగతి తెలిసిందే.

## ప్రముఖ కవి నారాయణన్ కురుప్ కన్నుమూత

**తిరువనంతపురం, జూన్ 21:** ప్రముఖ మలయాళ కవి, సాహితీ విమర్శకులు, పద్మశ్రీ పురస్కార గ్రహీత పి. నారాయణ కురుప్ (92) కన్నుమూశారు. తిరువనంతపురంలోని పెరూర్కడ లోని తన నివాసంలో ఆయన నిన్న అనారోగ్యంతో తుదిశ్వాస విడిచారు. ఆయన మృతి పట్ల మలయాళ సాహితీ లోకం తీవ్ర దిగ్భ్రాంతిని, విషాదాన్ని వ్యక్తం చేస్తోంది. 1934 సెప్టెంబర్ 5న అప్పటి ట్రావెన్‌కోర్ సంస్థానంలోని హరిపాడులో జన్మించిన నారాయణ కురుప్, కవిగా, విమర్శకుడిగా మల



యాళ సాహిత్యంలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సుస్థిరం చేసుకున్నారు. నాలుగు దశాబ్దాలకు పైగా సాహితీ సేవ చేసిన ఆయన, సంప్రదాయ మరియు ఆధునిక సాహిత్య ప్రక్రియలపై చెరగని ముద్ర వేశారు.



## నిత్య యోగా.. నిండు నూరేళ్లు ఆయుష్షు

**● ఆసనాలు వేసిన మంత్రి డోలా బివి స్వామి, కలెక్టర్ రాజాబాబు, ఎస్పీ హర్షవర్ధన్, జెసి కల్పనా కుమారి**

**ఒంగోలు, జూన్ 21 ప్రభాతవార్త:** సంపూర్ణ ఆరోగ్యానికి అనుదినం యోగా సాధన ఉత్తమ మార్గమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి చెప్పారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం ఒంగోలుని పోలీసు పరేడ్ గ్రౌండ్లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ నూకసాని బాలాజీ, జిల్లా కలెక్టర్ పి.రాజబాబు, ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు, జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారిలతో కలిసి ఆయన పాల్గొన్నారు. రాష్ట్ర స్థాయిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు విజయవాడలో పాల్గొన్న కార్యక్రమానికి సమాంతరంగా ఉదయం 6గంటల నుంచి 6.45 గంటల వరకు జరిగిన యోగా సాధన కార్యక్రమంలో వీరు ఉత్సాహంగా ఆసనాలు వేశారు. ఈ కార్యక్రమంలో 2000 మంది వరకు మహిళలు, విద్యార్థులు, ఉద్యోగులు, ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ హ్యాపీ, హెల్తీ సమాజం కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా యోగాంధ్ర కార్యక్రమానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. ప్రజలందరూ యోగా సాధనను తమ జీవితంలో భాగం చేసుకోవాలని మంత్రి పిలుపునిచ్చారు. కలెక్టర్ మాట్లాడుతూ యోగా సాధనపై ప్రజలకు విస్తృతఅవగాహన కల్పించేలా చర్యలు తీసుకున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా మూడు లక్షల అరవై మూడు వేల మందికి పైగా ప్రజలు దీని కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు ఆయన తెలిపారు. అంతకుమించి యోగాసనాలు కార్యక్రమంలో ప్రజలు పాల్గొన్నట్లు కలెక్టర్ చెప్పారు. గత 15 రోజులుగా జిల్లా వ్యాప్తంగా 4428 వేదికలలో యోగాభ్యసన కార్యక్రమాలను నిర్వహించామన్నారు. వయసుతో సంబంధం లేకుండా ప్రజలు ఇందులో పాల్గొన్నట్లు తెలిపారు. ఈ యోగాసనాలను కొనసాగించడం ద్వారా పరిపూర్ణ ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవచ్చన్నారు. ఎస్పీ మాట్లాడుతూ యోగాను జీవన విదానంగా మార్చుకోవాలని పిలుపునిచ్చారు. దీని ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం పొంది సానుకూల దృక్పథంతో జీవించవచ్చు అన్నారు. నూకసాని బాలాజీ మాట్లాడుతూ ఆరోగ్యకర జీవన శైలికి యోగా సాధన ఎంతో ముఖ్యమన్నారు. చిన్ననాటి నుంచే ప్రతి ఒక్కరూ యోగా సాధన అలవాటు చేసుకోవాలని సూచించారు. గత రెండు వారాలుగా యోగాసనాలతో శిక్షణ ఇచ్చిన గురువులను ఈ కార్యక్రమంలో సత్కరించారు. కాగా ఈ నెల 26వ తేదీన అంతర్జాతీయ డ్రగ్స్ వ్యతిరేక దినాన్ని పురస్కరించుకుని నషా ముక్త్ భారత్ ఇతి వృత్తంతో రూపొందించిన పోస్టర్లను ఈ కార్యక్రమంలో ఆవిష్కరించారు. మాదకద్రవ్యాలను స్వీకరించబోమని ప్రజలతో ఎస్పీ ప్రతిజ్ఞ చేయించారు. ఈ యోగాసనాల కార్యక్రమంలో డీఆర్వో మాధురి, జిల్లా పర్యాటక అధికారి తేళ్ల రవికుమార్, యోగాంధ్ర నోడల్ ఆఫీసర్ భీమ్ నాథ్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# 'యోగాంధ్ర'కు వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డు




వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డు అవార్డును సిఎం చంద్రబాబు చేతుల మీదుగా అందుకుంటున్న మంత్రి సత్యకుమార్

**విజయవాడ, జూన్ 21 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎపిలో ఆదివారం నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమానికి వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డు లభించింది. విజయవాడ ఇందిరాగాంధీ నగరపాలక సంస్థ క్రీడా మైదానంలో ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌కు సిఎం చంద్రబాబు నాయుడు సర్టిఫికెట్ అందించారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ మీడియాతో మాట్లాడుతూ కృష్ణానది తీరాన నిర్వహించిన చారిత్రాత్మక యోగాంధ్ర కార్యక్రమం విజయవంతం కావడంలో అధికార యంత్రాంగం, వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగుల పాత్ర అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమం కోసం శ్రమించిన వైద్యారోగశాఖ, ఆయుష్, ఇతర అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులకు అభినందనలు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో మొత్తం యంత్రాంగం సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేసిందని మంత్రి పేర్కొన్నారు. ముందస్తు ప్రణాళిక, కట్టుదిట్టమైన ఏర్పాట్లు, శాఖల మధ్య సమర్థవంతమైన సమన్వయం వల్లే కార్యక్రమం ఘన విజయం సాధించిందని పేర్కొన్నారు. కార్యక్రమ నిర్వహణలో అధికారులు, ఉద్యోగులు చూపిన నిబద్ధత, క్రమశిక్షణ, సేవాభావం ప్రశంసనీయమని అన్నారు. ఇదే సమయంలో జిల్లాలో జరిగిన యోగాంధ్ర కార్యక్రమాలు విజయవంతం అయ్యాయని చెప్పారు. కోటి ఏడు లక్షల మంది ఏకకాలంలో రాష్ట్ర వ్యాప్తంగా ఒకేసారి యోగాసనాలు వేయటం అద్భుత విషయం అన్నారు. 2025లో మాదిరిగానే 2026లోనూ యోగాంధ్ర కార్యక్రమాల నిర్వహణలో ఎపి స్టేట్ స్ఫూర్తిగా నిలిచిందన్నారు. ఇది తనను ఎంతగానో ఆనందాన్ని కలిగిస్తుందని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్, ఆయుష్ డైరెక్టర్ గోపాలకృష్ణ, డైరెక్టర్ ఆఫ్ సెకండర్ హెల్త్ చక్రధర్ బాబు పాల్గొన్నారు.




## యోగా ఒక జీవన విధానం

**శ్రీకాళహస్తి, జూన్ 21 ప్రభాతవార్త:** యోగా ఒక వ్యాయామం మాత్రమే కాదని ఇది జీవన విధానమని శుకబ్రహ్మాశ్రమ పీఠాధిపతి విద్యా స్వరూపానందగిరి స్వామి అన్నారు. ఆదివారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఆశ్రమ ప్రాంగణంలో భారీ ఎత్తున మహోత్సవాన్ని ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమాలకు బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్‌కుమార్, బిజెపి మాజీ జిల్లా ఉపాధ్యక్షులు చంద్రప్ప, న్యాయవాదులు రాజేశ్వరరావు, గరికపాటి రమేష్‌బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా యోగా సాధకులనుద్దేశించి పీఠాధిపతి విద్యాస్వరూపానందగిరి స్వామి మాట్లాడుతూ 'యోగ:కర్మసు కైశలమ్' అనే శ్లోకం భగవద్గీతలో పేర్కొనబడిందన్నారు. యోగం అనేది కేవలం శారీరక వ్యాయామం మాత్రమే కాదని శరీరానికి మనస్సుకు మధ్య సమన్వయాన్ని కల్పించే సంపూర్ణ జీవన విధానం అన్నారు. ప్రతి రోజూ కొద్ది నిముషాల పాటు యోగసాధన చేస్తే ఆరోగ్యం మెరుగుపడటమే కాకుండా, మానసిక ప్రశాంతత, ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం కూడా పెరుగుతాయన్నారు. ఈ రోజుల్లో మారుతున్న జీవనశైలి, ఒత్తిడి, అనారోగ్య సమస్యల నుంచి బయటపడేందుకు యోగం ఒక అద్భుతమైన సాధన మార్గం అన్నారు. అందుకే ప్రతి ఒక్కరు తమ దైనందిన జీవితంలో యోగాన్ని భాగం చేసుకోవాలని స్వామి పిలుపు నిచ్చారు.

# యోగ ఫర్ హెల్దీ ఏజింగ్

### పోలీసు ప్రధాన కార్యాలయంలో యోగాంధ్ర



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయంలో యోగా కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది

**విజయవాడ, జూన్ 21 ప్రభాతవార్త ప్రతినిధి:** అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా మంగళగిరిలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయంలో ఆదివారం యోగా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలీసు శాఖకు సంబంధించిన పలువురు ఉన్నతాధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పోలీస్ ప్రధాన కార్యాలయ జంక్షన్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై ఉదయం 6.30 గంటలకు యోగా సాధన ప్రారంభమైంది. యోగా నిపుణుల పర్యవేక్షణలో గంటపాటు వివిధ యోగాసనాలు, ప్రాణాయామాలు నిర్వహించారు. శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత, ఏకాగ్రత పెంపొందించుకోవడంతో పాటు విధి నిర్వహణలో ఎదురయ్యే ఒత్తిడిని అధిగమించేందుకు యోగా ఎంతగానో దోహదపడుతుందని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిఐజి అడ్మిన్ అమ్మిరెడ్డి, కృష్ణకాంత్‌తో పాటు ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. యోగా ఆరోగ్యకరమైన జీవనశైలికి పునాది వంటిదని, ప్రతి ఒక్కరూ దానిని నిత్యజీవితంలో భాగం చేసుకోవాలని వారు సూచించారు.

ఈ ఏడాది అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని యోగ ఫర్ హెల్తీ ఏజింగ్ (ఆరోగ్యకరమైన వృద్ధాప్యం కోసం యోగా) అనే అంశంతో నిర్వహిస్తున్నారు. వయస్సు పెరిగే కొద్దీ ఆరోగ్య సమస్యలను తగ్గించుకోవడంలో, శారీరకమానసిక సామర్థ్యాలను మెరుగుపరచుకోవడంలో యోగా కీలక పాత్ర పోషిస్తుందని ఈ సందర్భంగా అధికారులు వివరించారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా పోలీసు కార్యాలయాలు, శిక్షణా కేంద్రాలు, పరేడ్ మైదానాలు, ఇతర పోలీసు సంస్థల్లోనూ యోగా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. వేలాది మంది పోలీసు అధికారులు, సిబ్బంది, హోంగార్డులు పాల్గొని యోగా ప్రాముఖ్యతను చాటారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి యోగా ఉత్తమ సాధనమని అధికారులు పేర్కొన్నారు.

## ఈగల్ సేవలకు సిఎం చంద్రబాబు ప్రశంసలు




**విజయవాడ, జూన్ 21 ప్రభాతవార్త ప్రతినిధి:** అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా విజయవాడలోని ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి యోగాంధ్ర' కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రముఖ యోగా గురువు బాబా రామ్‌దేవ్, మంత్రి లోకేష్ పాల్గొని కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ కార్యక్రమం అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా బ్రాహ్మకుమారిస్ ఆధ్వర్యంలో వ్యసనముక్త భారత అభియాన్ ప్రచార వాహనం జెండా ఊపి ప్రారంభించారు. తదుపరి ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఈగిల్ 1972 పోస్టర్లను ఘనంగా ఆవిష్కరించారు. ఈగల్ ఆంధ్రప్రదేశ్ విభాగం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలు, ప్రజా భద్రత, అవగాహన కార్యక్రమాల గురించి ఈగల్ ఐజి రవికృష్ణ ముఖ్యమంత్రికి వివరించారు. ఈగల్ సంస్థ చేపడుతున్న ప్రజోపయోగ కార్యక్రమాలు, సేవలను తెలుసుకున్న ముఖ్యమంత్రి, ఐజి రవికృష్ణని ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో కూడా ప్రజలకు సేవా కార్యక్రమాలను విస్తరించాలని సూచిస్తూ ఈగల్ బృందాన్ని ప్రోత్సహించారు.

ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశా, విజయవాడ పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖర బాబు, పలువురు శాసనసభ్యులు, ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈగల్ ఎస్పీ బి. స్వరూపా రాణి, ఈగల్ హెడ్‌క్వార్టర్స్ డిఎస్పీ రీ. సింగయ్య, విజయవాడ ఈగల్ ఇన్‌స్పెక్టర్ ఎం. రవీంద్రతో పాటు ఈగల్ టీమ్ సభ్యులు పాల్గొన్నారు.



## శిద్దాకు అమెరికన్ వర్సిటీ డాక్టరేట్

**ఒంగోలు, జూన్ 21 ప్రభాతవార్త:** ప్రముఖ పారిశ్రామికవేత్త, ఆధ్యాత్మిక బంధువు,మాజీ మంత్రి శిద్దా రాఘవ రావుకి అమెరికాకు చెందిన ప్రఖ్యాత టాప్ లెవెల్ విద్యా సంస్థ మేరీ ల్యాండ్ యూనివర్సిటీ, గౌరవ డాక్టరేట్‌ను ప్రధానం చేసింది. ప్రపంచ వ్యాప్తంగా సమాజానికి ఉత్తమ సేవలు, ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణ, వ్యాపార నిర్వహణ, తదితర అంశాలపై విశేష సేవలు అందజేసినందుకు శిద్దా రాఘవ రావు కు ఈ గౌరవ పురస్కారం దక్కింది. విభిన్న రంగాలలో ఆయన చేసిన సేవలను గుర్తించిన మేరీ ల్యాండ్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ సోఫియా నుబాని, చాన్సలర్ డా జాన్ ఎన్.కలరస్ సంయుక్తంగా రాఘవరావుకి డాక్టరేట్‌ను ప్రకటించారు. ఈ మేరకు ఆదివారం ఒంగోలు రైస్ మిలర్స్ అసోసియేషన్ హాల్‌లో జరిగిన లయన్స్ క్లబ్ నిర్వహించిన ఒక కార్యక్రమంలో డాక్టరేట్ బిరుదు అందుకున్న శిద్దా రాఘవరావుని అభినందిస్తూ సత్కరించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ తనకి డాక్టరేట్ ప్రకటించిన యూనివర్సిటీ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలియచేస్తూ, తన జీవిత ప్రస్థానంలో ఎన్నో ఒడిదుడుకులు, ఆటు పోట్లను ఎదుర్కొన్నానన్నారు. లయన్స్ క్లబ్ ద్వారానే తనకు విశేష గుర్తింపు వచ్చిందన్నారు. మానవ సేవే మాధవ సేవా అని, ప్రతిఫలం ఆశించకుండా నిస్వార్థంగా చేసే సేవలు మనకు గుర్తింపు తెస్తాయన్నారు. లయన్స్ క్లబ్‌లో తన ప్రస్థానంలో తనకు చేదోడుగా వున్న సభ్యులకు ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. ఈ డాక్టరేట్ తనకు సామాజిక బాధ్యతను మరింత పెంచిది అని, అందరి సహకారంతో ఇంకా మరిన్ని సేవలు అందించడానికి తాను ఎల్లవేళలా సిద్ధంగా ఉంటానన్నారు. డాక్టరేట్ అందుకున్న మాజీ మంత్రి శిద్దా రాఘవరావును పలువురు ప్రముఖులు అభినందిస్తూ శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ పి.ఎమ్.జె ఎఫ్.ఎమ్.ఉపేంద్ర,లయన్ అంబటి సుధాకర్ రెడ్డి, చీమకుర్తి లయన్స్ క్లబ్ సభ్యులు డా.జవహర్, లయన్ డి శాంతి, లయన్ హరి ప్రసాద రావు, లయన్ ఆర్.లక్ష్మీనారాయణ, లయన్ డా.వై.గాంధీ, లయన్ పి.విజయ కుమార్ రెడ్డి, లయన్ నామినేని మెహన్ రావు తదితరులు పాల్గొన్నారు.



ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులకు మెమొంటో అందిస్తున్న ఇఓ

## ఆర్యవైశ్య మహాసభ నేత రాహుకేతు పూజలు

**శ్రీకాళహస్తి, జూన్ 21 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు ఇల్లూరి లక్ష్మయ్య కుటుంబ సభ్యులతో హాజరై మహిమాన్విత రాహుకేతుదోష నివారణ పూజలను జరిపించుకున్నారు. వారికి దక్షిణ గోపురం వద్ద ఆలయ మర్యాదలతో ఇఓ వెంకటేశు పర్యవేక్షణలో ప్రోటోకాల్ ఎఇఓ లోకేష్‌బాబు, ఎపిఆర్ఓ రవిలు వేదపండితులతో స్వాగతం పలికారు. రాహుకేతుదోష నివారణ పూజల అనంతరం వారికి స్వామి అమ్మవార్ల ఆలయాల్లో అంతరాలయ దర్శనం ఏర్పాటు చేసారు. మృత్యుంజయస్వామి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు. స్వామి అమ్మవార్ల తీర్థ ప్రసాదాలు, శేష వస్త్రాలను ఆలయ ఇఓ వవెంకటేశు, ధర్మకర్తల మండలి సభ్యుడు వాకచర్ల గుర్రప్పశెట్టిలు అందించారు.

# పాస్ పోర్ట్ వెరిఫికేషన్‌లో ఎపి భేష్

### పోలీసుల పనితీరుకు అత్యున్నత పురస్కారం



**విజయవాడ, జూన్ 21 ప్రభాతవార్త ప్రతినిధి:** పాస్‌పోర్ట్ దరఖాస్తుల పోలీసు ధ్రువీకరణలో దేశవ్యాప్తంగా అత్యుత్తమ పనితీరు కనబర్చినందుకు ఆంధ్రప్రదేశ్ పోలీసు శాఖకు ప్రతిష్ఠాత్మక ఇన్‌స్టిట్యూషనల్ పెర్ఫార్మెన్స్ అవార్డు ఫర్ స్టేట్ పోలీస్ లభించింది. ఈ అవార్డును కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ న్యూఢిల్లీలోని సుష్మా స్వరాజ్ భవన్‌లో నిర్వహించిన పాస్‌పోర్ట్ సేవా దివస్-2026 కార్యక్రమంలో ప్రదానం చేశారు. డిజిపి హరీష్‌కుమార్ గుప్తా తరఫున ఇంటెలిజెన్స్ విభాగం ఎస్పీ రమాదేవి ఈ పురస్కారాన్ని అందుకున్నారు. డిజిపి హరీష్‌కుమార్ గుప్తా నేతృత్వంలో వరుసగా రెండో ఏడాది ఈ గౌరవాన్ని రాష్ట్ర పోలీసు శాఖ దక్కించుకోవడం విశేషం. కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ దేశవ్యాప్తంగా పాస్ పోర్టు వెరిఫికేషన్‌లో రాష్ట్ర పోలీసు శాఖల పనితీరును సమీక్షించి ఈ అవార్డును ప్రకటించింది.

ఎపి పోలీసు శాఖ 2025-26 సంవత్సరంలో రాష్ట్రవ్యాప్తంగా 6,32,931 పాస్‌పోర్ట్ దరఖాస్తుల పోలీసు వెరిఫికేషన్ సమర్థవంతంగా పూర్తి చేయడం, నిర్దేశిత గడువులో వేగవంతమైన ధ్రువీకరణ సేవలు అందించడం, పౌరులకు పారదర్శకమైన సేవలు కల్పించడం వంటి అంశాల ఆధారంగా కేంద్ర ప్రభుత్వం ఈ అవార్డును ప్రకటించింది.

ఈ సందర్భంగా డిజిపి హరీష్‌కుమార్ గుప్తా మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రజా సేవలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న ప్రభుత్వ విధానాల ఫలితంగానే ఈ విజయం సాధ్యమైందన్నారు. పాస్‌పోర్ట్ దరఖాస్తుల పోలీసు ధ్రువీకరణ ప్రక్రియను అత్యంత స్వల్ప కాలంలో, ఎలాంటి జాప్యం లేకుండా పూర్తి చేస్తూ ప్రజలకు నాణ్యమైన సేవలు అందిస్తున్నామని డిజిపి వివరించారు. ఆధునిక సాంకేతికత వినియోగం, సమర్థవంతమైన పర్యవేక్షణ, జిల్లా స్థాయి పోలీసు యంత్రాంగం సమన్వయంతో పాస్‌పోర్ట్ వెరిఫికేషన్ ప్రక్రియను వేగవంతం చేశామని పేర్కొన్నారు. కాగా, గత 2024- 25 ఆర్థిక సంవత్సరంలోనూ పాస్‌పోర్ట్ వెరిఫికేషన్‌లో అత్యుత్తమ పనితీరు కనబర్చినందుకు ఎపి పోలీసు శాఖ అవార్డును అందుకుంది. దీంతో వరుసగా రెండో ఏడాది జాతీయ స్థాయి గుర్తింపు దక్కడం రాష్ట్ర పోలీసు శాఖకు మరో మైలురాయిగా నిలిచింది. ఈ విజయానికి కృషి చేసిన అదనపు డిజి (ఇంటెలిజెన్స్) మహేష్ చంద్ర లడ్డా, జిల్లా ఎస్పీలు, నగర పోలీసు కమిషనర్లు, స్పెషల్ బ్రాంచ్ అధికారులు, సిబ్బంది సమిష్టి కృషి వల్లే ఈ ఘనత సాధ్యమైందని డిజిపి హరీష్ కుమార్ గుప్తా పేర్కొన్నారు. ప్రజా సేవల్లో ఇదే స్ఫూర్తితో మరింత మెరుగైన ఫలితాలు సాధించాలని సూచించారు.

### జాతీయ రహదారిలో ఘోర రోడ్డు ప్రమాదం

## ఇరువురు యువకులు మృతి



**కొరిశపాడు(అద్దంకి), జూన్ 21 ప్రభాతవార్త:** జాతీయ రహదారి పై ఘోర రోడ్డు ప్రమాదం జరగగా ఇరువురు యువకులు మరణించిన సంఘటన ఆదివారం నాడు జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం విజయవాడలో ఆలయ దర్శనానికి కందుకూరు పట్టణానికి చెందిన శ్రీరామచక్రి, ఓగూరు గ్రామానికి చెందిన చిట్టాల గోపి బయలుదేరారు. మార్గమధ్యంలో మేదరమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారిపై సాయంత్రం ద్విచక్ర వాహనంపై వెళుతున్న వీరు ముందున్న గుర్తు తెలియని లారీని వెనుక నుండి ఢీకొట్టడంతో ప్రమాదం జరిగినట్లు భావిస్తున్నారు. ఈ ప్రమాదంలో శ్రీరామచక్ర (22) సంవత్సరాలు ఘటనాస్థలిలోనే మరణించారు. తీవ్ర గాయాలైన చిట్టాల గోపి వయసు (26) అద్దంకి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. మేదరమెట్ల ఎస్సై షేక్ మొహమ్మద్ రఫీ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## జులై 15 లోగా అన్నదాన, ప్రసాదభవనాలు ప్రారంభించాలి



హైకోర్టు జడ్జికి దుర్గమ్మ చిత్రపటం అందజేస్తున్న దృశ్యం

**ఇంద్రకీలాద్రి, జూన్ 21 ప్రభాతవార్త:** దుర్గమ్మ ఆలయంలో నూతనంగా నిర్మిస్తున్న అన్నదాన, ప్రసాద భవనాలు జులై 15లోగా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని దేవదాయ శాఖ కమీషనర్ కె.రామచంద్ర మోహన్ ఆదేశించారు. ఆషాఢ ఉత్సవాల నాటికి భక్తులకు ఈ కొత్త భవనాలు అందుబాటులోకి తేవాలన్నారు. ఈ సందర్భంగా కమీషనర్ అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం మీడియాతో మాటాడుతూ భక్తులకు సేవలందించడమే పరమావధిగా భక్తులకు అంతర్జాతీయ స్థాయి మౌలికవసతుల కల్పనపై రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ధృఢ సంకల్పంతో పనిచేస్తోందని అన్నారు. ఆశీర్వచన మండపం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. క్యూకాంప్లెక్ కోసం స్థల సేకరణ వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఆయనతో పాటు చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఇఓ వికె శీనా నాయక్, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

**భారతీయ సంప్రదాయంలో దేవాలయ సంస్కృతిలో యోగా ఒక భాగం:** దుర్గమ్మ ఆలయంలో ఆదివారం నిర్వహించిన అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన ఎండోమెంట్ కమీషనర్ మాట్లాడుతూ భారతీయ సంప్రదాయంలో దేవాలయ సంస్కృతిలో యోగా ఒక భాగమన్నారు. దుర్గమ్మ ఆలయంలో 15 రోజులపాటు విజయవంతంగా యోగా శిక్షణ కార్యక్రమం జరిగిందని చైర్మన్ బొర్రా రాధాకృష్ణ అన్నారు. వేలాది మంది భక్తులు, ఆలయాధికారులు, సిబ్బంది పాల్గొన్నారన్నారు. ప్రతి ఒక్కరు నిత్యజీవితంలో యోగాను ఒక భాగం చేసుకోవాలని ఇఓ వికె శీనా నాయక్ అన్నారు.

కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, ఆలయ ధర్మకర్తలు, అధికారులు, అర్చకులు, సెక్యూరిటీ, పారిశుద్ధ్య సిబ్బంతో పాటు వేలాదిమంది భక్తులు యోగాసనాలు, ప్రాణాయామం చేశారు. యోగ శిక్షణ గురువు గర్రె రాజేష్‌ను ఈ సందర్భంగా సత్కరించారు.

**నిత్యాన్నదాన పథకానికి విరాళం:** దుర్గమ్మ ఆలయంలో జరుగుతున్న నిత్యాన్నదాన పథకానికి తిరుచానూరుకు చెందిన కె శ్రీరామమూర్తి రు.1లక్ష విరాళం ఆదివారం అందించారు. గుడివాడకు చెందిన ఎం.గాయత్రీలోక్షి చైతన్య రు.1,00,116ల విరాళం అందించారు. దాతలకు దుర్గమ్మ దర్శనం ఏర్పాటు చేసిన అనంతరం వారికి దుర్గమ్మ చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

**ఇఓ క్షేత్రస్థాయి పరిశీలన:** ఆదివారం ఇఓ వికె శీనా నాయక్ ఆలయంలో క్షేత్రస్థాయిలో పర్యటించి క్యూలైన్లు, తదితరాలను పరిశీలించారు. భక్తులతో ముచ్చటించారు. భక్తులు సంతృప్తివ్యక్తం చేశారు.

**దుర్గమ్మ సేవలో హైకోర్టు న్యాయమూర్తి:** దుర్గమ్మని ఆదివారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లక్ష్మణరావు సతీసమేతంగా దర్శించుకున్నారు. వారికి దుర్గమ్మ చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

## వెన్నుపోటు గురించి మాట్లాడే అర్హత వైసిపికి లేదు: పృథ్వీరాజ్

**సత్యవేడు, జూన్ 21 ప్రభాతవార్త:** రాష్ట్రాన్ని ఐదేళ్ళ పాటు విధ్వంసం చేసి,యువత భవిష్యత్‌ను అంధకారంలోకి నెట్టిన వైసిపి నేడు ప్రజల కోసం పోరాటం చేస్తున్నట్లు నటించడం హాస్యాస్పదంగా ఉందని టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చిట్టేటి పృథ్వీరాజ్ ఎద్దేవా చేశారు. టిడిపి కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో వైసిపికి ప్రజలు ఇచ్చిన తీర్పును ఇప్పటికీ జీర్ణించుకోలేని జగన్ అండ్ కో అసత్య ప్రచారాలతో రాజకీయ మనుగడ కోసం తంటాలు పడుతున్నారని తెలిపారు. అధికారంలో ఉన్నప్పుడు అహంకారం, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఆవేదన... ఇదే వైసిపి రాజకీయాల అసలు రూపం అని ఘాటుగా విమర్శించారు. నిరుద్యోగుల గురించి మాట్లాడే ముందు, వైసిపి పాలనలో ఒక్క పరిశ్రమ కూడా ఎందుకురాలేదో సమాధానం చెప్పాలని, వేల కోట్ల పెట్టుబడులు రాష్ట్రాన్ని ఎందుకు వదిలివెళ్లాయో చెప్పాలని నిలదీశారు. ఉద్యోగ ఉపాధి కల్పనలో ఘోరంగా విఫలమైన వైసిపి నేడు యువతకు మద్దతు దారులమని చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజల సంక్షేమం పేరుతో రాష్ట్ర ఖజానాను ఖాళీ చేసి అభివృద్ధిని పూర్తిగా పక్కనపెట్టిన వైసిపి పాలన ఫలితంగా ఆంధ్రప్రదేశ్ తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొందన్నారు. ఆ పరిస్థితులను సరిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుంటే, ఓటమి బాధతో వైసిపి నేతలు ప్రతి అంశాన్ని రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణతో ముందుకు సాగుతోంది. కానీ వైసిపి నాయకులు మాత్రం తమ పాలనలో చేసిన తప్పులను కప్పిపుచ్చుకునేందుకు నిరసనల పేరుతో చేస్తున్న డ్రామాలను ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి, యువతకు ఉద్యోగాలు, రైతులకు భరోసా, మహిళలకు సాధికారత కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, ప్రజా సంక్షేమం, అభివృద్ధి అనే రెండు చక్రాలతో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లే దిశగా ప్రభుత్వం పని చేస్తోందని కుండబద్ధలు కొట్టారు. ప్రజలను మోసం చేసిన వారిని ప్రజలు ఇప్పటికే తిరస్కరించారని, మళ్లీ అదే నాటకాలను నమ్మే పరిస్థితి రాష్ట్రంలో లేదని తేల్చి చెప్పారు.

## నరసాపురంలో మహిళ దారుణహత్య

**నరసాపురం, జూన్ 21 ప్రభాతవార్త:** ఎంతో ప్రశాంతంగా ఉంటున్న నరసాపురం పట్టణం ఆదివారం ఉదయం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. దినచర్య మొదలవుతున్న సమయంలో నడిరోడ్డుపై హత్య అందరిని భయాందోళనకు గురిచేసింది. అమ్మాయిని హత్య చేశారు అనే వార్త దావానలంలా వ్యాపించడంతో ఏ కాలేజీ స్టూడెంట్ నో ప్రేమోన్మాది పీక కోసి ఉంటాడని అందరూ ఆందోళనగా టివిలు ఆన్ చేసి న్యూస్‌ని చూశారు. కానీ ఓ వివాహితను బాగా పరిచయం ఉన్న వ్యక్తి తెలివిగా కారులో వెంబడించి అతి దారుణంగా కత్తితో పొడిచి చంపాడని సమాచారం రావడంతో విస్తుపోయారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలంలోని సఖినేటిపల్లి లంక గ్రామానికి చెందిన జాలెం టీనా రోజాను అదే గ్రామానికి చెందిన మార్గాన రమేష్‌బాబు అతి కిరాతకంగా పొడిచి చంపాడు. ఆదివారం ఉదయం 7-8 గంటల మధ్య ఈ దారుణం చోటుచేసుకుంది. నరసాపురం- పాలకొల్లు రోడ్డులోని పెట్రోల్ బంక్ సమీపంలో హంతకుడు ఆమెను దారుణంగా పొడిచాడు. రైలు దిగి సఖినేటిపల్లి గ్రామానికి చెందిన అంగర సురేష్‌బాబు కారులో రోజా బయలుదేరింది. ఆమెతో పరిచయం ఉన్న ఎం.రమేష్ బాబు కూడా కొంత దూరం పోయాక కారు ఎక్కాడు. మార్గ మధ్యలో ఇరువురికి ఘర్షణ జరిగిందని ఈ సందర్భంగా హంతకుడు ఆమెను విచక్షణారహితంగా పొడిచినట్లు పోలీసులు తెలిపారు. అడ్డుకున్న కారు డ్రైవ్ చేస్తున్న సురేష్ బాబును కూడా అతను తీవ్రంగా గాయపరిచాడు. రోజాను హుటాహుటిని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లిన ప్రయోజనం లేకపోయింది. ఆసుపత్రికి వచ్చేసరికి ఆమె చనిపోయినట్లు డాక్టర్లు నిర్ధారించారు. రోజా భర్త గల్ఫ్‌లో ఉంటున్నాడు. ఆమెకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. సూళ్లూరుపేటలో ఏఎన్ఎంగా రోజా శిక్షణ పొందుతున్నట్లు తెలిపారు. మార్గాన రమేష్ బాబుకు రోజాకు మధ్యలో ఉన్న తగవలు అందుకు సంబంధించిన పరిచయాలపై పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. రోజా మృతదేహం వద్ద కుటుంబ సభ్యులు తీవ్రంగా రోధించడం అందరినీ కలచి వేసింది. రోజాను హత్య చేసిన తరువాత హంతకుడు పొలాల్లోంచి పారిపోయినట్లు సమాచారం. హంతకుడిని పట్టుకునేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని డిఎస్పీ ఎం.సుధాకర్ రావు తెలిపారు.

# నీట్ విద్యార్థుల కోసం ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లో ఆగిన ప్రధాని మోడీ

## పరీక్ష సమయం దాటిన తర్వాతే నివాసానికి పయనం



**న్యూఢిల్లీ, జూన్ 21:** ప్రధాని నరేంద్ర మోడీ విద్యార్థుల పట్ల తనకున్న ప్రత్యేక శ్రద్ధను మరోసారి చాటుకున్నారు. నీట్ యూజీ 2026 రీఎగ్జామ్ రాసే విద్యార్థులకు ట్రాఫిక్ ఇబ్బందులు కలగకూడదనే ఉద్దేశంతో, ఆయన ఢిల్లీ విమానాశ్రయంలోనే దాదాపు గంటసేపు వేచి ఉన్నారు. ఈ సంఘటన ఆయన మానవతా దృక్పథాన్ని తెలియజేస్తోందని పలువురు ప్రశంసిస్తున్నారు. 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా కోల్‌కతాలో జరిగిన ప్రధాన కార్యక్రమంలో పాల్గొన్న ప్రధాని మోడీ, ఆదివారం మధ్యాహ్నం 1:15 గంటలకు ఢిల్లీ విమానాశ్రయానికి చేరుకున్నారు. ఆయన ఢిల్లీ ఎయిర్ పోర్ట్‌కు చేరుకునేసరికి మధ్యాహ్నం 1.15 గంటలైంది. ఆయన వెంటనే అక్కడి నుంచి వెళ్లిపోవచ్చు. ప్రధాని కాబట్టి, ఎయిర్‌పోర్ట్ నుంచి త్వరగా బయటకు వచ్చి, తన అధికారిక నివాసానికి వెళ్లొచ్చు. ఇందుకోసం ట్రాఫిక్ కూడా క్లియర్ చేస్తారు.

ఆయన ప్రయాణానికి ఎటువంటి ఆంక్షలు ఉండవు. అయినప్పటికీ మోదీ అక్కడే ఉండిపోయారు. అది కూడా 45 నిమిషాలు. 1.15 గంటల నుంచి మధ్యాహ్నం 2.00 గంటల వరకు మోదీ ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లోనే ఉన్నారు. 2.00 గంటల తర్వాతే అక్కడి నుంచి బయల్దేరి తన అధికారిక నివాసానికి వెళ్లారు. ప్రధాని అలా 45 నిమిషాలపాటు ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లోనే ఉండిపోవడానికి కారణం నీట్ పరీక్ష. ఆదివారం మధ్యాహ్నం దేశవ్యాప్తంగా నీట్ పరీక్ష జరిగిన సంగతి తెలిసిందే. ఢిల్లీలో కూడా చాలా సెంటర్లలో ఈ పరీక్ష జరుగుతోంది. అసలే ఇది చాలా ముఖ్యమైన పరీక్ష. పైగా ఒక్క నిమిషం ఆలస్యమైనా లోపలికి అనుమతించరు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రధాని మోదీ ఎయిర్‌పోర్ట్ నుంచి 1.15 గంటలకు బయటకు వస్తే.. తనకోసం ట్రాఫిక్ ఆపడం, సెక్యూరిటీ వంటి వాటి వల్ల ఇతరులకు ఇబ్బంది కలగవచ్చు. అందులో పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు కూడా ఉండొచ్చు. తను వెళ్లడం వల్ల నీట్ అభ్యర్థులకు ఇబ్బంది కలగకూడదనే ఉద్దేశంతో ప్రధాని ఎయిర్‌పోర్ట్‌లోనే ఉండిపోయారు. పరీక్ష ప్రారంభమైన 2.00 గంటల తర్వాత మోదీ ఎయిర్‌పోర్ట్ నుంచి తన నివాసానికి వెళ్లిపోయారు. విద్యార్థులకు ఇబ్బంది కలగకూడదని మోడీ ఆలోచించి నిర్ణయం తీసుకోవడం మంచి పరిణామంగా పలువురు చెబుతున్నారు.

# డ్రగ్స్ మహమ్మారిని తరిమికొడదాం

## యువత దృష్టి అభివృద్ధి, సంక్షేమంపై పడాలి..

### దేశ భవితను నిర్ణయించే శక్తి వారిదే

### తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో డైరెక్టర్ సందీప్ శాండిల్య, 'వార్త' సిఎండి డా.గిరీష్‌కుమార్‌సంఘీ పిలుపు



సమావేశంలో ప్రతిజ్ఞ చేస్తున్న తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో డైరెక్టర్ సందీప్ శాండిల్య, 'వార్త' సిఎండి డా.గిరీష్‌కుమార్ సంఘీ. చిత్రంలో ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు, నరేంద్రకుమార్‌గోయల్, రామ్‌నివాస్ బన్సల్ తదితరులు

**హైదరాబాద్ (సైఫాబాద్), జూన్ 21, ప్రభాతవార్త:** మానవజాతి మనుగడకు అత్యంత ప్రమాదకరంగా మారిన, యువతను పట్టిపీడిస్తున్న డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టేందుకు ప్రతి ఒక్కరూ కంకణబద్ధులై ఉండాలని 'వార్త' జాతీయ తెలుగు దినపత్రిక సిఎండి, రాజ్యసభ మాజీ సభ్యుడు డా. గిరీష్ కుమార్ సంఘీ, తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో డైరెక్టర్ సందీప్‌శాండిల్య పిలుపునిచ్చారు. దేశ భవిష్యత్తును నిర్ణయించే కీలకశక్తి నేటి యువతరానిదేనని, మాదక ద్రవ్యాలపై దృష్టిని మళ్లించకుండా దేశభక్తి, జ్ఞానం, అభివృద్ధి, సంక్షేమంపై శ్రద్ధ చూపించాలని వారు సూచించారు. తెలంగాణ అగర్వాల్ సమాజ్ ఆధ్వర్యంలో ఆదివారం బిర్లా ఆడిటోరియంలో 'డ్రగ్స్‌ఫ్రీ- యంగ్ ఇండియా' లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం, ఈగల్ ఫోర్స్ సహకారంతో 'శపథ్' పేరుతో యువతకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వారు ముఖ్యఅతిధులుగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వారితోపాటు పాల్గొన ్న రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ సలహాదారు వి.హనుమంతరావు, ఈగల్స్ ఫోర్స్ డిప్యూటీ డైరెక్టర్ కృష్ణమూర్తిగుప్తా, 'శపథ్' నిర్వహణ కమిటీ అధ్య క్షుడు రామ్‌నివాస్‌బన్సల్ ప్రాజెక్టు డైరెక్టర్ దేవేంద్రశాస్త్రి, శపథ్ పబ్లిక్ రిలేషన్స్ డైరెక్టర్ సునీల్ అగర్వాల్, సలహాదారులు రాజీవ్‌అగర్వాల్, విశాల్ కేడియా, ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ అనిల్‌సింగ్, ప్యాట్రన్లు నరేంద్రగోయల్, పిసిసి మైనారిటీ లింగ్విస్టిక్ సెల్ అధ్యక్షుడు రాజేష్‌అగర్వాల్, యువత డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రోజురోజుకు పెరిగిపోతున్న డ్రగ్స్ వినియోగం ఆందోళనకరంగా ఉందని, దీన్ని రూపు మాపేందుకు అన్నివర్గాల ప్రజలు కలిసికట్టుగా పోరాడాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో 4కోట్ల మంది జనాభాలో గుట్కా, సిగరెట్లు, మద్యం మినహాయించి కేవలం డ్రగ్స్‌కు బానిసలైన వారే 50 లక్షల మంది ఉన్నారని సందీప్ శాండిల్య ఆవేదన వ్యక్తం చేశారు. యాంటీనార్కోటిక్స్ బ్యూరోలో కేవలం వందమంది సిబ్బంది మాత్రమే ఉన్నారని, ఇంతపెద్ద మొత్తంలో ఉన్న వ్యసన పరులను పర్యవేక్షించడం కేవలం పోలీసుల వల్లే సాధ్యం కాదన్నారు. యువత డ్రగ్స్ బారిన పడకుండా తల్లిదండ్రులు, స్నేహితులు కూడా బాధ్యత తీసుకోవాలన్నారు. వి. హనుమంతరావు మాట్లాడుతూ కేన్స ర్ కంటే ప్రమాదకరంగా మారిన డ్రగ్స్ భూతాన్ని తరిమికొట్టడానికి పోలీస్ శాఖ సరిపోదని, యావత్ సమాజం బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు.

# నేటితో ముగియనున్న టెట్-2026 పరీక్షలు

## 16 జిల్లాల్లో 61 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు

**హైదరాబాద్, జూన్ 21, ప్రభాతవార్త:** రాష్ట్రంలో టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్(టెట్)-2026 పరీక్షలు నేటి(సోమవారం)తో ముగియనున్నాయి. ఈ నెల 16 నుంచి ప్రారంభమైన పరీక్షలు గత నాలుగు రోజులుగా కొనసాగుతున్నాయి. నేటితో టిజి టెట్-2026 పరీక్షలు ముగియనున్నాయి. పరీక్షల కోసం రాష్ట్ర వ్యాప్తంగా 1,53,752 దరఖాస్తులు వచ్చాయి. వాటిలో పేపర్-1కి 50,113 రాగా, పేపర్-2కి 1,03,639 వచ్చాయి. పరీక్షల నిర్వహణ కోసం 16 జిల్లాల్లో 61 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షలను ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తున్నారు. పరీక్షలను 5 రోజులపాటు 10 సెషన్‌లలో నిర్వ హించారు. పరీక్షలను రెండు సెషన్‌లలో నిర్వహిస్తున్నారు. ఉదయం సెషన్‌ను 9 గంటల నుంచి 11.30 గంటల వరకు, మధ్యాహ్నం సెషన్‌ను 2 గంటల నుంచి సాయంత్రం 4.30గంటల వరకు నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా 1,53,752 దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తు చేసుకున్న వారిలో ఇన్‌సర్వీస్ టీచర్ల నుంచి 28,149 దరఖాస్తులు వచ్చాయి. 5 దరఖాస్తులు ట్రాన్స్‌జెండర్ల నుంచి వచ్చాయి.

# లోక్‌అదాలత్ ద్వారా సైబర్ బాధితులకు రూ.45.21 కోట్లు అందజేత

**హైదరాబాద్, జూన్ 21, ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా శనివారం నిర్వహించిన మెగా లోక్ అదాలత్‌లో భాగంగా రాష్ట్రంలో సైబర్ నేరాల వల్ల డబ్బులు పోగొట్టుకున్న బాధితులకు సైబర్ సెక్యూరిటీ బ్యూరో చేయూతనందించింది. మొత్తం మీద రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలలో 6303 బాధితులకు 45.21 కోట్ల రూపాయలను సైబర్ సెక్యూరిటీ బ్యూరో అందజేసినట్లు ఈ విభాగం డైరెక్టర్ శిఖా గోయల్ మీడియాకు తెలిపారు. ఇందులో సైబరాబాద్‌కు సంబంధించి 2232 మంది బాధితులకు 21.91 కోట్ల రూపాయలు, సైబర్ సెక్యూరిటీ బ్యూరో ప్రధాన కార్యాలయం లో నమోదైన కేసులకు సంబంధించి 77 మంది బాధితులకు 6.83 కోట్ల రూపాయలు, మల్కాజిగిరి కమిషనరేట్‌లో 779 మంది బాధితులకు 4.04 కోట్ల రూపాయలు, హైదరాబాద్ పరిధిలో 755 మంది బాధితులకు 3.22 కోట్ల రూపాయలు, సంగారెడ్డి జిల్లాలో 107 మంది బాధితు లకు 1.69 కోట్ల రూపాయలు అందజేసినట్లు శిఖా గోయల్ తెలిపారు. రాష్ట్రంలో సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఏర్పాటయ్యాక ఇప్పటి వరకు 59, 953 మంది బాధితులకు 445.41 కోట్ల రూపాయలను అందజేసినట్లు ఆమె తెలిపారు. ఇందులో 2023లో 8.36 కోట్ల రూపాయలు, 2024లో 183.9 కోట్ల రూపాయలు, 2025లో 182.9 కోట్ల రూపాయలు, 2026లో ఇప్పటి వరకు 70.07 కోట్ల రూపాయలు అందజేసిన ట్లు శిఖా గోయల్ తెలిపారు.

సైబర్ నేరాల పట్ల అన్నివర్గాల వారు నిరంతరం అప్రమత్తంగా వుండాలని ఆమె కోరారు. అపరిచితులు చేసే ఫో న్‌లకు స్పందించవద్దని, ఓటిపిలను పట్టించుకోవద్దని ఆమె కోరారు. ఒకవేళ బాధితులుగా మారితే వెంటనే 1930కి ఫోన్ చేయాలని ఆమె కో రారు.



# ఎలక్ట్రిక్ బస్సులో మంటలు

## తప్పిన ఘోరప్రమాదం.. 42 మంది సురక్షితం

**తిమ్మాపూర్, ప్రభాతవార్త:** కరీంనగర్ జిల్లా నుంచి హైదరాబాద్ వెళ్తున్న సూపర్‌లగ్జరీ బస్సులో అకస్మాత్‌గా మంటలు, దట్టమైన పొగ వ్యాపించిన ఘటన కరీంనర్ కార్పొరేషన్ అలుగునూర్ కాకతీయ కెనాల్ రాజీవ్ రహదారిపై ఆదివారం ఉదయం చోటుచేసుకుంది. ప్రయాణికులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్-2 డిపోకు చెందిన సూపర్‌లగ్జరీ ఎలక్ట్రిక్ బస్సు ఉద యం కరీంనగర్ బస్టాండ్ నుంచి హైదరాబాద్‌కు ప్రయాణికులతో బయలు దేరింది. నాలుగు కిలోమీటర్ల మేరకు ప్రయాణం చేసిన తరవాత అలుగునూర్ శివారులోని కాకతీయ కేనాల్ వద్దకు రాగానే బస్సులో ఆకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. దట్టమైన పొగ రావడంతో ప్రయాణికులు భయాందోళనకు గుర య్యారు. అప్రమత్తమైన డ్రైవర్ వెంటనే ప్రయాణికులను కిందికి దింపి వేయడంతో ప్రాణాపాయం తప్పింది. మంటలు క్షణాల్లో బస్సు మొత్తం వ్యా పించడంతో డ్రైవర్, కండక్టర్లు ఉన్నతాధికారులకు, ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే స్పందించిన ఫైర్ సిబ్బంది మంటలు అర్పే ప్రయత్నం చేశారు. అప్పటికే బస్సు మంటల్లో చిక్కుకొని పూర్తిగా దగ్ధమయింది. బస్సులో ఆకస్మాత్తుగా మంటలు ఎలా వ్యాపించాయో తెలియాల్సి ఉంది.

# టిజి-20 లీగ్ క్రికెట్‌కు ప్రభుత్వ సహకారం

## డిప్యూటీసిఎం భట్టి విక్రమార్క



ఉప్పల్ స్టేడియంలో జరుగుతున్న టిజి- 20 క్రికెట్ లీగ్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క తదితరులు

**హైదరాబాద్ (ఉప్పల్), జూన్ 21, ప్రభాతవార్త :** గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు టీజీ 20 క్రికెట్ లీగ్ మంచి కార్యక్రమమని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ప్రభుత్వం నుంచి దీనికి పూర్తి సహకారం ఉంటుందని ఆయన చెప్పారు. ఆదివారం ఉప్పల్ స్టేడియంలో టీజీ -20 లీగ్ ఆరంభ వేడుకలకు భట్టి విక్రమార్క, ప్రముఖ సినీనటుడు, లీగ్ బ్రాండ్ అంబాసిడర్ విజయ్ దేవరకొండ ముఖ్య అతిధులుగా హాజరైయ్యారు. ఈ సందర్భంగా డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ నైపుణ్యం కలిగిన గ్రామీణ యువకులకు ఇదొక మంచి అవకాశమని, ప్రతి ఒక్కరూ క్రీడాస్ఫూర్తితో ముందుకెళ్లాలని సూచించారు. క్రీడలకు సీఎం రేవంత్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని తెలిపారు. ప్రపంచస్థాయి స్పోర్ట్స్ వర్సిటీని తీసుకురాబోతున్నామని ఆయన స్పష్టం చేశారు. సినీ నటుడు విజయ్ దేవరకొండ మాట్లాడుతూ టీజీ - 20 లీగ్ భాగస్వామ్యం కావడం సంతోషంగా ఉందన్నారు. గతంలో అంతర్జాతీయ క్రికెట్‌లో హైదరాబాద్ నుంచి తక్కువ మంది ఉండేవాళ్లని, హైదరాబాద్ నుంచి వెళ్లిన వీవీఎస్ లక్ష్మణ్‌ను చూసి గర్వపడేవాళ్లమని పేర్కొన్నారు. నగరంలో ఇలాంటి లీగ్ జరగడం వల్ల ఎంతో మందికి అవకాశాలు వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో లీగ్ మ్యాచ్‌లో పాల్గొనే అన్ని జట్ల కెప్టెన్లు ప్రారంభోత్సవానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా సంగీత దర్శకుడు తమన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో వివిధ జట్ల క్రీడాకారులు పాల్గొన్నారు.

### అట్టహాసంగా టిజి 20 లీగ్ ప్రారంభోత్సవం

హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియంలో టీజీ 20 లీగ్ అట్టహాసంగా ప్రారంభం అయ్యింది. రాత్రి 7.15 గం.కు పాలమూరు, ఖమ్మం జట్ల మధ్య తొలి మ్యాచ్ జరిగింది. ఈనెల 23న పాలమూరు స్ట్రైకర్స్‌తో హైదరాబాద్ ఈ ఛాంపియన్స్ తొలి మ్యాచ్ ఆడనున్నారు. టీజీ 20 లీగ్ ప్రారంభోత్సవం సందర్భంగా ఆదివారం సాయంత్రం ఉప్పల్ స్టేడియంలో సంగీత దర్శకుడు తమన్ ప్రత్యేక ప్రదర్శన, లేజర్ షో నిర్వహించారు. టీజీ20 బ్రాండ్ అంబాసిడర్ విజయ్ దేవరకొండ లాంఛనంగా ప్రారంభించారు. మ్యాచ్ కోసం 150మంది పోలీసులతో భద్రత కల్పించారు. అదనంగా 30 ట్రాఫిక్ పోలీసులను కేటాయించారు. ఇవాల్టి నుంచి జులై 12 వరకు టీజీ 20 క్రికెట్ లీగ్ మ్యాచ్‌లు ఉప్పల్‌లో జరగనున్నాయి. టీజీ 20 లీగ్ తొలి సీజన్లో లో ఎనిమిది జట్లు పోటీపడుతున్నాయి. మ్యాచ్ చూసేందుకు రూ.49 టిక్కెట్ ధర నిర్ణయించారు.

### టిజి లీగ్ బరిలో ఎనిమిది జట్లు

టీజీ - టి 20 లీగ్ బరిలో మొత్తం ఎనిమిది జట్లు నిలిచాయి. హైదరాబాద్ ఛాంపియన్స్, కరీంనగర్ డైమండ్స్, ఖమ్మం ఏసెస్, పాలమూరు స్ట్రైకర్స్, మెదక్ ఫాల్కన్స్, వరంగల్ వారియర్స్. రంగారెడ్డి రైజర్స్, నల్గొండ నైట్స్ టీమ్‌లు తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నాయి. ఈ టీమ్‌లకు కెప్టెన్‌లుగా అభిరదజ్ రెడ్డి, తన్మయ్ అగర్వాల్, సీవీ మిలింద్, ప్రజయ్ రెడ్డి, రవితేజ, అమన్ రావు, తనయ్ త్యాగరాజన్, రాహుల్ బుద్ధి వ్యవరిస్తారు. ముందుగా బిడ్ ద్వారా ఎనిమిది మంది ఫ్రాంచైజీలను ఎంపిక చేయగా, ఆ తర్వాత వేలం ద్వారా టీమ్ ఆట గాళ్లను ఎంచుకున్నాయి. ఒక్కో టీమ్‌లో 20 మంది ఆటగాళ్ల చొప్పున మొత్తం 160 మంది ప్లేయర్లకు అవకాశం కల్పించారు.

# ప్రముఖ సినీనిర్మాత, రాజకీయ నేత గొట్టిముక్కల పద్మారావు కన్నుమూత

**హైదరాబాద్ (కెపిహెచ్‌బి కాలనీ), జూన్ 21, ప్రభాతవార్త :** ప్రముఖ సినీ నిర్మాత కూకట్‌పల్లికి చెందిన సీనియర్ నేత గొట్టిముక్కల పద్మారావు అనారోగ్యంతో మృతి చెందారు. కూకట్‌పల్లిలోని వివేకానందనగర్‌లో గల వారి నివాసంలో ఆదివారం తెల్లవారుజామున 5 గంటలకు తుదిశ్వాస విడిచారు. ఆయనకు



గొట్టిముక్కల పద్మారావు (ఫైల్)

ముగ్గురు కుమార్తెలు. పెద్ద కూతురు గగనం అనే సినిమాకు దర్శ కత్వం వహించారు. పద్మారావు మృతి పట్ల సినీప్రముఖులతోపాటు రాజకీయ ప్రముఖులు సైతం సంతాపం వ్యక్తం చేశారు. పద్మారావు 1954 నవంబర్ 8న జన్మించారు. పద్మప్రియ ఆర్ట్స్ బ్యానర్‌పై ఆయన పలు తెలుగు సినిమాలు నిర్మించి సత్తాను చాటా రు. సినిమాలతోపాటు రాజకీయాలపై మక్కువ పెంచుకున్న పద్మారావు యువకుడిగా ఉన్నప్పుడు 1970లో తెలంగాణ తొలి ఉద్యమంలో పాల్గొని జైలుకు కూడా వెళ్లారు. మలిదశ ఉద్యమంలో కూడా కూకట్‌పల్లిలో తనదైన పాత్రతో కీలకంగా వ్యవహరిం చారు. ఆదివారం మధ్యాహ్నం ఒంటిగంటకు కూకట్‌పల్లి వెంకటరావునగర్ కాలనీలో గల స్మశాన వాటికలో గొట్టిముక్కల పద్మారావు అంతిమయాత్ర అనంతరం అంత్యక్రియలు జరిగాయి.

# ఒకే కుటుంబంపై మృత్యువు పంజా

## మాదారం ప్రమాదంలో ముగ్గురు దుర్మరణం

### మరొకరికి తీవ్రగాయాలు

**ములకలపల్లి, జూన్ 21, ప్రభాతవార్త :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండల పరిధిలోని మాదారం గ్రామ శివారు అడవి ప్రాంతంలో ఆదివారం మధ్యాహ్నం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. కారు అదుపుతప్పి చెట్టును ఢీకొనడంతో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందగా, మరో మహిళ తీవ్రంగా గాయపడింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం భద్రాచలం పట్టణంలోని వెంకటేశ్వర కాలనీకి చెందిన దూడల సాయి ప్రకాష్ తన కుటుంబ సభ్యులతో కలిసి ములకలపల్లిలోని బంధువుల ఇంటికి వచ్చారు. బంధువులను కలుసుకున్న అనంతరం తిరిగి భద్రాచలం వెళ్తుండగా ఈ విషాద ఘటన జరిగింది. మాదారం అడవి ప్రాంతంలో కారు అతివేగంగా వెళ్తూ అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న పెద్ద చెట్టును బలంగా ఢీకొట్టింది. ప్రమాదం తీవ్రతకు కారు నడుపుతున్న దూడల సాయి ప్రకాష్(26), ఆయన భార్య దూడల సంధ్య,(24) కుమారుడు దూడల మోక్షి త్ (2) తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ప్రమాదంలో సాయి ప్రకాష్ తల్లి దూడల జ్యోతి తీవ్రంగా గాయపడగా, స్థానికులు వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమెకు వైద్యులు చికిత్స అందిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాలను స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# జనసేనపై ఏదైనా మాట్లాడేటప్పుడు ఆలోచించి స్పందించాలి

## జగదీశ్‌రెడ్డి వ్యాఖ్యలకు పార్టీ తెలంగాణ ఇన్‌ఛార్జి శంకర్‌గౌడ్

**హైదరాబాద్, జూన్ 21, ప్రభాతవార్త:** తమ పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ గురించి మాట్లాడేటప్పుడు ఆలోచించి మాట్లాడాలని మాజీ మంత్రి జగదీష్ రెడ్డికి తెలంగాణ జనసేన ఇన్‌చార్జ్ నేమూరి శంకర్ గౌడ్ సూచించారు. ఇటువంటి మాటలు మాట్లాడితే తాము ఊరుకునేది లేదని ఖబడ్దార్ అని హెచ్చరించారు. తమది జాతీయ పార్టీ అని ఇద్దరు లోక్‌సభ సభ్యులు, ఒక రాజ్యసభ సభ్యుడితోపాటు 21 మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎమ్మెల్సీలు ఉన్నారని తెలిపారు. ఐటెం సాంగ్ అనే మాటలు మాట్లాడేటపుడు ఆలోచించుకొని మాట్లాడాలన్నారు. మీరు మాజీమంత్రి అని రాబోయే ఎన్నికల్లో సైతం మీరు గెలిచే పరిస్థితి లేదన్నారు. తెలంగాణలోని యువత, రైతులు తమ పార్టీ వైపు చూస్తున్నారని అన్నారు. తమ పార్టీ అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను చూసి మీరు భయపడుతున్నారు కాబట్టే ఆయన గురించి మాట్లాడుతున్నారని అన్నారు.

# సింగరేణిలో పకడ్బందీగా బొగ్గు రవాణా

## ప్రతి టన్ను బొగ్గుపై పటిష్ట పర్యవేక్షణ.. సంస్థ సిఎండి బుద్ధప్రకాష్

**హైదరాబాద్, జూన్ 21, ప్రభాతవార్త :** సింగరేణి సంస్థలో బొగ్గు ఉత్పత్తి, నిల్వలు, రవాణా, విక్రయాలకు సంబంధించిన అన్ని ప్రక్రియలు అత్యంత పారదర్శకంగా, ఆధునిక సాంకేతిక వ్యవస్థల పర్యవేక్షణలో జరుగుతున్నాయని సంస్థ సిఎండి డాక్టర్ బుద్ధ ప్రకాష్ స్పష్టం చేశారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటనలో సింగరేణిలో అమలులో ఉన్న బొగ్గు రవాణా, భద్రతా వ్యవస్థలు, సాంకేతిక పర్యవేక్షణ విధానాలు పగడ్బందీగా జరుగుతున్నాయనానరు. గనుల్లో బొగ్గు ఉత్పత్తి అయిన క్షణం నుంచి వినియోగదారుడి వద్దకు చేరే వరకు ప్రతి దశ డిజిటల్‌గా నమోదవుతోందని చెప్పారు. బొగ్గులో సుమారు 85 శాతం రైల్వే మార్గం ద్వారా, మిగిలిన 15 శాతం రోడ్డు మార్గం ద్వారా సరఫరా చేస్తున్నట్లు వివరించారు. బొగ్గు కేటాయింపులు సిస్టమ్స్, అప్లికేషన్స్, ప్రొడక్ట్స్ ఇన్ డేటా ప్రాసెసింగ్ (ఎస్‌ఎపి) ఆధారిత సమగ్ర వ్యవస్థ ద్వారా జరుగుతున్నాయని తేల్చిచెప్పారు. వినియోగదారుడు, గని, పరిమాణం, సరఫరా తేదీ తదితర వివరాలు ముందుగానే డిజిటల్‌గా నమోదవుతాయన్నారు. ప్రతి టన్ను బొగ్గుకు సంబంధించిన సమాచారం కోల్ నెట్, ఎస్‌ఎపి, ఇతర ఆన్‌లైన్ వ్యవస్థల ద్వారా నిరంతర పర్యవేక్షణ ఉంటుందని వెల్లడించారు. రోడ్డు మార్గంలో బొగ్గు రవాణా చేసే ప్రతి వాహనం ఎలక్ట్రానిక్ వెయిబ్రిడ్జ్‌ల వద్ద తూకం వేయడం జరుగుతుందని పేర్కొన్నారు. రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్ ఆధారిత బూమ్ బ్యారియర్లు, జీపీఎస్, జీపీఆర్‌ఎస్ ట్రాకింగ్, జియోఫెన్సింగ్ వ్యవస్థల ద్వారా వాహనాల కదలికలపై రియల్ టైమ్ లో పర్యవేక్షణ కొనసాగుతోందని స్పష్టం చేశారు. రైల్వే మార్గంలో కూడా ప్రతి వ్యాగన్ లోడింగ్, డిస్పాచ్ వివరాలు డిజిటల్‌గా నమోదవుతున్నాయని సింగరేణి ప్లానింగ్ విభాగం ఉన్నతాధికారులు పేర్కొన్నారు. గనులు, కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్లులు, వెయిబ్రిడ్జ్‌లు, రైల్వే సైడింగ్‌లు, స్టాక్ యార్డులు, ఎంట్రీ ఎగ్జిట్ పాయింట్ల వద్ద సీసీ కెమెరాలు, రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్ (ఆర్‌ఎఫ్‌ఐడీ) వ్యవస్థలు, చెక్‌పోస్టులు, ఫ్లయింగ్ స్క్వాడ్లు, భద్రతా సిబ్బంది 24 గంటలూ పర్యవేక్షణ నిర్వహిస్తున్నట్లు బొగ్గు రవాణా విభాగం ఉన్నతాధికారులు స్పష్టం చేశారు. అలాగే ఆకస్మిక తనిఖీలు, ప్రత్యేక గస్తీలు నిరంతరం కొనసాగుతున్నాయన్నారు. ఇంత పకడ్బందీగా ఆర్‌ఎఫ్‌ఐడీ, జిపిఎస్, సిసిటివి, కోల్ నెట్, ఎలక్ట్రానిక్ వెయిబ్రిడ్జ్‌లు, సింగరేణి సెక్యూరిటీ, ఫ్లయింగ్ స్క్వాడ్లు, హోలోగ్రామ్ చలానాలు, టాస్క్‌ఫోర్స్ పర్యవేక్షణ వంటి బహుళస్థాయి భద్రతా వ్యవస్థల మధ్య జరుగుతున్న ఉత్పత్తి, రవాణా ప్రక్రియలో బొగ్గు చోరీకి గురికావడం, కనిపించకపోవడం వంటి ప్రచారం అవాస్తవమని సింగరేణి యాజమాన్యం పేర్కొంది.

# మామిడి రైతులకు ఇ రేడియేషన్ కేంద్రం

## రూ.24 కోట్ల వ్యయంతో ఏర్పాటు

### టెంక పురుగు సమస్యకు కేంద్ర, ఉద్యాన శాఖ చెక్

**హైదరాబాద్, జూన్ 21, ప్రభాతవార్త:** రాష్ట్రంలో మామిడి సాగు చేసే రైతులకు ఎదురైన ప్రధాన సమస్యల్లో ఒకటైన టెంక పురుగు సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుంది. రాష్ట్ర ఉద్యానశాఖ, కేంద్ర ప్రభుత్వం సంయుక్తంగా మల్కాజ్‌గిరి జిల్లా శామీర్‌పేటలో అత్యాధునిక ఇరేడియేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. ఈ ప్రాజెక్టుకు సుమారు రూ.24 కోట్లు ఖర్చు చేయనున్నారు. ఈ కేంద్రం పని ప్రారంభమైతే మామిడి పండ్ల ఎగుమతులు మరింత సులభమవడంతో పాటు, రైతుల ఆదాయం కూడా పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. కాగా మామిడి సాగు రైతులు ప్రతి సీజన్‌లో ఎదుర్కొంటున్న టెంక పురుగు సమస్య వల్ల పండ్ల నాణ్యత దెబ్బతిని, ఎగుమతి మార్కెట్లలో తీవ్ర నష్టాలు ఎదుర్కొంటున్నారు. తెలంగాణలో సగటున సంవత్సరానికి 3 లక్షల టన్నుల మామిడి ఉత్పత్తి అవుతుంది. అయితే దాదాపు 20 శాతం పండ్లు ఈ పురుగు బారిన పడుతున్నాయి. దీంతో రైతులు ఆశించిన ధరలు రాకపోగా, పండ్లు కుళ్లిపోయి పెద్ద మొత్తంలో నష్టపోతున్నారు. ఈ సమస్య జపాన్ వంటి దేశాలకు ఎగుమతులను కూడా ప్రభావితం చేసింది.

# నీట్ యుజి-2026 స్టేట్ కంట్రోల్‌రూమ్‌ను పరిశీలించిన మంత్రి దామోదర రాజనర్సింహ

**హైదరాబాద్, జూన్ 21, ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా ఆదివారం నీట్ యుజీ-2026 రీఎగ్జామ్ జరిగింది. ఈ నేపథ్యంలో నీట్ యుజి- 2026 స్టేట్ కంట్రోల్ రూమ్‌ను వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పరిశీలించారు. హైదరాబాదులోని ఇంటర్మీడియట్ డైరెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నీట్ యుజి- 2026 పరీక్ష కేంద్రాలతో అనుసంధానం చేసిన సిసి టీవీ సర్వైలెన్స్ కమాండ్ కంట్రోల్ రూమ్‌ను వైద్య, ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జెడ్ చొంగ్తుతో కలిసి పరిశీలించారు. నీట్ పరీక్షను సమర్థవంతంగా నిర్వహించేందుకు రాష్ట్ర ఇంటర్మీడియట్ బోర్డు కార్యాల యంలో ప్రభుత్వం, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టిఏ) సంయుక్త ఆధ్వర్యంలో అధికారులు పరీక్షా కేంద్రాలకు అనుసంధానం చేసిన నీట్ యుజి స్టేట్ కంట్రోల్ రూమ్‌ను మంత్రి దామోదర్ రాజనర్సింహ పరిశీలించారు. నీట్ పరీక్ష కోసం తీసుకున్న ఏర్పాట్లపై స్టేట్ కంట్రోల్ రూమ్ ఇంచార్జి అధికారులు రాష్ట్ర డైరెక్టర్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ నరేంద్ర కుమార్, కేంద్ర విద్యా శాఖ డైరెక్టర్ రవీందర్, డిఐజీ నాయక్‌తో చర్చించారు. నీట్ రీఎగ్జామ్ ఫెయిర్‌గా పారదర్శకంగా జరగాలని ఆదేశించారు. పరీక్ష విజయవంతంపై అధికారులు తీసుకున్న జాగ్రత్తలపై మంత్రి దామోదర్ రాజనర్సింహ సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ... రాష్ట్రంలో 24 జిల్లాలలో 208 పరీక్ష కేంద్రాలలో 73058 మంది విద్యార్థులు నీట్ యుజి- 2026 పరీక్ష కోసం హాజరయ్యారని మంత్రి వెల్లడించారు. నీట్ పరీక్ష కేంద్రాలతో అనుసంధానం చేసిన సీసీటీవీలతో స్టేట్ కంట్రోల్ రూమ్ ద్వారా పరీక్ష కేంద్రాలను నిరంతరం అధికారులు మానిటరింగ్ చేస్తున్నా రన్నారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలవకుండా చేసిన ఏర్పాట్లు సంతృప్తికరంగా ఉన్నాయని మంత్రి పేర్కొన్నారు.



# జెఇఇ తెలంగాణ టాపర్ వివన్ ఎస్.మహేశ్వరిని సత్కరించిన కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 21:** బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదివారం జెఇఇ టాపర్ వివన్ ఎస్. మహేశ్వరిని సత్కరించారు. వివన్ జెఇఇ మెయిన్ పరీక్షలో 100 పర్సంటైల్ సాధించడంతోపాటు, జెఇఇ అడ్వాన్స్‌డ్ పరీక్షలో ఆల్ ఇండియా 61వ ర్యాంకు (ఏఐఆర్ 61) సొంతం చేసుకున్నాడు. జెఇఇ పరీక్షల్లో తెలంగాణ స్టేట్ టాపర్‌గా నిలిచి అసాధారణ విజయం సాధించిన వివన్‌ను కేటీఆర్ ప్రత్యేకంగా అభినందించి, ఘనంగా సత్కరించారు. వివన్ మాట్లాడుతూ, 'విజయం అంటే కేవలం ఫలితాలు మాత్రమే కాదని, క్రమశిక్షణ, నిలకడ, పరిమితులకు మించి ఆలోచించడం అని కెటిఆర్ సార్ మాటలు నాకు గుర్తుచేశాయి' అని అన్నారు.




# విధ్వంసంతో జవాబిచ్చిన వైభవ్

## ట్రై సిరీస్ యువ భారత్ కైవసం

**దంబుల్లా, జూన్ 21:** ఏ జట్ల ముక్కోణపు వన్డే టోర్నీలో భారత్ యువ జట్టు విజేతగా నిలిచింది. ఫైనల్లో శ్రీలంక-ఏ జట్టును చిత్తు చేసింది. తిలక్ వర్మ నేతృత్వంలోని యువ భారత్ ఏకంగా 66 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించి ట్రోఫీ అందుకుంది.

378 పరుగులు భారీ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక-ఏ బ్యాటింగ్‌లో విఫలమైంది. ఆరంభంలోనే యష్ ఠాకూర్.. లంకేయుల టాప్ ఆర్డర్‌ను దెబ్బతీశాడు. ఓపెనర్లు నిరోషన్(25), అవిష్క ఫెర్నాండో(3), నువిందు ఫెర్నాండో(21)ను అవుట్ చేయడంతో శ్రీలంక-ఏ 75 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయింది. ఈ తరుణంలో సమరవిక్రమ (44 బంతుల్లో 52), సహన్ అరచ్చిగే(39),వనుజ సహన్(69 బంతుల్లో 62), విజయకాంత్(39) నిలకడగా రాణించడంతో శ్రీలంక-ఏ స్కోరు 300 పరుగులు దాటింది.రన్ రేట్ ఒత్తిడి పెరగడంతో శ్రీలంక వరుస క్రమంలో వికెట్లు కోల్పోయింది. చివరకు 47.1 ఓవర్లలో 311 పరుగులకు ఆలౌటైంది. స్పిన్నర్ విప్రజ్ నిగమ్ కూడా 3 వికెట్లతో చెలరేగి శ్రీలంక జట్టు పతనాన్ని శాసించాడు. యువ భారత్ బౌలర్లలో యష్ ఠాకూర్, విప్రజ్ నిగమ్ చెరో మూడు వికెట్లు, అనుకుల్ రాయ్ 2 వికెట్లు పడగొట్టారు.

అంతకుముందు టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన భారత్-ఏ జట్టుకు 15 ఏళ్ల యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ(29 బంతుల్లో 94; 10 ఫోర్లు, 8 సిక్స్‌లు) కళ్ళు చెదిరే స్టార్టింగ్ ఇచ్చాడు. లంక బౌలింగ్‌ను చీల్చి చెండాడుతూ ప్రియాన్ష్ ఆర్య(39)తో కలిసి తొలి వికెట్‌కు 9 ఓవర్లలోనే 132 పరుగులు అందించి పటిష్ట పునాది వేశాడు. అయితే నాలుగు పరుగుల తేడాతో వైభవ్, ప్రియాన్ష్ ఆర్య అవుటవడంతో కాస్త తడబడింది.

### తిలక్ కెప్టెన్ ఇన్నింగ్స్..ఆఖర్లో అనుకుల్ మెరుపులు

ఈ దశలో రుతురాజ్ గైక్వాడ్(51 బంతుల్లో 40), కెప్టెన్ తిలక్ వర్మ(90 బంతుల్లో 67) ఇన్నింగ్స్‌ను నిలబెట్టే బాధ్యత తీసుకున్నారు. మరో వికెట్ కోల్పోకుండా భారత్ స్కోరును 200 మార్కు దాటించాడు. రుతురాజ్ అవుటైనా కుమార్ కుషాగ్ర(36)తో కలిసి తిలక్ వర్మ నాలుగో వికెట్‌కు 63 రన్స్ జోడించారు. అర్ధసెంచరీ చేసిన తిలక్, కుషాగ్ర వెంటవెంటనే అవుటైనా స్లాగ్ ఓవర్లలో బ్యాటింగ్‌కు వచ్చిన అనుకుల్ రాయ్ కేవలం 15 బంతుల్లోనే 39 రన్స్‌తో మెరుపులు మెరిపించడంతో భారత్ భారీ స్కోరు సాధించింది. నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 377 పరుగుల భారీ స్కోరు చేసింది.

*వైభవ్ సునామీ ఎలా ఉంటుందో.. ఎలా గాయ్ గత్తర్ చేస్తుందో ప్రతి టోర్నీల్లోనూ కనబడుతూనే ఉంది. ఐపీఎల్‌లోనూ మహామహా అనుకున్న బౌలర్లను నిలబెట్టి సిక్స్‌ల వర్షం కురిపించాడు. అయినా ఇంకా అతన్ని పిల్లా బచ్చాగాడిగానే తలపోశారు లంకేయులు.తెలియక అపుడు కవ్వించి ఇపుడు దెబ్బతిన్నారు. వైభవ్ కూడా తనకు కోపమొస్తే ఆ విధ్వంసం ఎంతలా ఉంటుందో లంక ఆటగాళ్లకు బ్యాట్‌తో రుచి చూపించాడు. పూనకం వచ్చినట్లు వైభవ్ వచ్చిన బంతిని వచ్చినట్లే బాదేస్తుంటే లంక బౌలర్లు చేష్టలుడిగిపోయారు. తొలి బంతితో మొదలైన విధ్వంసం 28వ బంతి వరకూ కొనసాగింది.ఆడుతోంది వన్డేనా టీ20 అన్న భ్రమలో లంకేయులను ముంచితేల్చాడు.*

**దంబుల్లా, జూన్ 21:** భారత్-ఎకు తొలిసారి ఎంపికై ఆడుతున్న వైభవ్.. ఈ ముక్కోణపు ఏ సిరీస్‌లో పెద్దగా ఆడిందేమీ లేదు.లీగ్ స్టేజ్‌లో శ్రీలంకపై 14, 21 పరుగులు.. ఆఫ్ఘానిస్తాన్‌పై 44, 38 పరుగులు... ఇక సూపర్ ఓవర్‌లో వైభవ్ వైఫల్యం చూశాక.... అతన్ని లంకేయులు గేలిచారు. దీంతో వైభవ్ కూడా వారిపైకి దూసుకెళ్లడం.. ఇది అనవసర రాద్దాంతానికి దారితీసింది. తనపై వచ్చిన విమర్శలకు, అనవసరంగా గెలికిన లంక ఆటగాళ్లకు ఒక్క ఇన్నింగ్స్‌తో వైభవ్ దిమ్మతిరిగిపోయే సమాధానమిచ్చాడు. ఎందుకురా అనవసరంగా పెట్టుకున్నాం వీడితో అనేంతలా వైభవ్ రెచ్చిపోయాడు.క్రీజులోకి వచ్చింది మొదలు బాదడమే పనిగా పెట్టుకున్న వైభవ్... తాను ఎదుర్కొన్న తొలి బంతినే బౌండరీగా మలిచాడు. 28 బంతుల వరకు విధ్వంసాన్ని కొనసాగించాడు.

**4,4,4,6,6,0,6,4,4,6,6**

ఈ 11 బంతుల్లో వచ్చిన పరుగులు చూస్తే వైభవ్ విధ్వంసం ఎంతలా కొనసాగిందో ఊహించుకోవచ్చు. తాను ఎదుర్కొన్న 11 బంతుల్లో ఒకే ఒక డాట్ బాల్. మిగతా అన్ని బంతులు ఫోర్లు, సిక్సర్లే. 5 ఫోర్లు, మరో అయిదు సిక్స్‌లతో లిస్ట్-ఏ క్రికెట్‌లో ఫాస్టెస్ట్ ఫిఫ్టీ రికార్డును తన పేరిట లిఖించాడు. వైభవ్ ఆ తర్వాత సెంచరీ వైపు పరిగెత్తాడు. చూస్తుండగానే 90ల్లోకి వచ్చిన వైభవ్ 29 బంతుల్లో 10 ఫోర్లు, 8 సిక్సర్ల సాయంతో 94 పరుగులు చేసి ఔటయ్యాడు. వైభవ్ కాస్త కొంచెం ఓపిక వహించి ఉండుంటే లిస్ట్-ఏ క్రికెట్‌లో ఫాస్టెస్ట్ సెంచరీ రికార్డు కూడా ఖాతాలో చేరేది. అంతర్జాతీయ వన్డే క్రికెట్‌లో ఏబీ డివిలియర్స్ 16 బంతుల్లో ఫాస్టెస్ట్ ఫిఫ్టీ, 31 బంతుల్లో ఫాస్టెస్ట్ సెంచరీ సాధించాడు. ఆ విధంగా చూస్తే ఏబీ ఫాస్టెస్ట్ ఫిఫ్టీ గాల్లో కలిసింది.

వైభవ్ దెబ్బకు లంక పేసర్ షిరాజ్, సముదిత జడుసుకున్నారు. షిరాజ్ ఓవర్లో 4, 6, 6, 6, 4తో 26 రన్స్... సముదిత ఓవర్లో 4, 1, 4, 6, 6, 4తో 25 రన్స్ సాధించాడు. వైభవ్ విధ్వంసంతో భారత్ స్కోరు మూడో ఓవర్లోనే 50 మార్కు, ఆరో ఓవర్లో వంద మార్కు దాటింది. వైభవ్ అవుటయ్యేటప్పటికి భారత్ స్కోరు 8.5 ఓవర్లలో 132 రన్స్. వన్డేను సైతం టీ20లా వైభవ్ దుమ్మురేపుతుంటే మరో ఎండ్‌లో ప్రియాన్ష్ ఆర్యా ప్రేక్షకుడిగా చూస్తుండిపోయాడు. మొత్తం మీద తృటిలో ఫాస్టెస్ట్ సెంచరీ రికార్డు మిస్‌చేసుకున్న వైభవ్ తనను అనవసరంగా గెలికి తప్పు చేసిన లంక ఆటగాళ్లకు బ్యాటింగ్ పవర్ రుచి చూపించడంతో పాటు ప్రతీకారం తీర్చుకున్నాడు. మెన్ ఇన్ బ్లూ సీనియర్ టీమ్ ఎంట్రీకి తనకున్న అర్హతేమిటో చాటిచెప్పాడు.



# ట్రోఫీతో మెరిసిన ఉమెన్ హాకీ

**ఆక్లాండ్, జూన్ 21:**ఎఫ్ఐహెచ్ హాకీ విమెన్స్ నేషన్స్ కప్‌లో అజేయ జైత్రయాత్ర కొనసాగించిన భారత అమ్మాయిలు ట్రోఫీతో మెరిశారు. ఫైనల్లో అతిథ్య న్యూజిలాండ్ జట్టును 2-0 గోల్స్ తేడాతో చిత్తుచేసింది. ట్రోఫీ అందుకోవడంతో పాటు ఈ అద్భుత విజయంతో వచ్చే సీజన్ ఎఫ్ఐహెచ్ హాకీ విమెన్స్ ప్రో లీగ్‌కు అర్హత సాధించింది. గ్రూప్ స్టేజ్‌లో అమెరికాపై 3-2తో, జపాన్‌పై 2-1తో, ఉరుగ్వేపై 3-2తో ఓడించిన భారత్ విమెన్స్.. సెమీఫైనల్లో చిలీపై 6-0 గోల్స్‌తో చిత్తు చేసింది. ఫైనల్లో న్యూజిలాండ్‌ను ఓడించి, రెండోసారి ఈ ప్రతిష్టాత్మక నేషన్స్ కప్‌ను అందుకుంది. ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోకుండా అజేయంగా నిలిచిన హాకీ మహిళల జట్టును ప్రధాని నరేంద్ర మోడీ ప్రశంసించారు.

### ఆరంభం నుంచే ఆధిక్యం

ఫైనల్ మ్యాచ్ ప్రారంభమైన కొద్ది నిమిషాలకే భారత్ మ్యాచ్‌పై పట్టు సాధించింది. ఆట 4వ నిమిషంలోనే నవ్‌నీత్ కౌర్ అద్భుతమైన ఫీల్డ్ గోల్ తో భారత్‌కు 1-0 ఆధిక్యాన్ని అందించింది. ఆ తర్వాత 15వ నిమిషంలో సునేలితా టొప్పో మరో గోల్ చేయడంతో భారత్ ఆధిక్యం 2-0కు చేరుకుంది.సొంత ప్రేక్షకుల మధ్య ఆడిన న్యూజిలాండ్ జట్టు పుంజుకోవడానికి ప్రయత్నించినప్పటికీ, ఇండియన్ డిఫెండర్లు ప్రత్యర్థికి గోల్ చేసేందుకు అవకాశమివ్వలేదు.న్యూజిలాండ్ గోల్స్ అవకాశాలకు భారత గోల్‌కీపర్ అడ్డుగా నిలిచింది.

### ఆ ఇద్దరికి అవార్డులు

ఫైనల్లో ఆల్‌రౌండ్ పర్ఫామెన్స్‌తో అదరగొట్టిన భారత ప్లేయర్ లాల్‌రెమ్‌సియామి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును గెలుచుకుంది. మరోవైపు, 6 గోల్స్‌తో భారత స్టార్ స్ట్రైకర్ దీపిక...అమెరికా ఫార్వర్డ్ యాష్లే సెస్సాతో కలిసి టోర్నీ జాయింట్ హైయెస్ట్ స్కోరర్‌గా నిలిచింది.

# ఇంగ్లండ్‌తో సిరీస్‌కు కోహ్లీ ఇన్, యశస్వీ ఔట్

**ముంబై, జూన్ 21:** ఇంగ్లండ్‌తో మూడు వన్డేల సిరీస్‌కు 15 మంది సభ్యులతో కూడిన భారత జట్టును బీసీసీఐ ప్రకటించింది. అఫ్గాన్‌తో వన్డేలకు గాయం కారణంగా దూరమైన స్టార్ విరాట్ కోహ్లి తిరిగి జట్టులోకి వచ్చాడు. అతడితో పాటు ఏస్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా కూడా పునరాగమనం చేశాడు. విరాట్ కోహ్లిని ఎంపిక చేసినప్పటికి సిరీస్ ఆరంభానికి ముందు తన ఫిట్‌నెస్‌ను నిరూపించుకోవాల్సి ఉంటుంది. ఇక అఫ్గాన్‌తో ఆఖరి వన్డేలో సెంచరీతో సత్తాచాటిన యువ ఓపెనర్ యశస్వి జైశ్వాల్‌కు మాత్రం చోటు దక్కలేదు. తన చివరి మూడు వన్డేలలో రెండు శతకాలు సాధించినప్పటికీ జైస్వాల్‌ను సెలక్టర్లు పక్కన పెట్టారు. మూడు వన్డేల సిరీస్ జూలై 14 నుంచి ప్రారంభం కానుంది. తొలి వన్డే 14న ఎడ్జ్‌బాస్టన్‌లో, ఎండో వన్డే 16న కార్డిఫ్‌లో, మూడో వన్డే 19న లార్డ్స్‌లో జరగనుంది.

**భారత జట్టు:** శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి, శ్రేయస్ అయ్యర్ (వైస్ కెప్టెన్), కేఎల్ రాహుల్, ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), వాషింగ్టన్ సుందర్, అక్షర్ పటేల్, నితీష్ కుమార్ రెడ్డి, కుల్దీప్ యాదవ్, జస్ప్రీత్ బుమ్రా, ప్రసిద్ధ్ కృష్ణ, హర్షిత్ రాణా, అర్షదీప్ సింగ్, గుర్నూర్ బ్రార్

# భారత్ గెలుపును లాక్కెళ్లిన కాప్




**మాంచెస్టర్, జూన్ 21:** మహిళా టీ20 ప్రపంచ కప్‌లో భారత్‌కు తొలి ఓటమి ఎదురైంది. టీమిండియా గెలుపు ఆశలకు మరిజాన్నే కాప్(45 బంతుల్లో 81; 7 ఫోర్లు, 4సిక్స్‌లు) గండి కొట్టింది. ఒంటరిపోరాటంతో సౌతాఫ్రికాకు మరో అయిదు బంతులుండగానే 6వికెట్ల విజయాన్ని అందించింది. భారత్ విమెన్స్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 158 రన్స్ చేయగా, సౌతాఫ్రికా 19.1 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి గెలుపందుకుంది.

తొలి రెండు మ్యాచ్‌ల్లో పాకిస్థాన్, న్యూజిలాండ్‌లపై నెగ్గిన భారత్ విమెన్ టీమ్... ఈ మ్యాచ్‌లోనూ బ్యాటింగ్‌లో రాణించింది. స్మృతి మంధాన(17), షఫాలీ వర్మ(31) తొలి వికెట్‌కు 30 పరుగులు అందించారు. ఆతర్వాత తడబడింది. 83 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. అయితే కెప్టెన్ హర్మన్‌ప్రీత్‌సింగ్ 24 రన్స్,దీప్తి శర్మ 29 రన్స్,రిచా ఘోష్ 15 రన్స్‌తో రాణించడంతో నిర్ణీత 20 ఓవర్లలో 7వికెట్ల నష్టానికి 158 రన్స్ చేయగలిగింది.

159 రన్స్ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన సౌతాఫ్రికా 25 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయి తడబడింది. కడప బిడ్డ శ్రీచరణి ఖాతాలో ఈ రెండు వికెట్లు చేరాయి. అయితే తాజ్‌మిన్ బ్రిట్స్(40), మరిజాన్నే(81) నిలకడగా ఆడుతూ మూడో వికెట్‌కు 97 పరుగులు సాధించి పటిష్ట పరిచారు. చివర్లో ఓ రెండు వికెట్లు వేగంగా కోల్పయినా మరో ఎండ్‌లో మరిజాన్నే బౌండరీ, సిక్స్‌తో మ్యాచ్ ముగించింది. భారత విమెన్ బౌలర్లలో శ్రీచరణి మూడు వికెట్లు తీసింది.




**తెలంగాణ టి20 లీగ్ అట్టహాసంగా ప్రారంభమైంది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మహ్మద్ సిరాజ్, బ్రాండ్ అంబాసిడర్ విజయ్ దేవరకొండ హాజరయ్యారు. మ్యూజిక్ దర్శకుడు తమన్ ప్రత్యేక ప్రదర్శన టోర్నీ ఆరంభ వేడుకల్లో హైలైట్‌గా నిలిచింది. 8 జట్లు, 21 రోజుల పాటు 32 మ్యాచ్‌లు ఆడనున్నాయి. తొలి మ్యాచ్‌లో పాలమూరు స్ట్రయికర్స్‌పై అన్విత ఖమ్మం ఏసెస్ గెలుపొందింది.**

# టాప్ తొమ్మిది కంపెనీల మార్కెట్ క్యాప్




# రూ.2.15 లక్షల కోట్లు పెరుగుదల

**న్యూఢిల్లీ, జూన్ 21:** ప్రపంచ మార్కెట్లలో రిస్క్ సెంటిమెంట్ మెరుగుపడటంతో గత వారం దేశంలోని టాప్10 అత్యంత విలువైన కంపెనీలలో తొమ్మిది సంస్థల సంయుక్త మార్కెట్ విలువ రూ.2.15 లక్షల కోట్లకు పైగా పెరిగింది. ఇందులో భారతి ఎయిర్‌టెల్ అత్యధిక లాభం పొందిన సంస్థగా నిలిచింది.భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు తగ్గడం, ముడి చమురు ధరలు క్షీణించడం, అంతర్జాతీయ మార్కెట్లలో సానుకూల వాతావరణం నెలకొనడం వల్ల భారత ఈక్విటీ మార్కెట్లు కోలుకున్నాయని మార్కెట్ నిపుణులుఅంచనావేసారు.ఆన్‌లైన్ ట్రేడింగ్, వెల్త్ టెక్ సంస్థ ఎన్‌రిచ్ మనీ సీఈఓ పొన్‌ముడి ఆర్ మాట్లాడుతూ, చర్చలు ఇంకా కొనసాగుతున్నప్పటికీ భౌగోళిక రాజకీయ అనిశ్చితి తగ్గడం మార్కెట్ సెంటిమెంట్‌ను గణనీయంగా మెరుగుపరిచిందని పేర్కొన్నారు.

టాప్10 కంపెనీల్లో భారతి ఎయిర్‌టెల్ మార్కెట్ విలువ అత్యధికంగా రూ.52,432.67 కోట్లు పెరిగి రూ.11.63 లక్షల కోట్లకు చేరుకుంది.ఎల్ఐసీ మార్కెట్ విలువ రూ.51,675.23 కోట్లు పెరిగి రూ.5.57 లక్షల కోట్లకు చేరుకుంది.బజాజ్ ఫైనాన్స్ విలువ రూ.26,553.71కోట్లు పెరిగి రూ.5.99 లక్షల కోట్లకు చేరుకోగా, రిలయన్స్ ఇండస్ట్రీస్ మార్కెట్ విలువ రూ.22,464.02 కోట్లు పెరిగి రూ.17.72 లక్షల కోట్లకు చేరింది.అలాగే లార్సెన్ అండ్ టుబ్రో (ఎల్ అండ్ టీ) మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.21,929.12 కోట్లు పెరిగి రూ.5.79 లక్షల కోట్లకు చేరగా, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) విలువ రూ.16,753.57 కోట్లు పెరిగి రూ.9.55 లక్షల కోట్లకు చేరింది.హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మార్కెట్ విలువ రూ.11,948.72 కోట్లు పెరిగి రూ.12.01 లక్షల కోట్లకు చేరగా, హిందుస్థాన్ యూనిలీవర్ విలువ రూ.6,661.10 కోట్లు పెరిగి రూ.5.16 లక్షల కోట్లకు చేరింది.

ఐసీఐసీఐ బ్యాంక్ మార్కెట్ విలువ రూ.4,724.22 కోట్లు పెరిగి రూ.9.66 లక్షల కోట్లకు చేరుకుంది.అయితే, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) మార్కెట్ విలువ మాత్రం రూ.12,699.49 కోట్లు తగ్గి రూ.7.69 లక్షల కోట్లకు పడిపోయింది.

# బలంగా తెలంగాణ ఆర్థిక పునాది

## తగ్గుతున్న అప్పుల భారం
## ప్రపంచ బ్యాంకు నివేదిక

**హైదరాబాద్, జూన్ 21, ప్రభాతవార్త**

తెలంగాణలో ఆర్థిక స్థిరత్వం ఎంతో మెరుగ్గా ఉందని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఫైనాన్స్ అండ్‌పాలసీ(ఎన్ఐపీఎఫ్‌పీ) ప్రపంచ బ్యాంకు నివేదిక తెలిపింది. రుణాలు, హామీలు, ఇతర భారాలు ఆందోళనకరంగా ఉన్నా, ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణకు బలమైన ఆర్థిక సామర్థ్యం ఉందని స్పష్టం చేసింది.ప్రపంచ బ్యాంకుతో కలిసి గత ఏడాది అక్టోబరులో జరిపిన 3వ రాష్ట్రాల ఫోరమ్‌చర్చల ఆధారంగా ఎన్ఐపీఎఫ్‌పీ తాజా నివేదికను విడుదల చేసింది. ఈ నివేదిక ప్రకారం రాష్ట్రాలు ఆర్థికంగా బలంగా, అభివృద్ధి దృక్పథంతో, ఆర్థికంగా స్థిరత్వంతో ఉంటేనే అనుకున్న లక్ష్యాలను సాధించగలమని స్పష్టం చేసింది. బడ్జెట్‌లో పేర్కొన్న అంచనాల కన్నా మించి తెలంగాణ ప్రభుత్వం అధికంగా అప్పులు చేసిందని పేర్కొంది. అయితే, గత మూడేళ్లుగా ఈ అప్పులు తగ్గిపోతుండటం మంచి పరిణామంగా వ్యాఖ్యానించింది. తెలంగాణను తీవ్ర ఒత్తిడి కలిగిన రాష్ట్రాల క్యాటగిరీలో చేర్చలేమని, కానీ రుణానికి సంబంధించిన ముప్పులు తెలంగాణకు కూడా తీవ్రంగా ఉన్నాయని వివరించింది. తెలంగాణలో సామాజిక దృక్పథంతో బడ్జెట్ వ్యూహాలను రూపొందిస్తున్నారని, మౌలిక సదుపాయాల ఆధారిత అభివృద్ధి వ్యూహాలపై కాకుండా సంక్షేమం,ఆరోగ్యం, విద్య, సామాజికాభివృద్ధిపై దృష్టి సారించారని నివేదిక పేర్కొంది. రెవెన్యూ సమీకరణ,ఆరోగ్యకరమైన ఆర్థిక చర్యల మూలంగా తెలంగాణ స్థూలంగా ఆర్థిక ఆరోగ్య సూచికలో అగ్ర స్థానంలో చేరిందని తెలిపింది. ఇందుకు బలమైన పన్ను వసూళ్లు, ఆదాయాన్ని సేకరించగలిగిన మెరుగైన సామర్థ్యం, ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఆర్థిక పునాది బలంగా ఉండడం కారణమని విశ్లేషించింది. ఆర్థిక స్థిరత్వం తెలంగాణలో మెరుగ్గా ఉన్నప్పటికీ, బలంగా లేదని తేల్చింది. రాష్ట్రంలో ఆర్థిక ఆర్థిక స్థిరత్వం 61.9 శాతంగా ఉందని వివరించింది. దీంతో తెలంగాణను దిగువన ఉన్న రాష్ట్రాల జాబితాలో కాకుండా మధ్యశ్రేణి రాష్ట్రాల్లో చేర్చవచ్చని పేర్కొంది. తెలంగాణలో కూడా రెవెన్యూ వసూళ్ల కంటే హామీల భారం కూడా అధికంగా ఉందని, ఇది జీఎస్‌డీపీలో 15 శాతం మేరకు ఉంటుందని వెల్లడించింది. అలాగే రాష్ట్ర ఆర్థిక లోటు జీఎస్‌డీపీలో 3.4 శాతంగా ఉందని పేర్కొంది. తెలంగాణకు ఆర్థిక సౌలభ్యం ఎక్కువే అని, ఖర్చును భరించేందుకు అప్పులు చేయాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది.

# కిసాన్ క్రెడిట్‌కార్డు రుణాల్లో ఆర్బీఐ మార్పులు




**ముంబయి,జూన్ 21:** దేశంలోని రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డ్ పథకం ద్వారా సకాలంలో, ఈజీగా రుణాలు అందించడమే లక్ష్యంగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కొత్త మార్గదర్శకాలను విడుదల చేసింది. లోన్ల మంజూరు, రుణాల తిరిగి చెల్లింపుల కాల పరిమితిలో దేశవ్యాప్తంగా ఒకే విధమైన పారదర్శకత తీసుకురావడానికి పంట కాలాల నిర్వచనాన్ని ఆర్‌బీఐ ప్రామాణీకరించింది. కొత్త రూల్స్ 2027, జనవరి 1వ తేదీ నుంచే అమలులోకి వస్తాయని స్పష్టం చేసింది.బ్యాంకుల ఆదాయ గుర్తింపు, ఆస్తుల వర్గీకరణ రూల్స్‌కి అనుగుణంగా పంట కాలాన్ని రిజర్వ్‌బ్యాంక్ నిర్దేశించింది. స్వల్ప కాలిక పంటల కాలాన్ని గరిష్ఠంగా 12 నెలలుగా, దీర్ఘకాలిక పంట కాలాన్ని గరిష్ఠంగా 18 నెలలుగా ఖరారు చేసింది.

వ్యవసాయం, అనుబంధ కార్యకలాపాలకు ఒక వ్యక్తి తీసుకునే రూ.2 లక్షల లోపు లోన్లకు బ్యాంకులు ఎటువంటి మార్జిన్ మనీ,అదనపు ష్యూరిటీ అడగకూడదు. హామీ లేని లోన్ల పరిమితిలోపు, రైతులు స్వచ్ఛందంగా బంగారం లేదా వెండిని తాకట్టు పెట్టి లోన్ తీసుకుంటే దానిని కొలెటర్ ఫ్రీ రూల్స్ ఉల్లంఘనగా పరిగణించరు. దేశంలోని రైతులకు పెట్టుబడి కష్టాలు తీర్చడం కోసం కేంద్ర ప్రభుత్వం 1998లో ప్రవేశపెట్టిన అద్భుతమైన పథకమే ఈ కిసాన్ క్రెడిట్ కార్డు.రైతులు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేసేందుకు, సాగు ఖర్చుల కోసం వడ్డీ వ్యాపారుల దగ్గరకు వెళ్లి మోసపోకుండా, బ్యాంకుల ద్వారా చాల తక్కువ వడ్డీకే రుణాలుఅందించడం ఈ కార్డు ఉద్దేశం. సాధారణంగా బ్యాంకులు ఇచ్చే రుణాలతో పోలిస్తే కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా ఇచ్చే రుణాలపై వడ్డీ చాలాతక్కువగా ఉంటుంది. కేసీసీ కింద లభించే రుణాలపై బేసిక్ వడ్డీ రేటు 7 శాతంగా ఉంటుంది. ఒక వేళ రైతు తీసుకున్న లోన్ రూ.3 లక్షల వరకు ఏడాదిలోపు కరెక్ట్ గా తిరిగి చెల్లిస్తే కేంద్ర ప్రభుత్వం అదనంగా 3 శాతం వడ్డీ సబ్సిడీ ఇస్తుంది. అంటే క్రమం తప్పకుండా రుణాలు చెల్లించే రైతులకు కేవలం 4 శాతం వడ్డీకే ఈ రుణం లభిస్తుంది. రూ.1.60 లక్షల వరకు ఎలాంటి షురిటీ అవసరం లేదు. కొన్ని బ్యాంకుల్లో దీనిని రూ.3 లక్షల వరకు కూడా పొడిగించారు. ఈ కార్డు కాల పరిమితి 5 సంవత్సరాల వరకు ఉంటుంది, రైతు క్రెడిట్ హిస్టరీ బాగుంటే ప్రతి ఏటా లోన్ లిమిట్ 10 శాతం పెంచుకుంటూ వెళ్తారు.

# వారంలో మూడు కంపెనీల ఐపిఒలు




**ముంబయి,జూన్ 21:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గడంతో పబ్లిక్ ఇష్యూల సందడిషురూ అయింది. మెయిన్ బోర్డు కేటగిరీ నుంచి ఈవారం 3 కంపెనీలు ఐపీఓల ద్వారా నిధులు సమీకరించేందుకు సిద్ధమవుతున్నాయి. వాటర్ వేస్ లీజర్ టూరిజం (కార్డెలియా క్రూయిజెస్),జైపూర్‌కు చెందిన జువెలరీ కంపెనీ అద్వైత్ జువెల్స్, ఐటీ సొల్యూషన్స్ కంపెనీ సీఎస్ఎం టెక్నాలజీస్ కంపెనీలు ఐపీఓకు వస్తున్నాయి. ప్యాకింగ్ సొల్యూషన్స్ అందించే న్యాక్ ప్యాకేజింగ్ వచ్చే వారమే ప్రైస్ బ్యాండ్ నిర్ణయించనున్నాయి. వాటర్ వేస్ లీజర్ టూరిజం కంపెనీ పబ్లిక్ ఇష్యూలో భాగంగా రూ.585 కోట్లు సమీకరించనుంది. ధరల శ్రేణిని రూ.769 నుంచి రూ.808గా నిర్ణయించారు. ఈనెల 23 నుంచి 25 వరకు సబ్‌స్క్రిప్షన్ అందుబాటులో ఉండనుంది. పూర్తిగా షేర్లను ఫ్రెష్ ఇష్యూ ద్వారా జారీ చేయనున్నారు. అద్వైత్ జువెల్స్ కంపెనీ ఐపీఓ ద్వారా రూ.165.16 కోట్లు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈనెల23వ తేదీన సబ్‌స్క్రిప్షన్ మొదలయి 25వ తేదీ ముగుస్తుంది. ధరల శ్రేణిని రూ.130 నుంచి రూ.138గా కంపెనీ నిర్ణయించింది. ఫ్రెష్ ఇష్యూ ద్వారా 1.20 కోట్ల ఈక్విటీ షేర్లను కంపెనీ జారీచేస్తోంది. అప్పులు తీర్చేందుకు, నిర్వహణ ఖర్చులకు ఈ డబ్బులు వినియోగించనుంది. ఐటీ సేవల సంస్థ సీఎస్ఎం టెక్నాలజీస్ రూ.146 కోట్లను ప్రాథమిక మార్కెట్ నుంచి సమీకరించనుంది. ఒక్కో షేరు ధర రూ.107 నుంచి రూ.113గా నిర్ణయించారు. ఈనెల 24వ తేదీ న ఈ సబ్‌స్క్రిప్షన్ మొదలై 27వరకు కొనసాగనుంది. ఇది కూడా పూర్తి ఫ్రెష్ షేర్లను జారీ చేయనుంది. క్విక్ కామర్స్ కంపెనీ జెప్టో ఐపీఓ ద్వారా రూ.10 వేల కోట్లు సమీకరించనుంది. ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్ రూ.13 వేల కోట్లు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ, రిలయన్స్ జియో సంస్థలు ముసాయిదా పత్రాలను సమర్పించాయి.

# టాటా మోటార్స్‌కు కమర్షియల్ ఈవీల ఆర్డర్




**న్యూఢిల్లీ:** దేశీయ ఆటో మొబైల్ దిగ్గజం టాటా మోటార్స్ ఎలక్ట్రిక్ వాణిజ్య వాహనాలవిభాగంలో మరో రికార్డు సాధించింది.సరుకు రవాణా, లాజిస్టిక్స్,ప్రయాణికుల రవాణా విభాగాలకు చెందిన వివిధ సంస్థల నుంచి కంపెనీకి 3,400కుపైగా ఎలక్ట్రిక్ కమర్షియల్ వాహనాల ఆర్డర్లు లభించినట్లు ఆదివారం ప్రకటించింది.ఈ ఆర్డర్లలో సుమారు 2,000చిన్న వాణిజ్య వాహనాలతోపాటు పికప్ వాహనాలు,900 ట్రక్కులు, 500 బస్సులు ఉన్నాయి. ఈ వాహనాలను ఈ కామర్స్, లాజిస్టిక్స్,ఎఫ్ఎంసీజీ,వినియోగ వస్తువుల పంపిణీ, నగర అంతర్గత రవాణా సేవలతో పాటు సిమెంట్, ఉక్కు, గనుల పరిశ్రమలు, విమానాశ్రయ కార్యకలాపాల్లో వినియోగించనున్నారు.ఈభారీ ఆర్డర్‌బుక్ ఎలక్ట్రిక్ వాణిజ్య వాహనాలపై వినియోగదారుల విశ్వాసం పెరుగుతున్నట్లు సూచిస్తోందని తెలిపింది.దేశంలో అతిపెద్ద కమర్షియల్ వెహికల్ తయారీ సంస్థ అయిన టాటామోటార్స్,విస్తృత ఎలక్ట్రిక్ వాహనాల శ్రేణితో పాటు ఛార్జింగ్ మౌలిక సదుపాయాలు,ఫైనాన్సింగ్ పరిష్కారాలు, ఫ్లీట్ మేనేజ్‌మెంట్ సేవలు మరియు వాహనాల నిరంతర వినియోగాన్ని నిర్ధారించే కార్యక్రమాల ద్వారా ఈ మార్పుకు మద్దతు అందిస్తున్నట్లు తెలిపింది.గత ఏడాదిలో కంపెనీ ఏస్ ప్రో ఈవీ, ఏస్ ఈవీ, ఇంట్రా ఈవీ వంటి కొత్త మోడళ్లను ప్రవేశపెట్టి సరుకు రవాణా విభాగాన్ని బలోపేతం చేసింది.అల్ట్రా ఈవీ శ్రేణి, ప్రైమా ఈవీ 55టీ ట్రాక్టర్, ప్రైమా ఈవీ 28టీ టిప్పర్ వంటి మధ్యస్థ, భారీ వాణిజ్య వాహనాలను కూడా మార్కెట్లోకి తీసుకొచ్చింది. ప్రయాణికుల రవాణావిభాగంలో స్టార్‌బస్ ఈవీ మరియు అల్ట్రా ఈవీ బస్సులు కంపెనీ పోర్ట్‌ఫోలియోలో ఉన్నాయి. ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని మరింత విస్తరించేందుకు టాటా మోటార్స్ 14కు పైగా ఛార్జింగ్ పాయింట్ ఆపరేటర్లతో భాగస్వామ్యం కుదుర్చుకుంది.

# ఆస్ట్రియాకు 22.6టన్నుల కోడిగుడ్ల పొడి ఎగుమతి




**న్యూఢిల్లీ:** ఎగుమతుల్లో ప్రత్యేకించి శుద్ధి చేసిన ఆహార ఉత్పత్తుల ఎగుమతుల రంగంలో కొత్త అధ్యాయానికి భారత్ నాందిపలికింది. దేశ చరిత్రలో తొలిసారిగా ఎండిన కోడిగుడ్ల పొడి (డ్రైడ్ హోల్ ఎగ్‌పౌడర్) వాణిజ్యపరంగా ఆస్ట్రియాకు ఎగుమతి అయ్యింది. ఒడిశాలోని బాలాంగిర్ జిల్లా నుంచి 22.6 మెట్రిక్ టన్నుల సరుకును యూరప్‌కు పంపడం ద్వారా భారత్ మరో కీలక మైలురాయిని అధిగమించింది.

ఒడిశాకు చెందిన ఓవో ఫార్మ్ ప్రైవేట్ లిమిటెడ్ ఉత్పత్తి చేసిన ఈ సరుకును వర్చువల్ విధానంలో అధికారులు పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అపెడా చైర్మన్ అభిషేక్ దేవ్, ఒడిశా మత్స్య మరియు పశుసంవర్ధక శాఖ కమిషనర్ కమ్ సెక్రటరీ ప్రేమ్‌చంద్, బాలాంగిర్ కలెక్టర్ గౌరవ్‌శివాజీ ఇసల్వార్ తదితరులు పాల్గొన్నారు. కోడిగుడ్లను పాశ్చరైజేషన్, స్ప్రేడ్రైయింగ్ పద్ధతుల్లో పొడిగా మార్చడం ద్వారా అవి ఎక్కువ కాలం నిల్వ ఉంటాయి. బేకరీ, కాన్ఫెక్షనరీ, నూడుల్స్ వంటి ఆహార తయారీ పరిశ్రమల్లో ఈ పొడికి విశేష డిమాండ్ ఉంది. అంతర్జాతీయ మార్కెట్‌లో భారతీయ శుద్ధి చేసిన పౌల్ట్రీ ఉత్పత్తులకు పెరుగుతున్న ఆదరణకు ఈ పరిణామం నిదర్శనంగా నిలుస్తోంది.

కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ పరిధిలోని అపెడా ఈ ఎగుమతి ప్రక్రియకు పూర్తి స్థాయి సహకారం అందించింది.

తాజా విజయంతో యూరప్ మార్కెట్‌లో భారతీయ ఉత్పత్తులకు మరింత గుర్తింపు లభించడమే కాకుండా, ఒడిశాలోని వ్యవసాయాధారిత శుద్ధి రంగంలో (ఆగ్రోప్రాసెసింగ్) పెట్టుబడులకు మార్గం సుగమం అవుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

తూర్పుగోదావరి, కాకినాడ, పోలవరం.
డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

రాజమహేంద్రవరం | సోమవారం 22 జూన్ 2026 | I

## ఆర్థిక సహాయం



**అయినవిల్లి,జూన్21,(ప్రభాతవార్త)** అయినవిల్లి మండలం కె.జగన్నాథపురం గ్రామానికి చెందిన కవలలు అయిన పిచ్చిక జ్యోతిక,జ్యోత్స్న లకు అమలాపురం శ్రీరామపురం కు చెందిన దస్తావేజు లేఖరి మట్టపర్తి శ్రీరాములు (రాము ) చదువు నిమిత్తం రూ. 10:వేలు ఆర్థిక సహాయం అందజేశారు. పిచ్చిక సత్యనారాయణ (52) శుక్రవారం తీవ్ర అనారోగ్యంతో మృతి చెందారు. ఆయనకు గల ముగ్గురు కుమార్తెలే అంత్య క్రియలు నిర్వహించారని గ్రామస్తులు తెలిపారు. తండ్రి మరణం మీకు తీరనిలోటని, మీరు బాగా చదువుకుని అభివృద్ధి లోకి రావాలని జ్యోతిక,జ్యోత్స్న లకు ఆయన రాము కోరారు.

## కిమ్స్‌లో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం




**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జూన్21,ప్రభాతవార్త** అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని కిమ్స్ మెడికల్ కాలేజ్ వైస్ ప్రెసిడెంట్ ఎం. మోహన రాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఫిజికల్ డైరెక్టర్ నాగ రాజు, మాదిరెడ్డి సహాయంతో, వైద్య ఉపాధ్యాయులు మరియు వైద్య విద్యార్థులు ఉత్సాహంగా జరుపుకున్నారు.కిమ్స్ చైర్మన్ కె.వి.వి.సత్యనారాయణ రాజు, ఎం.డి. రవి కిరణ్ వర్మ ప్రోత్సాహంతో జరిగిన ఈ యోగా అభ్యాస కార్యక్రమంలో కిమ్స్ డీన్ డా.ఆనంద్ ఆచార్య, మెడికల్ డైరెక్టర్ డా.హరి కిరణ్ వర్మ, ప్రొఫెసర్ డా.రేఖా కుమారి, మానవ వనరుల జనరల్ రాధా మనోహర్, క్వాలిటీ జనరల్ మేనేజర్ వి.వి.కె.కె.శర్మ సిబ్బంది పాల్గొని యోగాభ్యాసం చేశారు. మోహన రాజు మాట్లాడుతూ యోగాభ్యాసం మానసిక మరియు శారీరక ఆరోగ్యానికి ఎంతో దోహదపడుతుందని, ప్రతి ఒక్కరూ ప్రతిరోజూ ఉదయం కనీసం 15 నిమిషాలు యోగాభ్యాసం తమ దినచర్యలో భాగంగా చేసుకొని ఆరోగ్యంగా ఉండాలని కోరారు.

## నీట్ పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందుమాధవ్:



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి జూన్ 21 (ప్రభాతవార్త)** నీట్ ఎగ్జామినేషన్ నిర్వహిస్తున్న కాకినాడలో పలు పరీక్షా కేంద్రాలను జిల్లా ఎస్పీ జి. బిందుమాధవ్ ఆదివారం స్వయంగా సందర్శించి క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో, అత్యంత పారదర్శకంగా జరిగేలా పరీక్షా కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన పోలీసు బందోబస్తును ఆయన నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ విధుల్లో ఉన్న పోలీసు అధికారులు, సిబ్బందికి పలు కీలక సూచనలు చేస్తూ, పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, పరీక్షా నిబంధనలకు అనుగుణంగా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు కొనసాగించాలని ఆదేశించారు. అదేవిధంగా, పరీక్షా కేంద్రాల పరిసరాల్లో ట్రాఫిక్ నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణతో పాటు పరీక్షా నిర్వహణకు ఎటువంటి ఆటంకాలు కలగకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సంబంధిత అధికారులను ఎస్పీ ఆదేశించారు. కాకినాడ అడిషనల్ ఎస్పీ (ఏ ఆర్) ఎస్ శ్రీనివాసరావు, కాకినాడ సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ పాటిల్ దేవరాజ్ మనీష్, పలువురు సీఐలు, ఎస్సైలు, సిబ్బంది నీట్ ఎగ్జామినేషన్ విధుల్లో పాల్గొన్నారు.

## యోగా ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలి

### కలెక్టర్ దినేష్ కుమార్





**రంపచోడవరం,జూన్ 21:-(ప్రభాతవార్త)** ప్రతి మనిషి యోగ జీవనంలో ఒక భాగంగా చేసుకొని ప్రతిరోజు యోగ చేయాలని పోలవరం జిల్లా కలెక్టర్ కె.దినేష్ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం రంపచోడవరం గిరిజన సంక్షేమ శాఖ గురుకుల బాలుర జూనియర్ కళాశాల ప్రాంగణంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం కార్యక్రమానికి రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ యస్.బొజ్జి రెడ్డి,పోలవరం జిల్లా కలెక్టర్ కె.దినేష్ కుమార్, రంపచోడవరం శాసనసభ్యులు మిరియాల శిరీష దేవి, పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ సురపాటి ప్రశాంత్ కుమార్, రంపచోడవరం రెవిన్యూ డివిజనల్ అధికారి కె.స్వాతి, జిల్లా రెవిన్యూ అధికారి పి. అంబేద్కర్,రంపచోడవరం సబ్ డివిజనల్ పోలీస్ అధికారి అష్రాఫ్ అలీ, ముఖ్య అతిథులుగా హాజరైనారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కె.దినేష్ కుమార్ మాట్లాడుతూ యోగా శారీరక, మానసిక ఆరోగ్యానికి ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన అన్నారు. నేటి ఒత్తిడితో కూడిన జీవనశైలిలో ప్రతి ఒక్కరూ ప్రతిరోజూ కొంత సమయం యోగాకు కేటాయించాలని కలెక్టర్ సూచించారు. యోగా ద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని ఆయన అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పిలుపు మేరకు, మనం 'యోగాంధ్ర' కార్యక్రమాన్ని మన జిల్లాలో ఇంత పెద్ద ఎత్తున జరుపుకోవడం చాలా సంతోషకర విషయమని ఆయన అన్నారు. భారత ప్రధాన మంత్రివర్యులు నరేంద్ర మోడీ, మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు 2014లో మనకి వారసత్వ సంపద కింద వస్తున్నటువంటి ఈ యోగానీ ప్రపంచం మొత్తానికి చాటిచెప్పే విధంగా యునైటెడ్ నేషన్స్ లో ఒక రిజల్యూషన్ పాస్ చేసి, మన దేశం నుంచి వచ్చినటువంటి యోగ సంపద ప్రతి ఒక్క దేశానికి కూడా వెళ్లాలనే ఉద్దేశంతో ప్రపంచమంతా జూన్ 21వ తారీఖున ఆదివారం మనం అంతర్జాతీయ యోగా దినోత్సవం జరుపు కొన్నామని అదేవిధంగా ముఖ్యమంత్రి 14 రోజుల పాటు ఈ యోగా యొక్క విశిష్టత, అలాగే ఈ యోగా వల్ల వచ్చేటటువంటి ప్రయోజనాలు ఆంధ్రప్రదేశ్ ప్రజలందరికీ కూడా తెలియాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని రూపొందించడం జరిగిందని ఆయన తెలిపారు .అందులో భాగంగా ఈరోజు మనం రంపచోడవరంలో ఈ అంతర్జాతీయ యోగ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని ఆయన అన్నారు. ప్రతి మనిషి ప్రతిరోజు సూర్యోదయానికి ముందు నుండే యోగ చేసిన యెడల మంచి ఆరోగ్యకరంగా ఉండవచ్చని ఆయన అన్నారు మన పోలవరం జిల్లాలో టూరిజం అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టడం జరుగుతుందని ఆయన అన్నారు. పోలవరం జిల్లాలో ఈ ప్రాంత ప్రజలు ఆరోగ్యకరంగా ఉండే విధంగా యోగ పై పూర్తిగా అవగాహన ఉండాలని ఆయన అన్నారు. విద్యార్థులకు, ప్రజలకు అవగాహన కల్పించే విధంగా తగు చర్యలు చేపట్టడం జరుగుతుందని ఆయన అన్నారు. అనంతరం రాష్ట్రస్థాయి యోగ పోటీలలో పాల్గొన్న పల్లాల బాల ప్రసాద్ రెడ్డికి, జ్యోతి, శ్రీనివాస్ రామ్ సుశాంత్, సింధు, గొర్లె జగన్నాధ రావుకు ముఖ్య అతిథులు చేతుల మీదుగా సర్టిఫికెట్లు, మోమెంటోలు అందజేయడం జరిగింది.

## వాడపల్లి వెంకన్న నిత్యాన్న పథకానికి రూ,50,116.

### స్వామివారికి నిత్య కళ్యాణం, అష్టోత్తర పూజలలో పాల్గొన్న భక్తులు.





**ఆత్రేయపురం, జూన్ 21,(ప్రభాత వార్త)** ఏడువారాల వెంకన్నగా ప్రసిద్ధి చెందిన కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయానికి ఆదివారం అశేష సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు.వేలాది మంది భక్తుల రాకతో ఆలయ పరిసరాలన్నీ గోవిందనామ స్మరణతో మార్మోగాయి.ఏడు వారాల నోము పూర్తయిన భక్తులు అష్టోత్తర శతనామావళి, నిత్య కళ్యాణం, గోపూజ, పూజల్లో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాలు స్వీకరించారు. రాజమండ్రి, దానవాయిపేట చెందిన నిడిముక్కల శ్రీదేవి, పిల్లుట్ల రవికుమార్, వారి కుటుంబ సభ్యులు నిత్యాన్నదాన పథకానికి రూ. 50,116/- వేలు విరాళంగా అందించారు. స్వామివారి దర్శనం అనంతరం వారికి ఆలయ అర్చకులు వేద పండితులు వేద ఆశీర్వచనం అందించగా. ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు శ్రీ స్వామివారి చిత్రపటం, తీర్థప్రసాదాలు, అందజేశారు. వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తగు ఏర్పాట్లు చేశారు.

## యోగ సాధనతో శక్తిని పెంపొందించుకోవచ్చు...

### జిల్లా బిజెపి అధ్యక్షులు అడబాల




**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,జూన్21,ప్రభాతవార్త** అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా హెల్త్ అండ్ ఫిట్నెస్ జిమ్ యోగా సెంటర్ లో నిర్వహించిన యోగ డే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా బిజెపి అధ్యక్షులు అడబాల సత్యనారాయణ ముఖ్య అతిథిగా విచ్చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా సాధన ద్వారా శరీరిక మానసిక శక్తిని పెంపొందించుకోవచ్చునని తెలిపారు.అనంతరం యోగ థెరపిస్ట్ కంకిపాటి వెంకటేశ్వర రావు ఆధ్వర్యంలో యోగ ప్రోటోకాల్ ప్రకారం యోగ ఆసనాలు ప్రాణాయామం ను యోగ సాధకులసే చేయటం జరిగింది.ఈ కార్యక్రమంలో సంసాని రత్నశేఖర్, యిళ్ళ సత్యనారాయణ,పెద్దిరెడ్డి రాము, మేకల కిషోర్,సిహెచ్.శంకర్ నారాయణ,జి. దొరబాబు, ఎం.రాహుల్, వి.గోపి, ఎల్.సత్యనారాయణ, జిల్లా బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు.

# రెడ్ బుక్ వేటపై.. కాపు గర్జన

### కూటమిపై వైకాపా వ్యూహాత్మక అడుగులు

### వెంకటాయపాలెం వేదికగా కాపు నేతల సమరభేరి

### అరాచక పాలనపై సమరానికి తిరుపతి,విశాఖల్లో సమ్మేళనాలు







**రామచంద్రాపురం,జూన్ 21 (ప్రభాత వార్త):** రాష్ట్రంలో సాగుతున్న రెడ్ బుక్ రాజకీయం,కాపు సామాజికవర్గాన్ని లక్ష్యంగా చేసుకుని సాగుతున్న అణచివేతపై వైకాపా కాపు ప్రజాప్రతినిధులు,ముఖ్య నేతలు వ్యూహాత్మక సమరశంఖం పూరించారు.డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా వెంకటాయపాలెంలోని అన్నపూర్ణ ఫంక్షన్ హాల్లో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆధ్వర్యంలో గురువారం జరిగిన కాపు ఆత్మీయ సమ్మేళనం రాష్ట్ర రాజకీయాల్లో సరికొత్త సమీకరణాలకు తెరలేపింది.మాజీ మంత్రులు బొత్స సత్యనారాయణ,అంబటి రాంబాబు,పేర్ని నాని, కురసాల కన్నబాబు,కొట్టు సత్యనారాయణ,గుడివాడ అమర్నాథ్‌లతో పాటు వంగా గీత, జక్కంపూడి రాజా సహా రాష్ట్రవ్యాప్త వైకాపా కాపు దిగ్గజాలంతా ఒకే తాటిపైకి వచ్చి కూటమి సర్కారు ప్రజా వ్యతిరేక విధానాలపై తీర్మానాల జడి కురిపించారు.

### సమరశీలం.. సమ్మేళన తీర్మానాలు

?ఎన్నికల వేళ కూటమి ఇచ్చిన రంగురంగుల హామీలు నేడు బుట్టదాఖలయ్యాయని నేతలు ధ్వజమెత్తారు. గత రెండేళ్లుగా కాపు కార్పొరేషన్‌కు నిధులు మొండిచేయి చూపడాన్ని తీవ్రంగా ఖండిస్తూ.. ప్రస్తుత బకాయిలతో కలిపి తక్షణమే రూ.9,000 కోట్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వైకాపా పాలనలో 'కాపు నేస్తం' కింద మహిళల ఖాతాల్లో రూ.2,000 కోట్లు జమ చేసిన ఉదంతాన్ని గుర్తు చేస్తూ.. నేడు మహిళా సాధికారతను కూటమి ప్రభుత్వం గాలికొదిలేసిందని ఆరోపించారు.?రాష్ట్రంలో అరాచకం రాజ్యమేలుతోందని,గాదే సాయికృష్ణ,క్రాంతి కుమార్ సంఘటనలు సాధారణ ఆత్మహత్యలు కావని,అవి ప్రభుత్వ ప్రేరేపిత లాకప్ డెత్‌లని నేతలు మండిపడ్డారు.సాయికృష్ణ ఉదంతంపై తక్షణమే సిబిఐ విచారణ జరపాలని డిమాండ్ చేశారు.కాపులను సంఘ విద్రోహ శక్తులుగా,రౌడీలుగా చిత్రీకరిస్తూ చంద్రబాబు ప్రభుత్వం సాగిస్తున్న అరాచకాలను ఎండగట్టారు.వారిపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని హెచ్చరించారు. కాపు, తెలగ, బలిజ, ఒంటరి, మున్నూరు కాపు వర్గాలకు అండగా నిలిచేందుకు రాష్ట్రవ్యాప్తంగా మూడు ప్రాంతీయ టాస్క్ ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. బాధితులకు తక్షణ ఆర్థిక సాయం అందించేందుకు అధునాతన క్లౌడ్ ఫండింగ్ విధానాన్ని తీసుకురావాలని తీర్మానించారు.కార్పొరేట్ వ్యాపారులకు కొమ్ముకాస్తూ, సామాన్య మరియు ఆక్వా రైతులను అప్పులపాలు చేస్తున్న ప్రభుత్వ వైఖరిని మార్చుకోకపోతే సహించేది లేదని స్పష్టం చేశారు.ఈ ఆత్మీయ కలయిక కేవలం ఒక ప్రాంతానికే పరిమితం కాదని,రాబోయే రోజుల్లో తిరుపతి, విశాఖపట్నం వేదికలుగా భారీ ఎత్తున కాపు ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించి కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజాకోర్టులో తేల్చుకుంటామని నేతలు ప్రతిజ్ఞ చేశారు.వైకాపా కాపు నేతల ఈ హఠాత్ గర్జన అధికార వర్గాల్లో తీవ్ర ప్రకంపనలు సృష్టిస్తోంది.

## చింతూరులో అంతర్జాతీయ యోగా దినోత్సవానికి

# అధికారుల డుమ్మా..

### ఏ జి హెచ్ ఎస్ లో యోగా దినోత్సవం అట్టర్ ఫ్లాప్.





**చింతూరు, జూన్ 21 ప్రభాత వార్త :** చింతూరులో ఆదివారం ఏ జి హెచ్ ఎస్ ఆశ్రమ పాఠశాలలో నిర్వహించిన అంతర్జాతీయ యోగా దినోత్సవం అట్టర్ ఫ్లాప్ అయ్యింది. ఒక్క మండల పరిషత్ అభివృద్ధి అధికారి సున్నం శ్రీనివాస్ దొర,తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు ఎండి జమాల్ ఖాన్,ఇద్దరు ముగ్గురు పార్టీ కార్యకర్తలు తప్ప ఆశ్రమ పాఠశాల విద్యార్థులు మాత్రమే ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. మండల స్థాయిలో యోగా దినోత్సవం విజయవంతం చేయాలని ఉన్నతాధికారులు సూచనలు జారీ చేసిన ఏ ఒక్క అధికారి, సిబ్బంది కూడా అంతర్జాతీయ యోగా దినోత్సవం గురించి పట్టించుకున్న పాపాన పోలేదు. ఉదయం 6 గంటలకు అందరూ ఏ జి హెచ్ ఎస్ ఆశ్రమ పాఠశాలకు చేరుకొని యోగా దినోత్సవం కార్యక్రమంలో పాల్గొనాలని సోషల్ మీడియాలో ప్రచారం చేసిన వాట్సాప్ లో మెసేజ్లు పెట్టిన ఎవరు స్పందించకపోవడం, అధికారులు యోగా దినోత్సవానికి ఎంత ప్రాముఖ్యత ఇస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. స్వయానా దేశ ప్రధాని రాష్ట్ర ముఖ్యమంత్రి యోగా దినోత్సవం గురించి విస్తృతంగా ప్రచారం నిర్వహించిన అధికారులు పెద్దగా స్పందించటం లేదనేది ఆదివారం చింతూరు లో జరిగిన యోగా దినోత్సవం స్పష్టం చేస్తుంది. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాలమేరకు అధికార పార్టీ నాయకులు కార్యకర్తలు కూడా యోగా దినోత్సవం కార్యక్రమంలో పాల్గొనాలని వాట్సాప్ గ్రూపులో ప్రచారం చేసిన పార్టీ కార్యకర్తలు కూడా ఎవరు పెద్దగా స్పందించలేదు. మండల అధ్యక్షుడు జమాల్ ఖాన్ తో పాటు మార్కెట్ కమిటీ సభ్యుడు సాల్మన్ రాజు, రామారావు మాజీ సర్పంచ్ కరణం లక్ష్మణ్, జానీ తదితరులు తప్ప ఏ ఒక్క కార్యకర్త అక్కడ కనిపించకపోవడం గమనార్హం. ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణ కుమారి ఆధ్వర్యంలో సుమారు 100 మంది విద్యార్థినులు, పి ఈ టి కవిత ఆధ్వర్యంలో యోగాసనాలు వేసి ఈ కార్యక్రమాన్ని ముగించారు. ఇది ఆదివారం చింతూరులో నిర్వహించిన అంతర్జాతీయ యోగా దినోత్సవం తీరు.

## ప్రశాంతంగా నీట్ పరీక్ష : జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి



**రాజమహేంద్రవరం సిటీ, జూన్ 21( ప్రభాతవార్త)** రాజమహేంద్రవరంలో ఆదివారం నిర్వహించిన నీట్ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ఒక ప్రకటన తెలిపారు. పరీక్ష నిర్వహణకు అన్ని కేంద్రాల్లో పటిష్టంగా ఏర్పాటు చేసి బయోమెట్రిక్ నమోదు సిసి కెమెరాలు జామర్లు భద్రత చర్యలను సమర్థవంతంగా అమలు చేసినట్లు పేర్కొన్నారు. జిల్లాలో మొత్తం తొమ్మిది పరీక్షా కేంద్రాల్లో 3363 మంది అభ్యర్థులకు పరీక్ష నిర్వహించగా 30 66 మంది పరీక్షకు హాజరయ్యారని 297 మంది గైరాజరయ్యారని తెలిపారు. మొత్తం 91.17%గా నమోదు అయినట్టు వెల్లడించారు. పరీక్ష నిర్వహణలో సహకరించిన అధికారులు సిబ్బంది పోలీస్ శాఖ వైద్య సిబ్బంది విద్యుత్ రవాణా తదితర శాఖ అధికారులను కలెక్టర్ అభినందించారు.

## వైసీపీ కాపు నేతలది 'ఆత్మీయ సమావేశం' కాదు...

### ఓటమి భయంతో చేసుకుంటున్న 'ఆత్మావలోకనం

### -మంత్రి కందుల దుర్గేష్




**రాజమహేంద్రవరం అర్బన్,జూన్21,(ప్రభాత వార్త)** వైసీపీ కాపు నేత, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశం ఒక ఆత్మీయ సమావేశం కాదని, అది జగన్ రెడ్డి ఐదేళ్ల తుగ్లక్ పాలనలో కాపు కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేసి, సమాజానికి ద్రోహం చేశాక.రేపు మనకు పుట్టగతులు ఉంటాయా, మన రాజకీయ భవిష్యత్తు ఏంటి" అని భయంతో ఏడుస్తూ చేసుకుంటున్న "ఆత్మావలోకన" సమావేశం అని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖా మంత్రి కందుల దుర్గేష్ ఘాటుగా కౌంటర్ ఇచ్చారు. రాజమహేంద్రవరంలోని హుకుంపేట క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి దుర్గేష్ వైసీపీ నేతల కపట నాటకాలను తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ పిఠాపురంలో డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చేతిలో ఘోరంగా ఓడిపోయిన దుర్దశ, ఫ్రస్ట్రేషన్ భరించలేకే వంగా గీత ఇవాళ కూటమి ప్రభుత్వంపై, మా నాయకుడు పవన్ కళ్యాణ్ పై విషం చిమ్ముతున్నారు. పిఠాపురంలో ఆమె పర్మినెంట్ అడ్రస్ గల్లంతైందనే బాధే ఆవిడ మాటల్లో కనిపిస్తోంది. ప్రజాస్వామ్యంలో ఎక్కడినుండైనా పోటీ చేసే హక్కు, స్వేచ్ఛ జనసేనాని పవన్ కళ్యాణ్ కు ఉన్నాయి. పిఠాపురం శ్రీపాద వల్లభుడిపై ఉన్న భక్తితో, ఆ ప్రాంతాన్ని వందల కోట్లతో అద్భుతంగా అభివృద్ధి చేయాలనే ఆకాంక్షతోనే ఆయన అక్కడ పోటీ చేసి చారిత్రాత్మక విజయం సాధించారని మరి మీ జగన్ రెడ్డికి అంత దమ్ముంటే... కేవలం పులివెందుల కోటకే ఎందుకు పరిమితమయ్యాడు? వేరే నియోజకవర్గం నుండి పోటీ చేసే సాహసం ఎందుకు చేయలేకపోయాడో వైసీపీ కాపు నేతలు సమాధానం చెప్పాలి అని నిలదీశారు. గతంలో టీడీపీ-జనసేన హయాంలో కాపు కార్పొరేషన్ ద్వారా విదేశీ విద్యకు ఇతోధికంగా నిధులు ఇచ్చి ఎంతోమంది యువతను గ్లోబల్ లీడర్లుగా తీర్చిదిద్దింది నిజం కాదా? అని మంత్రి దుర్గేష్ ప్రశ్నించారు. మరి గడిచిన ఐదేళ్ల వైసీపీ పాలనలో ఆ కార్పొరేషన్‌ను ఎందుకు నిర్వీర్యం చేశారు? నిధులు ఆపేసి, కాపు కళ్యాణ మండపాల నిర్మాణాలను నిలిపివేసి, విదేశీ చదువులకు వెళ్లిన విద్యార్థులను నడిరోడ్డుపై పడేసి నానా అవస్థలు పెట్టినందుకు వైసీపీ నేతలు కాపు సమాజానికి ముక్కు నేలకు రాసి క్షమాపణ చెప్పాలి. నాడు కాపు యువత భవిష్యత్తును నడిసముద్రంలో ముంచేసిన మీకు... నేడు కులాల గురించి మాట్లాడే నైతిక హక్కు ఎక్కడిది? అంటూ ఫైర్ అయ్యారు విజయవాడకు చెందిన గాదె సాయికృష్ణ విషయంలో కూటమి ప్రభుత్వం అత్యంత చిత్తశుద్ధితో ఉంది కాబట్టే, ఆ కుటుంబం ప్రభుత్వాన్ని సంప్రదించి నమ్మకం వ్యక్తం చేసిందన్నారు. మాకు చిత్తశుద్ధి ఉంది కాబట్టే బాధ్యతాయుతంగా, పారదర్శకంగా విచారణ జరిపిస్తూ సీఐని సస్పెండ్ చేశాం. తూర్పుగోదావరి ఎస్పీని స్పెషల్ ఆఫీసర్‌గా పెట్టి ఎంక్వైరీ చేయిస్తున్నాం. చట్టం ముందు ఎవరైనా ఒకటే... తప్పు చేసిన వాడు ఎంతటివాడైనా సరే చట్టం నుండి తప్పించుకోలేడని స్పష్టం చేశారు. 'దేశం, సమాజం బాగుండాలి... నన్ను కులాల చట్రంలో బంధించవద్దు' అని ఢిల్లీలో పవన్ కళ్యాణ్ చెప్పిన ఉన్నతమైన మాటలను తమ స్వార్థ రాజకీయాల కోసం వైసీపీ నేతలు వికృతంగా చిత్రీకరిస్తున్నారు. దేశం, సమాజం బాగుండాలనుకునే నాయకుడిని కులాల చట్రంలో బంధించాలని చూస్తే... ఆ చట్రాన్ని బద్దలు కొట్టే మొదటి దెబ్బ కాపు యువతే వేస్తుంది, గుర్తుపెట్టుకోండి! అని సవాల్ విసిరారు. అధికార ముసుగు ముఖాన వేసుకుని, ఐదేళ్లపాటు గద్దెపై కూర్చుని... సొంత కాపు కులానికి అన్యాయం జరుగుతుంటే కళ్లప్పగించి చూసిన చేతకాని వ్యక్తులు మీరు! అని వైసీపీ కాపు నేతలను సూటిగా నిలదీశారు. నాడు మీ జగన్ రెడ్డి కాపు కార్పొరేషన్‌ను ఖూనీ చేస్తుంటే నోళ్లు కుట్టేసుకుని పడి ఉన్న మీరు... ఇవాళ పదవులు పోయాక, ప్రజలు ఛీత్కరించుకున్నాక ఏ ముఖం పెట్టుకుని ఈ హడావిడి చేస్తున్నారు? మీ స్వార్థ రాజకీయాల కోసం కాపు సమాజాన్ని వాడుకోవాలని చూస్తే... ఈసారి కాపు యువత తోలు వలిచి చేతిలో పెడుతుంది, జాగ్రత్త అని మంత్రి కందుల దుర్గేష్ గారు తీవ్రస్థాయిలో హెచ్చరించారు.

## రాజవొమ్మంగి ఆసుపత్రిని సి హెచ్‌సి స్థాయికి

# పెంచాలని మంత్రికి వినతిపత్రం



**రాజవొమ్మంగి, జూన్ 21, ప్రభాతవార్త** రాజవొమ్మంగి పి. హెచ్. సిని సి. హెచ్. సి స్థాయికి పెంచడానికి సహకరించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖమంత్రికి ఏ. సత్యకుమార్ యాదవ్ కు ఆదివారం బి జె. పి. రాష్ట్ర కార్యదర్శి స్వప్న కుమారి వినతిపత్రంను ఇచ్చారు. రాజమండ్రిలో జరిగిన కార్యక్రమంలో వినతిపత్రంను ఇచ్చి ఆవశ్యకతను వివరించినట్లు ఆమె తెలిపారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు వారు కూడా రాజవొమ్మంగి పి. హెచ్. సి ని సి. హెచ్. సి గా మార్పు చేయడం అవసరమని మంత్రికి తెలిపారు. సి. హెచ్. సి స్థాయి పెంపుకు మంత్రి సానుకూలంగా స్పందించారని స్వప్న కుమారి అన్నారు.. ఈకార్యక్రమంలో ఎమ్మెల్సీ సోము వీర్రాజు, బిజెపి రాష్ట్ర కార్యదర్శి ఈరోజు స్వప్నకుమారి, బిజెపి నాయకులు సగరపు శివాజీ, రమేష్ పాల్గొన్నారు. రాజవొమ్మంగి గ్రామానికి చెందిన సామాజికవేత్త, న్యాయవాది నోరి దత్తాత్రేయ కూడా సి. హెచ్. సి స్థాయి పెంచాలని రాష్ట్ర ఎస్టీ కమీషన్ చైర్మన్ సొల్ల బొజ్జి రెడ్డికి వినతిపత్రంను ఇప్పటికే ఇచ్చారు.

## తన తండ్రి ముద్రగడ పద్మనాభం

# క్షేమంగా తిరిగి వస్తారు

### పార్టీ శ్రేణులు, అభిమానులు, ఎవరు ఆందోళన చెందవద్దు

### తనయుడు ముద్రగడ బాలు



**ప్రత్తిపాడు, జూన్ 21 (ప్రభాత వార్త)** తన తండ్రి ముద్రగడ పద్మనాభం ఆరోగ్య పరిస్థితిపై ఆయన తనయుడు వీర రాఘవరావు (బాలు) మాట్లాడుతూ ప్రస్తుతం తన తండ్రి ఆరోగ్యం నిలకడగానే ఉందని ఆయన స్పష్టం చేశారు. నాయకులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని... పూర్తి ఆరోగ్యంతో ఆయన త్వరలోనే క్షేమంగా తిరిగి వస్తారని బాలు పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి.. ముద్రగడ అస్వస్థతకు గురైన విషయం తెలుసుకుని ఫోన్ ద్వారా ఆరోగ్య పరిస్థితిని అడిగి ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నారని ముద్రగడకు అత్యుత్తమ, మెరుగైన వైద్యం అందేలా చూడాలని, అందుకు అవసరమైన అన్ని రకాల ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షించాలని వైఎస్ జగన్ పార్టీ ముఖ్య నేతలను ఆదేశించినట్లు ఆయన కుటుంబ సభ్యులు వెల్లడించారు.

## చిన బొడ్డులో మురుగునీటి సమస్యతో

## మూడు కుటుంబాల మధ్య వివాదం.





**తాళ్లరేవు జూన్ 21 (ప్రభాతవార్త):** కాకినాడ జిల్లా తాళ్ళరేవు మండలం కోరంగి పంచాయితీ బొడ్డు చిన వెంకటాయపాలెం గ్రామంలో గృహాలలోని మురుగునీరుతో మూడు కుటుంబాల మధ్య వివాదం తలెత్తింది. ఎదురుగా ఉన్న రెండు కుటుంబాల మురుగునీరు తమ ఇంటి పెరట్లోకి వదిలేసారని గ్రామానికి చెందిన బొడ్డు భైరవ స్వామి, కృష్ణవేణి దంపతులు విలేకరులకు తెలిపారు. ఈ మురుగు నీరు దుర్వాసన వెదజల్లుతుందని మేము ఎలా జీవించాలని ఆదివారం విలేకరుల వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎదురుగా ఉన్న కుటుంబాలు రచ్చ ఏడుకొండలు, విజయలక్ష్మి, చెక్క బుచ్చిబాబు, మంగాదేవి లు విలేకరుల వద్ద తమ గోడు వినిపించారు. గత ఏడాదిగా మురుగునీరు బయటకు వెళ్లే దారి లేక ఇంటి ఆవరణలోనే ఉండిపోతుందని దీనివల్ల మా రెండు కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి పెరట్లోని నీరు అధికం కావడంతో మా ప్రహరీ గోడ తొలగించి తొలగించామన్నారు.ఈ సమస్యను గ్రామ పెద్దల పూర్వకంగా పరిష్కరించుకోవడానికి సిద్ధమని తెలిపారు.

## యోగాను నిత్యజీవితంలో భాగస్వామ్యం చేసుకోవాలి

### ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం : ఎంపీ పురందేశ్వరి



**రాజమహేంద్రవరం సిటీ, జూన్ 21( ప్రభాతవార్త)** యోగాను నిత్యజీవితంలో భాగస్వామ్యం చేసుకోవాలని రాజమండ్రి పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరి చెప్పారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని ఆదివారం నగరంలోని కోటిలింగాల ఘాట్ వద్ద ఘనంగా యోగా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి యోగాన్ని ఉత్తమ మార్గమని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రతిపాదనతో ఐక్యరాజ్యసమితి 2014లో జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం గా ప్రకటించిందని గుర్తు చేశారు. భారతీయ సంస్కృతికి ప్రత్యేక అయినా యోగ ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్యకరమైన జీవనశైలికి మార్గదర్శకంగా నిలుస్తుంది అని జిల్లా నలుమూల నుంచి వచ్చిన యోగ సాధకులు విద్యార్థులు ప్రభుత్వ ఉద్యోగులు వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సామూహికంగా యోగాసనాలు చేయడం ఆకట్టుకుందని అన్నారు. జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ యోగ సర్వరోగ నివారిణిగా పనిచేస్తుందని ప్రతిరోజు 45 నిమిషాల పాటు యోగ సాధన చేస్తే శారీరిక మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని తెలిపారు. ప్రాణాయామం ధ్యానం వల్ల ఒత్తిడి ఆందోళన తగ్గడంతో పాటు ఏకాగ్రత జ్ఞాపకశక్తి పెరుగుతాయని చెప్పారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ యోగా ద్వారా ప్రపంచ దేశాలు భారతదేశాన్ని విశ్వ గురువుగా గుర్తించని పేర్కొన్నారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థుల్లో మానసిక ధైర్యం ఏకాగ్రత పెంపొందించడంలో యోగాబ్యాసం కీలకమని చెప్పారు. ఈ కార్యక్రమంలో యోగ జిల్లా నోడల్ అధికారి జాయింట్ కలెక్టర్ వై మేఘ స్వరూప్, నగరపాలక సంస్థ కమిషనర్ రాహుల్ మీనా, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ ,గైట్ యూనివర్సిటీ చైర్మన్ రాజు, ప్రజా ప్రతినిధులు అధికారులు విద్యార్థులు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం



**రావులపాలెం, జూన్ 21:** అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని రావులపాలెం మండలంలోని రెడ్డి కళ్యాణ మండపంలో ఆదివారం యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజలు, అధికారులు, వివిధ శాఖల సిబ్బంది పాల్గొని యోగా ఆసనాలు అభ్యసించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ, యోగా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ప్రతిరోజూ యోగా చేయడం ద్వారా ఆరోగ్యవంతమైన జీవనం సాధ్యమవుతుందని తెలిపారు. ప్రజలు యోగాను తమ దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్యం కోసం యోగా చేయండి.



**రౌతులపూడి, జూన్ 21. (ప్రభాత వార్త)** ప్రజలందరూ ఆరోగ్యంగా జీవించాలంటే కుటుంబాలతో కలిసి యోగా చేయాలని పలువురు అధికారులు,ఉపాధ్యాయులు హితవు పలికారు.ఆదివారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాలలోను, ప్రభుత్వ కార్యాలయాలలోను, యోగా కార్యక్రమాలు నిర్వహించారు.యోగాట్చేయడం వలన ఆరోగ్యంతో పాటు ఆహ్లాదం కూడా కలుగుతాయని దీనితో పాటు మానసిక ఉత్సాహం కూడా లభిస్తుందని ఆయా పాఠశాలలో ఉపాధ్యాయులు ,గ్రామస్థులకు,విద్యార్థులకు తెలియజేశారు.

## సురేష్ నగర్ పార్కులో అంతర్జాతీయ యోగా దినోత్సవం వేడుకలు.......



**కాకినాడ రూరల్, జూన్ 21 (ప్రభాతవార్త):** అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని కాకినాడ రూరల్ నియోజకవర్గం పరిధిలో 2,3 డివిజన్ల లోని యోగా సభ్యులతో కలిసి సురేష్ నగర్ పార్కులో భారతీయ జనతా పార్టీ నాయకుడు తుమ్మలపల్లి నారాయణరావు ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ యోగా మండలి గురువులు హనుమంత్ రెడ్డి పర్యవేక్షణలో యోగా దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమంత్ రెడ్డి మాట్లాడుతూ యోగా సాధన తో మానసిక ప్రశాంతత శారీరక ఆరోగ్యం లభిస్తుందని, ప్రతి ఒక్కరిలో యోగ పై అవగాహన పెంచేందుకు యోగా శిక్షణ తరగతులను ప్రభుత్వం ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు, సీనియర్ బిజెపి నాయకులు పైడా కృష్ణమోహన్, బిజెపి రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీ ప్రసన్న చేతుల మీదుగా హనుమంత్ రెడ్డిను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సివిల్ సప్లై డైరెక్టర్ మాలకొండయ్య, బిల్డింగ్స్ కన్వీనర్ గట్టి సత్యనారాయణ, వంగా శేషు, అత్తిలి వీర్రాజు, తుమ్మలపల్లి వెంకటేశ్వరరావు, పక్కి మని బాల, పార్థసారథి అప్పాజీ తదితరులు పాల్గొన్నారు.

## వరి పంటకు ప్రత్యామ్నాయంగా పామాయిల్ సాగు



**రంపచోడవరం జూన్ 21 ప్రభాతవార్త.** రంపచోడవరం మండలం గోగుమిల్లి గ్రామంలో ఆదివారం పామాయిల్ సాగుపై రైతులకు అవగాహన సదస్సు ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ అధికారి ఎస్.రాంబాబు మాట్లాడుతూ, వరి పంటకు ప్రత్యామ్నాయంగా పామాయిల్ సాగుపై రైతులు ఆసక్తి చూపిస్తున్నారని అన్నారు. నీటి కొరత, పెరుగుతున్న సాగు ఖర్చుల నేపథ్యంలో రైతులు పామాయిల్ తోటల వైపు మొగ్గు చూపుతున్నారని తెలిపారు. ప్రభుత్వం పామాయిల్ సాగును ప్రోత్సహిస్తూ సబ్సిడీపై మొక్కలను, డ్రిప్ పరికరాలను అందజేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అగ్రికల్చర్ అసిస్టెంట్ తరుణ్ మాట్లాడుతూ పామాయిల్ సాగు విధానాలు, నిర్వహణ, ప్రభుత్వ ప్రోత్సాహకాలపై రైతులకు అవగాహన కల్పించారు. పతంజలి టెక్నికల్ ఆఫీసర్ తరుణ్ మాట్లాడుతూ పామ్ ఆయిల్ తోటలో వచ్చే తెగుళ్ల కొరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు లను,రైతులకు సూచనలను తెలిపారు. ఫినోలెక్స్ సంస్థ ప్రతినిధి సీతారామాంజనేయులు మాట్లాడుతూ ప్రభుత్వం డ్రిప్ పరికరాలను సబ్సిడీ రూపంలో రైతులకు అందజేస్తుందని వివరించారు. కార్యక్రమంలో పాల్గొన్న రైతులు బోడి వెంకటేశ్వరరావు కారం శ్రీరాములు మాట్లాడుతూ వరి, జీడి మామిడి పంటలు మానేసి పామాయిల్ తోటలు వేసుకున్నామని అనుభవాలను సదస్సుకు వచ్చిన రైతులతో వివరించారు. పలువురు రైతులు తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జ్ కిషోర్ బాబు, ఫీల్డ్ అసిస్టెంట్లు సాయిరాం, అప్పారావు, దుర్గాప్రసాద్ అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు



**కాట్రేనికోన, జూన్ 21(ప్రభాత వార్త)** అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని కాట్రేనికోన మండలంలోని వివిధ గ్రామ పంచాయతీలు, స్వర్ణ గ్రామాల్లో యోగా వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. కాట్రేనికోన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఎంపీడీఓ బి. రాజేశ్వర్ రావు ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులతో కలిసి యోగాసనాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యోగా మానవాళికి ఆరోగ్యాన్ని ప్రసాదించే గొప్ప జీవన విధానమని అన్నారు. ప్రపంచానికి భారతదేశం అందించిన అమూల్యమైన వారసత్వ సంపద యోగా అని కొనియాడారు. విశ్వగురు గా భారతదేశం ఎదగడంలో యోగా కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. ప్రతి ఒక్కరూ యోగాను తమ దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని, తద్వారా ఆరోగ్యవంతమైన భారతదేశ నిర్మాణానికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ ఎస్. శంకర్ నారాయణ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శి జె.వి. సత్యనారాయణ, గ్రామ పంచాయతీ సిబ్బంది, స్వర్ణ గ్రామ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 23న ఆర్థిక ప్రణాళిక తయారుపై శిక్షణకు హాజరుకండి



**రాజవొమ్మంగి, జూన్ 21, ప్రభాతవార్త**

రాజవొమ్మంగి మండలంలో గల 19 స్వర్ణ గ్రామ పంచాయతీలలో గల గ్రామసభలు 2026.27 సం. మండల పరిషత్ ఆర్థిక ప్రణాళిక తయారు నిమిత్తం 23 తేదీ శిక్షణ కార్యక్రమం ఉందని ఎంపిడిఓ లోకుల యాదగిరీశ్వరరావు తెలిపారు. శిక్షణ ఉదయం 9గం. నుండి సాయంత్రం 5 గం. వరకూ కొనసాగుతుందని అన్నారు. ఈ శిక్షణకు ఎంపిపి, జడ్పీటీసీ, ఎంపిటిసిలు, పంచాయితీ ప్రత్యేకాధికారులు, మండల స్థాయి అనుబంధ శాఖల అధికారులు, పంచాయతీ అభివృద్ధి అధికారులు, అన్ని సచివాలయాల డిజిటల్, ఇంజనీరింగ్ సహాయకులు, వి. ఓ ప్రతినిధులు హాజరు కావాలన్నారు.

## అపర దాన కర్ణుడు బసివి రెడ్డి చిరస్మరణీయుడు



**పెదపూడి.(ప్రభాతవార్త)** అపర దాన కర్ణుడు కొవ్వూరి బసివి రెడ్డి చేసిన సేవలు ప్రతి ఒక్క భారతీయుడు గర్వించదగ్గ విషయమని అటువంటి వ్యక్తిని స్మరించుకోవడం పూర్వజన్మ సుకృతమని విగ్రహ దాత చింతా దొరబాబు కుమారులు ప్రణవ్ రెడ్డి, అభినవరెడ్డిలు కొవ్వూరి బసివి రెడ్డి చేసిన సేవలను కొనియాడారు. పెదపూడి మండలం గొల్లలమామిడాడ గ్రామంలో శ్రీ సూర్యనారాయణ స్వామివారి దేవాలయముకు ఆనుకొని గ్రామస్తుల చింతా దొరబాబు చే ఏర్పాటుచేసిన కొవ్వూరి బసివి రెడ్డి కాంస్య విగ్రహానికి చింతా దొర బాబు కుమారులు ప్రణవ్ రెడ్డి, అభినవ్ రెడ్డిలు పూలమాలలు వేసి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేలాది ఎకరాల భూములను పేద ప్రజలకు దానం చేసి బసివి రెడ్డి పేట పేరుతో ఇప్పటికీ ఆ వ్యక్తి పేరుతో పేటలను నిర్మించడం గర్వకారణమని వారు పేర్కొన్నారు అటువంటి గొప్పవ్యక్తిని స్మరించుకోవడం తమ పూర్వజన్మ సుకృతం అని వారు వివరించారు.

# మానసిక శారీరక ప్రశాంతతకు యోగా, ధ్యానం తప్పనిసరి...

### ప్రపంచంలోనే అతి పెద్ద వశిష్ట పిరమిడ్ ధ్యాన కేంద్రం.... యోగా దినోత్సవం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బండారు..



**ఆత్రేయపురం, జూన్,21,(ప్రభాత వార్త)** ప్రపంచానికి భారతదేశం అందించిన గొప్ప వరం యోగా అని, ప్రపంచ దేశాల ప్రజలందరూ యోగాను ఆచరిస్తున్నారని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. వశిష్ట గౌతమి పిరమిడ్ ధ్యాన కేంద్రంలో జరిగిన అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమంలో ఆయన ఆర్డీఓ. జి. వి. వి. సత్యనారాయణ, డి.ఎస్.పి సుంకర మురళీమోహన్ వాడపల్లి దేవస్థానం చైర్మన్ ముదునూరి వెంకటరాజు, ఆకుల రామకృష్ణ, ముళ్ళపూడి భాస్కరరావు, మండల టిడిపి అధ్యక్షులు కుసంపూడి రామకృష్ణరాజులతో కలిసి పాల్గొన్నారు. యోగాసనాలు, ధ్యానంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుభాష్ పత్రీజీ మన ప్రాంతంలో ప్రపంచంలోనే అతి పెద్ద ధ్యాన పిరమిడ్ కేంద్రాన్ని నిర్మించి మనకు అందించడం గర్వకారణమన్నారు. వారు మన మధ్య లేకపోయిన సుభాష్ పత్రీజీ ఆశీస్సులతో వారి శిష్య బృందం యోగాడే ఇక్కడ నిర్వహించడం ప్రశంసనీయమన్నారు. యోగ, ధ్యానం అభ్యసించడం వల్ల అనేక ప్రయోజనాలున్నాయన్నారు. చక్కటి ఆరోగ్యకరమైన సమాజం సాధించడానికి యోగా ఉపయోగపడుతుందని, మానసిక ప్రశాంతత, శారీరక ఆరోగ్యం లభిస్తాయన్నారు. ప్రస్తుత కాలంలో ఉన్న మానసిక ఒత్తిడిలను జయించాలంటే, మనసును నియంత్రించాలన్నా యోగా తప్పనిసరని పేర్కొన్నారు.యోగాను ఈరోజు మాత్రమే చేసే ఒక వ్యాయామంగా కాకుండా నిత్య కార్యక్రమంగా అందరూ తమ జీవితంలో భాగం చేసుకోవాలన్నారు. ప్రధాని మోదీ, గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ యోగాను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లారన్నారు. మరి ముఖ్యంగా ప్రధాని మోదీ యోగాపై ప్రపంచవ్యాప్తంగా అందరికీ అవగాహన కలిగేలా చేశారన్నారు. విశ్వంలో ఉన్న సహజశక్తిని పిరమిడ్ ద్వారా మనం పొందగలుగుతామన్నారు. పిరమిడ్ లో ధ్యానం వల్ల మరింత శక్తిని శరీరం, మనసు పొందగలుగుతాయన్నారు. రాబోయే పుష్కరాలను పురస్కరించుకుని వచ్చే సంవత్సరం జిల్లా కలెక్టర్, అధికారులతో మాట్లాడి జిల్లాస్థాయిలో యోగా కార్యక్రమాన్ని వశిష్ట పిరమిడ్ కేంద్రం వద్ద నిర్వహించుకుందామన్నారు. పిరమిడ్ కేంద్రం అభివృద్ధి కోసం, ఈ ప్రాంత అభివృద్ధి కోసం సహాయ సహకారాలు అందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఆర్. డి. రామచంద్రమూర్తి, ఎంపీడీవో బి కే ఎస్ ఎస్ వెంకట రామన్, ఎస్సై. ఎస్. రాము,డిప్యూటీ ఎంపీడీవో రామకృష్ణంరాజు, రెవెన్యూ సీనియర్ అసిస్టెంట్ వినాయకుడు, మండల పరిపాలనాధికారి రామస్వరూప్, విద్యాశాఖ అధికారి పి.వి. ప్రసాద్ రావు, పీఈటీలు, గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామపంచాయతీ కార్యదర్శులు, సొసైటీ అధ్యక్షులు నాగిరెడ్డి సత్యనారాయణ, తోట రజిని, కంఠం చెట్టి శ్రీనివాస్, నరాల శెట్టి వెంకన్న, మెర్ల లక్ష్మీపతి, సుబ్బారావు, దాసరి రామాంజనేయులు, అత్తిలి సుబ్బారావు,కుటమి నాయకులు మండల వివిధ శాఖల అధికారులు విద్యార్థులు పాల్గొన్నారు.

## నిలువ నీడ లేని చోట.... రెండు బస్సు షెల్టర్లు నిర్మించిన ఎమ్మెల్యే దంపతుల ఔదార్యం



**రాజవొమ్మంగి, జూన్ 21, ప్రభాతవార్త** రాజవొమ్మంగి మండలంలో రెండేళ్ల క్రితం ప్రారంభమైన 516 ఈ జాతీయ రహదారి పనుల్లో బస్సు షెల్టర్లను తొలగించారు. రాజవొమ్మంగి మండల కేంద్రంలో ప్రతీ రోజూ నర్సీపట్నం, పాడేరు, అరకు, ఏలేశ్వరం వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు నిలువ నీడ లేక ఇబ్బందులు పడ్డారు. మహిళలు మరుగుదొడ్ల సౌకర్యం లేక సమస్యను ఎదుర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో రంపచోడవరం ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్ పర్సన్, మిరియాల శిరీషాదేవి, విజయ్ భాస్కర్ దంపతులు వారి సొంత సొమ్ములుతో రాజవొమ్మంగి మండల కేంద్రంలో జాతీయ రహదారి ప్రక్కనే బస్సు షెల్టర్ లో మరుగుదొడ్ల సౌకర్యంతో నిర్మించడం జరిగింది. రంపచోడవరం ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్ పర్సన్ శిరీషహ దేవి తండ్రి స్వర్గీయ మిరియాల బాబూరావు వారి జ్ఞాపకార్థం ఈ బస్సు షెల్టర్ ఏర్పాటు చేశారు. ""మహిళలు ఆత్మ గౌరవం కోసం' అనే నినాదం బస్సు షెల్టర్ పై వ్రాయడం జరిగింది. ఇంకో బస్సు షెల్టర్ దూసరపాము.. కింద్ర జంక్షన్ 516 ఈ జాతీయ రహదారి ప్రక్కనే సొంత సొమ్ములుతో ఎమ్మెల్యే శిరీషాదేవి మామయ్య, కింద్ర మాజీ సర్పంచ్ స్వర్గీయ మఠం జోషి జ్ఞాపకార్థం బస్సు షెల్టర్ ను నిర్మించడం జరిగింది. ఈ జంక్షన్ నుండి లబ్బర్తి, లాగరాయి, కింద్ర, కిర్రాబు, గడుఓకుర్తి పంచాయితీల్లో గల 25 గ్రామాల ప్రజలకు ఉపయోగకరం. బయట ప్రాంతాలకు వెళ్ళాలన్నా, స్వస్థలాలకు చేరుకోవాలన్నా, బస్సు, వాహనాలు వచ్చే వరకూ ఉండటానికి బస్సు షెల్టర్ నీడ నిస్తాది. ఎండ, వాన, గాలులు వేసినా ఉండటానికి బస్సు షెల్టర్స్ దోహదపడతాయి. జాతీయ రహదారిలో ప్రయాణం చేసే ద్విచక్ర ప్రయాణికులు కూడా కొద్ది సేపు అలసట తీర్చుకొని వెళ్ళడానికి బస్సు షెల్టర్స్ దోహదపడతాయి. ఈ రెండు బస్సు షెల్టర్స్ అధికారికంగా ప్రారంభించాల్సి ఉంది. వెల కట్టలేని ప్రజాసేవకు ఈ బస్సు షెల్టర్స్ నిదర్శనమని ప్రజలు ఎమ్మెల్యే దంపతులను ప్రశంసిస్తున్నారు. అభినందనలు వెలువెత్తుతున్నాయి..

## రాజవొమ్మంగిలో అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమం



**రాజవొమ్మంగి, జూన్ 21, ప్రభాతవార్త** రాజవొమ్మంగి మండల కేంద్రంలో గల జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఎంపిడిఓ లోకుల యాదగిరేశ్వరరావు అధ్యక్షతన అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమం ఆదివారం ఉదయం జరిగింది. యోగా. ప్రతీ ఒక్కరూ నిత్య జీవనంలో ఒక భాగం కావాలని ఎంపిడిఓ యాదగిరేశ్వరరావు, ఎం. ఈ. ఓ కె. వి. వి. సత్యనారాయణదొర అన్నారు యోగా చేసే పద్ధతులను పి. డి, పి. ఈ. టి లు పాల్గొన్న వారికి వివరించి చేయించారు. యోగాలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు, మెమోంటోలను ఇచ్చి అభినందించారు. ఈకార్యక్రమంలో ఎంపిడిఓ లోకుల యాదగిరేశ్వరరావు, ఎం. ఈ. ఓ. కె. వి. వి. సత్యనారాయణదొర, హెచ్. ఎం. ఆదిలక్ష్మి, గొల్లపూడి పెద్దిరాజు, బోదిరెడ్డి త్రిమూర్తులు, గణజాల తాతారావు, వాసంశెట్టి గంగాధర్, సి. ఆర్పీ శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు

## గణిత ఫారం అధ్యక్షునికి సన్మానం



**అయినవిల్లి జూన్ 21 ప్రభాతవార్త** వీరవల్లిపాలెం గణిత ఉపాధ్యాయులు శ్రీ మోర్తా నాగ సూర్యనారాయణ జిల్లా నూతన ఏపీ గణిత ఫారం అధ్యక్షులుగా ఎన్నిక కాబడిన సందర్భంగా పుల్లేటికుర్రు విజయానంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు కత్తుల ఆనందరావు ఆధ్వర్యంలో ఆదివారం అయినవిల్లి మండల పరిషత్ కార్యాలయం వద్ద అయినవిల్లి మండలం మండల రిసోర్ సెంటర్ నందు ఘన సన్మానం జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అయినవిల్లి మండల విద్యాశాఖ అధికారి ఎం శ్రీనివాస్ ముఖ్య అతిథిగా మాట్లాడుతూ సూర్యనారాయణ మాస్టర్ సేవలు అభినందిస్తూ మరింత ఉన్నత పదవులు పొంది ఉపాధ్యాయులకు సేవలందిస్తూ విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించాలని సూచించారు. ఈ సన్మాన కార్యక్రమంలో వీరవల్లి పాలెం పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏ శ్రీనివాసరావు , అల్లవరం మండల విద్యాశాఖ అధికారి కిరణ్ బాబు గణిత అవధానులు పివి సూర్యనారాయణ ఎస్సీ వెల్ఫేర్ జిల్లా అధ్యక్షులు గోసం గి బంగారు రాజు, వై ఆర్ కె నాగేశ్వరరావు, ఎస్సీ వెల్ఫేర్ అయినవిల్లి మండల శాఖ అధ్యక్షులు నేరేడుమిల్లి సత్యనారాయణ, యుటిఎఫ్ నాయకులు బీర సందీప్, ఎస్ టి యు నాయకులు నక్కా ఏకాంబరం, రాష్ట్ర ఉగాది పురస్కార అవార్డు గ్రహీత నల్ల నర్సింహమూర్తి, శ్రీ శ్రీ కళావేదిక కన్వీనర్ సత్యనారాయణ, మరియు అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రియదర్శినిలో ఘనంగా యోగా వేడుకలు



**కొత్తపేట, జూన్ 21,(ప్రభాతవార్త)** ప్రియదర్శిని బాలవిహార్ స్కూల్లో 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉదయం 6 గంటల నుండి 8 గంటల వరకు వేడుకలను నిర్వహించారు కలకత్తాలోని రెడ్ రోడ్డు ప్రాంతంలో గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలో జరిగిన 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని డిజి క్లాస్ లో లైవ్ లో అక్కడమిక్ డైరెక్టర్ అద్దంకి సాహిత్య నేతృత్వంలో వీక్షిస్తూ యోగాసనాల అభ్యసన శిక్షణ ప్రదర్శన కార్యక్రమాన్ని అత్యంత ఆనందోత్సాహాలతో నిర్వహించారు తదుపరి చిన్నారులు అనేక ఆసనాలను విభిన్న రీతులలో ప్రదర్శించారు ఈ కార్యక్రమంలో ప్రియదర్శిని చిన్నారులు ఉపాధ్యాయులు అత్యంత శ్రద్ధాసక్తులతో పాల్గొన్నారు ఈ సందర్భంగా స్కూలు కరస్పాండెంట్ అద్దంకి బుద్ధ చంద్ర దేవ్ యోగ ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు

## వైకాపా రైతు విభాగం రాష్ట్రకార్యదర్శిగా పెట్ల సూర్యనారాయణరాజు



**.తాళ్లరేవు, జూన్ 21 (ప్రభాతవార్త) :** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శిగా మండలంలోని జార్జిపేట ఎం ఎల్ కె నగర్ కి చెందిన సీనియర్ వైసీపీ నాయకులు, వ్యవసాయ శాఖ విశ్రాంతి జె.డి. పెట్ల సూర్యనారాయణ రాజును నియమించారు. ఈ మేరకు రాష్ట్ర పార్టీ కార్యాలయం నుండి ఉత్తర్వులు అందినట్లు ఆయన ఆదివారం స్థానిక విలేకరులకు తెలిపారు. వ్యవసాయ శాఖలో జాయింట్ డైరెక్టర్ గా పనిచేసి పదవీ విరమణ పొందిన సూర్యనారాయణ రాజు వైకాపా ఆవిర్భావం నుండి పార్టీ పట్ల అంకితభావంతో పనిచేస్తున్నారు. ఆయన భార్య పెట్ల శాంత కుమారి తో కలిసి ముమ్మిడివరం నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధికి కీలకంగా వ్యవహరించారు. దీంతో పార్టీ అధిష్టానం ఆయనకు రాష్ట్ర కార్యదర్శి పదవి ఇచ్చి గౌరవించింది. ఆయన ముమ్మిడివరం నియోజకవర్గ మేధావుల విభాగం అధ్యక్షులుగా పనిచేస్తున్నారు. తనను గుర్తించి రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శిగా నియమించిన పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, రీజనల్ కో ఆర్డినేటర్ బొత్స సత్యనారాయణ, డా బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి, కో ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్, సీఈసీ సభ్యులు పితాని బాలకృష్ణ, రైతు విభాగ రాష్ట్ర అధ్యక్షులు జున్నూరి బాబి, ఎస్ఇసి సభ్యురాలు కాశి మునికుమారి లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. నమ్మకంతో అప్పగించిన ఈ బాధ్యతలకు పూర్తి స్థాయిలో న్యాయం చేసి రాష్ట్రస్థాయిలో తనవంతుగా పార్టీ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానని తెలిపారు.

## పిడుగుపాటుకు రెండు పాడి గేదెల మృతి.



**కాట్రేనికోన జూన్ 21(ప్రభాతవార్త)** కాట్రేనికోన మండలం కందికుప్ప గ్రామంలో శనివారం రాత్రి భారీ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఈ సందర్భంగా పిడుగు పడటంతో గ్రామానికి చెందిన రైతు కూరాకుల మల్లేశ్వరరావుకు చెందిన రెండు పాడి గేదెలు అక్కడికక్కడే మృతి చెందాయి. పాల ఉత్పత్తితో జీవనం సాగిస్తున్న మల్లేశ్వరరావుకు ఈ ఘటన తీవ్ర ఆర్థిక నష్టాన్ని మిగిల్చింది. కన్నబిడ్డల్లా చూసుకుంటూ జీవనాధారంగా ఉన్న గేదెలు మృతి చెందడంతో ఆయన బోరున విలపిస్తూ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సంఘటనపై ప్రభుత్వం, స్పందించి పశుసంవర్ధక శాఖ అధికారులు నష్టాన్ని అంచనా వేసి తగిన పరిహారం అందించి ఆదుకోవాలని రైతు మల్లేశ్వరరావు విజ్ఞప్తి చేస్తున్నారు. గ్రామస్థులు కూడా బాధిత రైతుకు ప్రభుత్వ సహాయం అందించాలని కోరుతున్నారు.

## యోగా" నిత్య జీవితంలో భాగం కావాలి..



**అంబాజీపేట,(పి.గన్నవరం), జూన్ 21, (ప్రభాతవార్త):** "యోగా" ప్రతి ఒక్కరి నిత్య జీవితంలో భాగం కావాలని, యోగా పుట్టినిల్లు భారత్ వైపు ప్రపంచ దేశాలు చూస్తున్నాయని, భారతదేశం మొత్తం ఏపీ వైపు చూస్తుందని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవంను పి.గన్నవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు ఉమాదేవి ఆధ్వర్యంలో యోగా శిక్షకులు ఎమ్మెల్యే తో పాటు కూటమి శ్రేణులు, విద్యార్థులు, వివిధ శాఖల అధికారులు, స్థానిక ప్రజల చేత యోగాసనాలు వేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గిడ్డి మాట్లాడుతూ భారతదేశం అందించిన యోగా సంప్రదాయాన్ని ప్రపంచవ్యాప్తంగా విస్తరింపజేసి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకువచ్చిన ప్రధాని నరేంద్ర మోడీ, రాష్ట్రంలో యోగా ప్రాచుర్యానికి విశేష కృషి చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ప్రతి ఒక్కరు యోగా సాధన చేయడం ద్వారా శారీరక,మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి యోగా ఎంతగానో ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ తెలిపారు.. అనంతరం పాఠశాల విద్యార్థులచే ఆలపించిన గీతాలు, యోగాసనాలు,నృత్య ప్రదర్శన అలరించాయి. ఈ కార్యక్రమంలో ఎంఈఓ కోన హెలీనా, ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, టిడిపి మండల శాఖ అధ్యక్షురాలు పత్తిపాటి ఉమామహేశ్వరి, నాయకులు తాటికాయలు శ్రీను, ఆదిమూలం సూర్యనారాయణమూర్తి, మైపాల తాతాజీ, గిడ్డి ఆనంద్, బొరుసు సూరిబాబు, వివిధ శాఖల అధికారులు, విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

## చింతూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం



**చింతూరు, జూన్ 21 ప్రభాత వార్త :** చింతూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె. రత్న మాణిక్యం తెలిపారు . ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్ చార్జ్ ప్రిన్సిపల్ జి.వెంకట్రావు మరియు జూనియర్ కళాశాల అధ్యాపకులు పి. చంద్రశేఖర్, పి.రాము ముఖ్య అతిథులుగా విచ్చేసి విద్యార్థుల ఉద్దేశించి మాట్లాడుతూ ఆరోగ్యం కోసం మనం వెలకట్టలేని ఔషధం యోగా అని, మనిషి దైనందిన జీవితంలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి కొంత సమయాన్ని వెచ్చించలేకపోవడం దురదృష్టకరమన్నారు. ప్రతిరోజు యోగాసనాలు చేయడం ద్వారా ఆరోగ్యంగాను,ఉల్లాసంగాను ఉత్సాహంగాను ఉంటామని ఇప్పటినుంచైనా విద్యార్థులందరూ ప్రతిరోజు 30 నిమిషాలు యోగా చేసి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని తెలియజేశారు. అధ్యాపకులు మరియు విద్యార్థినీ విద్యార్థులు ఈ కార్యక్రమంలో ఉత్సహంగా పాల్గొని యోగాసనాలు వేశారు.ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ ముల్లిశేఖర్, యోగ ట్రైనర్ ఆర్.మౌనిక, డా. వై.పద్మ, డా.కె.శకుంతల, జి.హారతి, ఎస్. అప్పనమ్మ, కె.శైలజ, బి. శ్రీనివాసరావు,ఎన్. ఆనంద్, కె.లక్ష్మీ ప్రసన్న, ఆర్.కిరణ్మయి, వి.శీనయ్య, ఎన్. కన్నయ్య, పి.రంగమ్మ, మంగయ్య, అధ్యాపకేతర సిబ్బంది మరియు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## సఖినేటిపల్లి యువతి నరసాపురంలో దారుణ హత్య



**సఖినేటిపల్లి జూన్ 21, ప్రభాత వార్త:** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, సఖినేటిపల్లి మండలం సఖినేటిపల్లి గ్రామానికి చెందిన వివాహిత ఆదివారం ఉదయం పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురంలో దారుణ హత్యకు గురైంది. సఖినేటిపల్లి లాకుపేటకు చెందిన జాలెం టీనారోజా(31) సూళ్లూరుపేట నుండి రైలులో ప్రయాణించి నరసాపురంనకు ఆదివారం ఉదయం చేరుకుంది. రైల్వే స్టేషన్ నుండి కారులో స్వగ్రామం సఖినేటిపల్లికి చేరుకునే ప్రయత్నంలో అదే కారులో మాట్లాడే పనిఉందని కారులో ప్రవేశించి సఖినేటిపల్లి లంక గ్రామానికి చెందిన మార్గాని రమేష్ ఆమెపై కత్తితో దాడి చేసి హత మార్చారు. అడ్డుకున్న డ్రైవర్ సురేష్ కు సైతం గాయాలు కాగా స్థానిక నర్సాపురం హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నారు. మృతురాలు టీనా రోజాకు ఇద్దరు సంతానం కాగా, ఆమె భర్త మామిడికుదురు మండలం నగరం గ్రామం, ఆమె సూళ్లూరుపేట లోని ఒక నర్సింగ్ కళాశాలలో ఏఎన్ఎం చేస్తుందని కుటుంబ సభ్యులు తెలుపుతున్నారు. నరసాపురం పోలీసులు నుండి హత్యా సమాచారాన్ని కుటుంబ సభ్యులు తెలుసుకోవడంతో గ్రామంలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. హత్యకు చేసేందుకు గల కారణాలు తెలియాల్సివుంది. వివాహేతర సంబంధమే హత్యకు కారణమా అన్న కోణంలో విచారణ సాగుతున్నట్లు ప్రాథమిక సమాచారం. హత్యకు గురైన టీనారోజా తల్లి పమ్మి దయామణి. ఆమె విశ్రాంత ఉపాధ్యాయురాలు, పెళ్లి చేసుకోకుండా కూతురిగా టీనారోజాను దత్తత్తు తీసుకోని చదివించి, మామిడికుదురు మండలం నగరం గ్రామానికి చేసిన జాలెం నవీన్ కుమార్ తో సుమారు 12ఏళ్ల క్రితం పెళ్లి చేసింది. భార్యభర్తల మధ్య చిన్నపాటి సమస్యలతో గత కొన్నేళ్లుగా ఎవరి ఇంటి దగ్గర వారు ఉంటున్నారు. నవీన్ కుమార్ పిల్లలను చూసేందుకు తరచుగా వచ్చి వెళ్తారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం తన కుమార్తె హత్యకు గురైందన్న పిడుగులాంటి సమాచారం తెలిసిన నాటి నుండి దయామణిని ఓదార్చడం ఎవరి తరమూకావడం లేదు. పెంచిన కుమార్తె మరణించడంతో తాను అనాధగా మారానని, వృద్ధాప్యంలో తోడుకోసం పెంచుకొన్న కుమార్తెను కడముట్టించారని, తనకు, తన మనవళ్లకు దిక్కెవరని దయామణి రోదించడం చూపరులను సైతం కన్నీరుపెట్టిస్తుంది. రాజోలు సీఐ సురేష్ బాబు, సఖినేటిపల్లి ఎస్సై దుర్గా శ్రీనివాస్ దయామణి వద్దకు, హంతకుడు మార్గాని రమేష్ ఇంటికి వెళ్లి విచారించి వివరాలు తీసుకొన్నారు. ప్రాథమిక విచారణ చేస్తున్నామని, హత్యకేసు విచారణ నర్సాపురం పోలీసులు పరిధిలోనిదని ఎస్సై దుర్గా శ్రీనివాస్ తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో లారీ ఢీకొని బాలుడు మృతి..

### కొర్లపాటివారిపాలెంలో విషాదచాయలు..





**అంబాజీపేట, జూన్ 21, (ప్రభాతవార్త):** మండలంలోని గంగలకుర్రు–మొసలపల్లి రహదారిలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో స్కూటర్ను ఎదురుగా వస్తున్న ఇసుక లారీ బలంగా ఢీ కొట్టడంతో ఓ బాలుడు మృతి చెందగా, మరో బాలుడికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మొసలపల్లి టర్ఫ్ (వంతెన)కు కూతవేటు దూరంలో అంబాజీపేట కొర్లపాటివారిపాలెంకు చెందిన నందెపు ప్రణీత్ నాగ (ఫణి) (14), నల్లా సుభాష్ లు స్కూటర్ పై గంగలకుర్రు నుండి అంబాజీపేట వైపు వస్తుండగా పుల్లేటికుర్రు నుండి గంగలకుర్రు వైపు వెళ తున్న ఇసుక లారీ ఎదురుగా వచ్చి బలంగా ఢీ కొట్టిందన్నారు. దాంతో ప్రణీత్ నాగ అక్కడికక్కడే మృతి చెందగా సుబాష్ కు తీవ్రగాయాలు కావడంతో అమలాపురం ఆస్పత్రికి తరలించారు. మృతుడికి తండ్రి, తల్లి,చెల్లి ఉన్నారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ప్రమాద వివరాలను నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని అమలాపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు.అప్పటి వరకు ఇంటి వద్ద కుటుంబ సభ్యులతో ఆనందంగా గడిపిన ప్రణీత్ నాగ బయటకు వెళ్లిన కొంత సమయానికే మృతి చెందాడనే దుర్వార్త వినడంతో ఆ కుటుంబ సభ్యుల రోదన పలువురిని కలచి వేసింది. మృతుడు స్థానిక సెంటీమేరీస్ లో 9వ తరగతి చదువుతున్నాడు. ఫణి ఆకస్మిక మృతి చెందడంతో కొర్లపాటివారిపాలెంలో విషాదఛాయలు అలుముకున్నాయి.మృతుడి తండ్రి రామకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## ప్రజలకు రెవెన్యూ సేవలు అందించడంలో మరింత కృషి చేయాలి : తాసిల్దార్ బాలాజీ



**రంపచోడవరం, జూన్ 21: ప్రభాతవార్త.** పోలవరం జిల్లాలో ప్రతి రెవిన్యూ కార్యాలయంలోని పనిచేయుచున్న రెవెన్యూ శాఖ ఉద్యోగులు ఈ ప్రాంత ప్రజల సమస్యలు పరిష్కరించే విధంగా మనందరం కలిసి ముందుకు సాగాలని పోలవరం జిల్లా రెవిన్యూ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ ఫయాజ్ భాష (జిలాని) పేర్కొన్నారు. ఆదివారం స్థానిక మండల తాసిల్దార్ కార్యాలయ ప్రాంగణంలో రెవిన్యూ డే వేడుకల సందర్భంగా ముఖ్య అతిథులు తాసిల్దార్ సిహెచ్.బాలాజీ, అమ్మాజీ కేక్ కట్ చేసి వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రంపచోడవరం తాసిల్దార్ సిహెచ్ బాలాజీ మాట్లాడుతూ నూతన పోలవరం జిల్లాలో రెవెన్యూ శాఖ ద్వారా ఈ ప్రాంత ప్రజలకు ప్రభుత్వ నిబంధన ప్రకారం వివిధ రకాలైన సేవలందించే విధంగా మన రెవిన్యూ శాఖ అందరం కలిసి ముందుకు సాగాలని ఆయన అన్నారు. జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, రెవెన్యూ డివిజనల్ అధికారి ఆదేశాలను ఎప్పటికప్పుడు పాటించి ఈ ప్రాంత అభివృద్ధికి రెవెన్యూ శాఖ ద్వారా తగు చర్యలు చేపట్టడం జరుగుతుందని ఆయన అన్నారు. మారేడుమిల్లి మండల తాసిల్దార్ అమ్మాజీ మాట్లాడుతూ మారుమూల ప్రాంతాలలోని గిరిజనులకు వివిధ రకాలైన అభివృద్ధి పథకాలు ఎప్పటికప్పుడు చేరవేసే బాధ్యత మనందరిపై ఉందని ఆమె అన్నారు. మన మండలాల్లోని వివిధ రకాలైన రెవెన్యూ సేవలు ప్రభుత్వ నిబంధనల అమలు పరచడం జరుగుతుందని ఆమె అన్నారు. రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షులు ఫయాజ్ భాష (జిల్లాని) మాట్లాడుతూ నూతన పోలవరం జిల్లాలో రంపచోడవరం, చింతూరు డివిజన్లో రెవెన్యూ అసోసియేషన్ ఎన్నికలు వచ్చే నెలలో నిర్వహించేందుకు జిల్లా కలెక్టర్ తో సంప్రదించడం జరుగుతుందని ఆయన అన్నారు. రెవెన్యూ డే సందర్భంగా రెవెన్యూ శాఖలో పనిచేసి గతంలో రిటైర్డ్ అయిన సూర్యనారాయణకు, ఆదినారాయణ కు సాల్వాలతో, పూలదండలతో సత్కరించి సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ సునీత, మండల సర్వే లక్ష్మణ్,రెవిన్యూ ఇన్స్పెక్టర్లు సిహెచ్ నిర్మల, ఏసుబాబు, టి. లక్ష్మణరావు, వెంకటేశ్వర్లు దొర (రాజు) అలెగ్జాండర్, మాధురి కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు, వీఆర్ఏలు తదితరులు పాల్గొన్నారు.

## ఔనో మొహమ్మద్‌కు ఘన నివాళి



**మామిడికుదురు.జూన్ 21(ప్రభాతవార్త)** మొహర్రం సంతాప కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం నగరం, మామిడికుదురు గ్రామాల్లో ఉదయం నుంచి మజ్లిస్ లు జరిగాయి.స్థానిక బార్గాహే ఖాయం పంజాలో హజ్రత్ ఇమామ్ హుస్సేన్ సోదరి బీబీ జైనబ్ తనయులు ఔనో,మొహమ్మద్ లు వీర మరణం పొందిన సంఘటనను స్మరిస్తూ మజ్లిస్ జరిగింది. అనంతరం పీర్లను తీసి నౌహాలను ఆలపిస్తూ మాతం చేస్తూ గ్రామ పురవీధుల్లో ఊరేగించారు.దారి పొడవునా అనేక భక్త బృందాల ఆధ్వర్యంలో ప్రసాద వితరణ జరిగింది.ఈ మజ్లిస్ లో మౌలానా మొల్లా అబ్బాస్ అలీ కర్బలా పుణ్య భూమిలో ఔనో మొహమ్మద్ వీరమరణం పొందిన సంఘటనను భక్తులకు వివరించారు.భక్తులు కన్నీరు,మున్నీరుగా విలపించారు.

## సూర్యారావు కవితలు ప్రజా గుండె చప్పుళ్ళు



**పెద్దాపురం, జూన్ 21 (ప్రభాత వార్త )** కామ్రేడ్ యాసలపు సూర్యారావు కవితలు అన్ని ప్రజల గుండెల చప్పుళ్ళని మాజీ మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబు రాజు అన్నారు. యాసలపు సూర్యారావు 14వ వర్ధంతి సందర్భంగా సాహితీ స్రవంతి ప్రజానాట్యమండలి సంయుక్తంగా నిర్వహించిన కవిత గోష్టికి రాజా సూరిబాబు రాజు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో సాహితీ జిల్లా అధ్యక్షులు జోస్యుల కృష్ణబాబు అధ్యక్షతన సభ జరిగింది. కవులు అందరు రచించిన కవితా సంకలనం గుండె చప్పుళ్ళు ను అయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజా సూరిబాబు రాజు మాట్లాడుతూ సూర్యారావు ఎపుడు ప్రజల పక్షాన నిలబడ్డారని అన్నారు. ప్రజలకోసమే నిత్యం పనిచేసిన మహానుభావుడు అన్నారు. ప్రతీ కవితలోనూ ప్రజలు, ప్రజల కష్టాలు ప్రతిపండించాయని తెలిపారు. విశ్రాంత ప్రిన్సిపాల్ రెంటల శ్రీవేంకటేశ్వరరావు కవిత్వం ఎలా ఉండాలి అనే అంశం పై ఉపన్యాసం ఇచ్చారు. ఈ కార్యక్రమం లో యు టీ ఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి ప్రభాకర వర్మ, సాహితీ స్రవంతి గౌరవ అధ్యక్షులు చల్లా విశ్వనాథం, ప్రజానాట్యమండలి అధ్యక్ష కార్యదర్శులు రామిశెట్టి సుబ్రమణ్యం, రొంగల వీర్రాజు, సాహితి స్రవంతి కార్యదర్శి కొత్త శివ, కోశాధికారి వంగలపూడి శివకృష్ణ, సహాయ కారదర్శి పూడి శ్రీనివాస్, సిపిఎం నాయకులు క్రాంతినకుమార్, నీలపల సూరిబాబు, కేదారి నాగు, శ్రీనివాస్, పవన్, మణికంఠ, రమేష్, పెంటయ, అరుణ, సావిత్రి, తదితరులు పాల్గొన్నారు.ప్రజానాట్యమండలి కళాకారులూ రవిచంద్ర, వీరాజు, సత్యనారాయణ, రాంబాబు అభ్యుదయ గీతాలు ఆలపించారు.

## యోగ ఆధ్యాత్మిక వికాసానికి మార్గదర్శనం.



**అయినవిల్లి జూన్ 21 ప్రభాతవార్త** యోగ ఆరోగ్యానికి మాత్రమే కాక మానసిక ప్రశాంతతకు ఆధ్యాత్మిక వికాసానికి మార్గదర్శమని స్వామి వివేకానంద సేవాసమితి సభ్యులు గనిశెట్టి వెంకటేశ్వరరావు తెలిపారు

అయినవిల్లి మండలం కే జగన్నాథపురం గ్రామం హై స్కూల్ ఆవరణలో 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా హై స్కూల్ హెడ్ మాస్టర్ జి సూర్య కుమారి గ్రామ సెక్రెటరీ కె వెంకన్న సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన యోగా దినోత్సవంలో శెట్టివెంకటేశ్వరరావు తెలిపారు కళాశాల డ్రిల్ మాస్టారు కలిసి గ్రామంలోని యువకులకు విద్యార్థిని విద్యార్థులకు ఉపాధి సేవకులకు అంగన్వాడీ టీచర్స్ డ్వాక్రా మహిళలు చేత యోగ ఆసనములు సూర్య నమస్కారములు చేయించా రు ఈ సందర్భంగా బాబీ మాస్టారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ యోగా తమ దినచర్యలో భాగం చేసుకుని ఆరోగ్యంవంతమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని అన్నారు ఈ కార్యక్రమంలో వీఆర్వో సత్యనారాయణ హై స్కూల్ టీచర్స్ ఫీల్డ్ అసిస్టెంట్ ఎం రమణ యనమదల వెంకటరమణ మిద్దె నూతన్ రవి రాజు కడలిపెద్ద బుట్టే సత్యనారాయణ గొల్ల కోటి కృష్ణారావు రాయుడు రవణతదితరులు పాల్గొన్నారు

మరిన్ని వార్తలు 6లో

# మత్స్యకారులకు పంట పండింది

## 15 కచట చేపలు...



**సఖినేటిపల్లి జూన్ 21, ప్రభాత వార్త:** డా బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, సఖినేటిపల్లి మండలం అంతర్వేది పల్లిపాలెం మినీ ఫిషింగ్ హార్బర్ లో మూడు రోజులకు 15 కచాడా చేపలు లభించినవి, ఒక్కు చేప ఖరీదు 50 వేల రూ.ల చొప్పున అమ్మినట్టు జాలర్లు తెలిపారు. ఇవి మెడిసిన్ కు ఉపయోగ పడతాయని తీయజేశారు.

## కన్నుల పండుగగా మాధవరాయునిపేట ధనమ్మ తల్లి తీర్థం.



**తాళ్లరేవు, జూన్ 21: ప్రభాతవార్త** కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలంలోని తాళ్లరేవు మాధవరాయుని పేట గ్రామ దేవత ధనమ్మ తల్లి తీర్థ మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. గత వారం రోజులుగా సాగుతున్న ఈ ఉత్సవాలలో భాగంగా శనివారం జాతర నిర్వహించగా, ఆదివారం అమ్మవారి తీర్థ మహోత్సవం కన్నుల పండుగగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారి గరగలు తాళ్లరేవు పురవీధుల్లో యువతి, యువకుల కేరింతల మధ్య ఉత్సాహంగా ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. తీర్థ మహోత్సవాల్లో భాగంగా గరగల బృందం నృత్యం, కాళికాదేవి ఆదిశక్తి వేషములు అలరించాయి. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన అక్షిష్ఠ బృందం పాడిన పాటలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పూజారులు దంగేటి మునలయ్య, వల్లు కనకం, ధనమ్మ తల్లి ఉత్సవ కమిటీ ప్రతినిధులు పిల్లి కొండ, పిల్లి పరదేశ్వర రావు, చింతపల్లి బుజ్జి, కుడుపూడి మల్లేశ్వరరావు, గుబ్బల లోవరాజు, పితాని రాము, చింతపల్లి నాని, పిల్లి చిన్న, చిట్టూరి లక్ష్మణ్, పితాని ప్రసాద్, గణేష్, యూత్ సభ్యులు, గ్రామ ప్రజలుతోపాటు, పరిసర ప్రాంత ప్రజలు తీర్థానికి పెద్ద ఎత్తున తరలి రావడంతో తాళ్లరేవులో ఆదివారం రాత్రి ఆహ్లాదకర వాతావరణంలో సందడి నెలకొంది.

## ఘనంగా భారతీయ విద్యా కేంద్రం 69వ ఆవిర్భావ దినోత్సవం



**కె. గంగవరం, జూన్ 21, (ప్రభాతవార్త):** కె గంగవరం మండలం కోటిపల్లి విజ్ఞాన భారతి పాఠశాలలో 69వ భారతి విద్యా కేంద్రం ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించబడినవి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కర్రి చిట్టిబాబు పాల్గొన్నారు. భారతి విద్యా కేంద్రం గొప్పదనం గురించి, సేవలు గురించి భారతీయుల విలువలు బోధించే విశిష్ట సంస్థ అని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ కరస్పాండెంట్ బి శివరావు,ప్రధానోపాధ్యాయులు విష్ణు, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు స్థానికులు ప్రజలు విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఆరోగ్యవంతమైన జీవన శైలికి మార్గదర్శనం యోగా సాధన...!

**కూనవరంలో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం కార్యక్రమం**



**కూనవరం, జూన్ 21, ప్రభాతవార్త :** అంతర్జాతీయ యోగా దినోత్సవంను పురస్కరించుకొని పోలవరం జిల్లా కూనవరం మండలంలోని పలు విద్యా సంస్థల నందు యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కోతుల గుట్ట వద్ద నున్న కే.జి.బి.వి పాఠశాల ప్రాంగణంలోనూ, టేకులబోరు ప్రైవేట్ విద్యా సంస్థ మాంటిస్సోరి నందు యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల స్థాయి అధికారులు, రాజకీయ ప్రముఖులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు యోగా కార్యక్రమంలో పాల్గొని సాధన చేశారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు, వివిధ రాజకీయ పక్షాల వారు మాట్లాడారు.యోగా కేవలం వ్యాయామం మాత్రమే కాదని, ఆరోగ్యవంతమైన జీవనశైలికి మార్గదర్శమని అన్నారు. వయస్సుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ యోగ సాధన చేయాలని కూడా అన్నారు. యోగా ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని తెలిపారు. కోతులగుట్ట కె.జి.బి.వి పాఠశాల వద్ద నిర్వహించిన యోగా కార్యక్రమంలో స్థానిక ఎంపీడీవో ఆశీర్వాదం, డిప్యూటీ ఎంపీడీవో జగన్నాథరావు, మండల తెలుగుదేశం అధ్యక్షులు యడవల్లి భాస్కరరావు, బీజేపీ నాయకులు నోముల రామారావు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు, పాల్గొన్నారు. టేకులబోరు మాంటిస్సోరి ప్రైవేట్ విద్యా సంస్థ నందు యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ విక్కిసింగ్ మరియు ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు, యోగా సాధన నిర్వహించారు.

## అంతర్జాతీయ యోగా దినోత్సవం వేడుకలు..



**సఖినేటిపల్లి జూన్ 21, ప్రభాత వార్త:** అంతర్జాతీయ యోగా దినోత్సవం వేడుకలను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అంతర్వేదికర నందు యోగా వేడుకలు ఘనంగా నిర్వహించారు. యోగ గురువు మన్నె సత్యనారాయణ యోగ యొక్క ప్రాముఖ్యత యోగాసనాలు, ప్రాణాయామం, ధ్యానం, విద్యార్థులకు వివరించినారు. విద్యార్థులచే యోగాసనాలు వేయించి, యోగ ను నిత్యజీవితంలో ఒక భాగంగా చేసుకోవాలని తద్వారా శారీరక మానసిక ఆరోగ్యాన్ని పరిపుష్టం చూపిస్తుందని, విద్యార్థులకు తెలియజేశారు. యోగ అంటే కలపడం అనసాలే కాదని ప్రతి ఒక్కరూ సులువుగా చేసే ప్రాణాయామం ధ్యానం ఆరోగ్యానికి చాలా ఉపయోగ పడుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పిడి కె భాస్కరరావు ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## సొంత గ్రామం విచ్చేసిన పెద్ది సినిమా డైరెక్టర్ సానా బుచ్చిబాబు



**యు.కొత్తపల్లి, జూన్ 21 (ప్రభాతవార్త) :** యు.కొత్తపల్లి చెందిన ప్రముఖ (ఉప్పెన, పెద్ది) చిత్రాల దర్శకుడు సానా బుచ్చిబాబు ఆదివారం సొంత గ్రామం కొత్తపల్లిలోని స్వగృహానికి విచ్చేశారు. బంధువులతో కలిసి కేకును కోసి పెద్ది సినిమా విజయానందాన్ని పంచుకున్నారు. సినిమాకు సంబంధించి పలు విషయాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్ది సినిమా జీవితంలో మరపురాని విజయాన్ని అందించిందని ఆనందం వ్యక్తం చేశారు. మరెన్ని మంచి చిత్రాలకు దర్శకత్వం వహించదానికి (ప్రేరణగా) కలిగించిందన్నారు. త్వరలో మరో మంచి చిత్రానికి ప్రణాళికలు సిద్ధంచేసుకుంటున్నట్లు తెలిపారు.

# భారతీయ సంస్కృతికి ప్రతీక యోగా

## వాసంశెట్టి సత్యం, ఏఎంసీ చైర్మన్ అక్కల రిషి



**కె.గంగవరం, జూన్ 21, (ప్రభాతవార్త) :** అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా రామచంద్రపురం నియోజకవర్గంలోని కె.గంగవరం మండలం శివల గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఘనంగా యోగా డే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, స్వచ్ఛ ఆంధ్ర డైరెక్టర్ సలాది రమేష్, ఎండిఓ శ్రీనివాస్,మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మేడిశెట్టి రవికుమార్, నియోజకవర్గ రైతు అధ్యక్షులు బలుసు శివప్రసాద్, డిసి నిడదవోలు సుబ్రమణ్యం ఎంపీటీసీ వాసంశెట్టి నాగమణి శ్రీనివాస్ లు పాల్గొని విద్యార్థులతో కలిసి యోగా సాధన చేశారు. ఈ సందర్భంగా వాసంశెట్టి సత్యం మాట్లా డుతూ యోగా భారతదేశం ప్రపంచానికి అందించిన గొప్ప వరమని అన్నారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు యోగా ప్రతీకగా నిలుస్తోందని పేర్కొన్నారు. నేటి ఉరుకుల పరుగుల జీవితంలో ఒత్తిడులు, ఆందోళనలు పెరుగుతున్న నేపథ్యంలో యోగా ద్వారా మానసిక ప్రశాంతతను పొందడంతో పాటు అనేక రుగ్మతలను దూరం చేసుకోవచ్చని తెలిపారు. శారీరక దృఢత్వం, మానసిక స్థైర్యం, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే యోగా ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలని పిలుపునిచ్చారు. ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్ మాట్లాడుతూ యోగా ఆరోగ్యకరమైన జీవన విధానానికి మూలాధారమని అన్నారు. ప్రతిరోజూ కొంత సమయం యోగాకు కేటాయించడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతో పాటు ఏకాగ్రత, క్రమశిక్షణను పెంపొందించు కోవచ్చని చెప్పారు. ముఖ్యంగా విద్యార్థులు యోగాను అలవాటు చేసుకోవడం ద్వారా చదువులోనూ, జీవితంలోనూ మంచి ఫలితాలు సాధించగలరని వివరించారు. యోగా యొక్క ప్రాముఖ్యతను తెలియజేస్తూ నిర్వహించిన కార్యక్రమం అందరినీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. అలాగే అద్దంపల్లి గ్రామ హైస్కూల్లో జరిగిన యోగ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు అధ్యా పకులతో పాటు ఎంఈఓ ఆంజనేయులు పాల్గొన్నారు. గంగవరం జిల్లా ప్రజా పరిషత్ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ పంపన నాగమణి సుబ్బారావు సెక్రటరీ లు పి సత్తిబాబు, మల్లేశ్వరరావు సచివాలయ సిబ్బంది ప్రధా నోపాధ్యాయులు సుబ్రహ్మణ్యం,పిఈటి, పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## జాతీయ రహదారి 30పై బొల్లెరో వాహనం దగ్ధం.





**చింతూరు జూన్ 21 ప్రభాత వార్త.** చింతూరు మండలం కాటుకపల్లి వద్ద విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా వాహనం దగ్ధం అయింది. చింతూరు నుండి భద్రాచలం వైపు వెళ్తున్న కోళ్ల వ్యాన్. చింతూరుకు చెందిన కోళ్ల వ్యాపారికి చెందిన వాహనం ఇది.ఘటన స్థలాన్ని చింతూరు ఎస్ ఐ సంతోష్ కుమార్ సందర్శించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## గ్రంధాలయ నిర్మాణానికి శంకుస్థాపన....

### బి టి రోడ్ ప్రారంభోత్సవం

### అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే



**అనపర్తి జూన్ 21 (ప్రభాతవార్త)** అనపర్తిలో 40 లక్షల రూపాయలతో నిర్మించబోయే గ్రంథాలయ భవనం నిర్మాణానికి, శంకుస్థాపనగావించి , 80 లక్షల వ్యయంతో నిర్మించిన బి టి రోడ్ ను జిల్లా కలెక్టర్ చేకూరి కీర్తి, జాయింట్ కలెక్టర్ మేఘా స్వరూప్, ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి లు ప్రారంభించారు. శ్రీ రామచంద్ర పేపర్ బోర్డు సి ఎస్ ఆర్ ఫండ్స్ 20 లక్షలు, పంచాయతీ నిధులు 10 లక్షలు, మండల పరిషత్ నిధులు 10 లక్షలు రూపాయలతో గ్రంధాలయ భవనం నిర్మించనున్నారు. నేషనల్ రీడర్స్ డే సందర్భంగా గ్రంథాలయ నిర్మాణం శంకుస్థాపన చేయడం సంతోషకరమని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ జాయింట్ కలెక్టర్ ఎమ్మెల్యే తో పాటు యువ నాయకులు నల్లమిల్లి మనోజ్ రెడ్డి, అనపర్తి నియోజకవర్గం,అనపర్తి మండలం,అనపర్తి టౌన్ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రత్తిపాడులో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం

**ఆసనాలు వేసిన ఎమ్మెల్యే సత్య ప్రభ, మరియు కూటమి నేతలు, అధికారులు**



**ప్రత్తిపాడు, జూన్ 21 (ప్రభాత వార్త)** యోగా ప్రతి మనిషి జీవితంలో ఒక భాగం కావాలని, అప్పుడే ఆరోగ్యవంతమైన వ్యక్తులు, తద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ పేర్కొన్నారు. 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్తిపాడు టిడిపి పార్టీ కార్యాలయం వద్ద ఆదివారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'యోగాంధ్ర' కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని, కూటమి నాయకులు, అధికారులతో కలిసి స్వయంగా యోగాసనాలు అభ్యసించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే సత్యప్రభ మాట్లాడుతూ దేశ ప్రధాని నరేంద్ర మోదీ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్య సాధన కోసం యోగాంధ్ర కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ నిత్యం యోగాను సాధన చేయడం ద్వారా మానసిక ప్రశాంతతతో పాటు శారీరక దారుఢ్యాన్ని పెంపొందించుకోవచ్చని సూచించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఖాదీ గ్రామీణ పరిశ్రమల వైస్ చైర్మన్ కొమ్ముల కన్నబాబు, రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ డైరెక్టర్ వెన్నా శివ, జనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మేడిశెట్టి సూర్యకిరణ్ (బాబీ), బద్ది రామారావు, యాళ్ల జగదీష్, వెలుగుల నాని, గోపిశెట్టి శ్రీను, కంచి బోయిన శ్రీను, తలంపంటి బుజ్జి, దళ్లే జ్యోతి తదితరులు పాల్గొన్నారు. అలాగే ప్రభుత్వ అధికారులు ఎంపీడీవో ఎం.వి.ఆర్ కుమార్ బాబు, ఎంఈఓ రాజుబాబు, సిడిపిఓ పద్మావతి, సూపర్వైజర్ చక్రవేణి, ఏపీవో కుమార్ స్వామి, సిఆర్పి రాంజీ ప్రసాద్, పాటు కూటమి పార్టీల శ్రేణులు, ఉపాధ్యాయులు, ఏఎన్ఎంలు, అంగన్వాడి టీచర్లు, యోగా దినోత్సవాన్ని విజయవంతం చేశారు.

## ప్రత్తిపాడు జెడ్పీ హైస్కూల్‌లో పూర్వ విద్యార్థుల అపురూప కలయిక..



**ప్రత్తిపాడు, జూన్ 21 (ప్రభాత వార్త)** ముప్పై ఏళ్ల కాలం గడిచినా, హోదాలు మారినా.. ఆనాటి అల్లరి, స్నేహ బంధం ఏమాత్రం చెదరలేదని ప్రత్తిపాడు పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయికతో నిజమైంది. స్థానిక జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1993-94 విద్యాసంవత్సరంలో 10వ తరగతి చదివిన విద్యార్థులు సుదీర్ఘమైన 32 సంవత్సరాల తర్వాత మళ్లీ ఒకే వేదికపైకి చేరారు. ఆదివారం జరిగిన ఈ ఆత్మీయ సమ్మేళనం ఎన్నో భావోద్వేగాల కలయికకు సాక్ష్యంగా నిలిచింది. వివిధ రంగాల్లో స్థిరపడిన నాటి క్లాస్‌మేట్స్ అందరూ తరలిరావడంతో పాఠశాల ప్రాంగణంలో పండగ వాతావరణం సంతరించుకుంది. తమకు విద్యాబుద్ధులు నేర్పిన నాటి ఉపాధ్యాయులను ఈ సందర్భంగా విద్యార్థులు ఘనంగా సత్కరించి, పాదాభివందనం చేశారు. హోదాలను పక్కనబెట్టి, వయసును మరిచి అందరూ మళ్లీ పాఠశాల రోజుల నాటి పిల్లల్లా మారిపోయి చిన్ననాటి అల్లరి పనులను గుర్తుచేసుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సాగిన ఈ ఆత్మీయ సమ్మేళనం గ్రూప్ ఫోటోలు, జ్ఞాపకాల నెమరువేతలతో ఎంతో ఉల్లాసంగా సాగింది. పూర్వ విద్యార్థులు యాళ్ల జగదీష్, కిషోర్, తాతబ్బాయి, త్రిమూర్తులు, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు

## సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



**సీతానగరం, జూన్ 21, (ప్రభాతవార్త):** మండలంలోని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి నుండి మంజూరైన చెక్కులను తెదేపా జిల్లా అధ్యక్షుడు, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి ఆదివారం అందజేశారు. కాటవరానికి చెందిన గెడ్డం పుష్పకు రూ.41,450, గుడపాటి వరలక్ష్మికి రూ.76,310, బొబ్బిలంకకు చెందిన తుముల నాగమణికి రూ.84,037, నాగ లక్ష్మికి రూ.17,114, కాకిలేటి సూరమ్మకు రూ.87,340, కవడి బాబికి రూ.81,311, ములకలంకకు చెందిన బొడ్డు సత్యనారాయణకు రూ.54,258, చినకొండేపూడికి చెందిన బూరుగపల్లి అనసూయకు రూ.1,41,088, సిహెచ్.అనంతలక్ష్మి కృష్ణవేణికి రూ.95,121, వంగలపూడికి చెందిన తురుమల్ల దుర్గాలక్ష్మికి రూ.25,000, ముగళ్ళకు చెందిన తన్నీరు మునికోటేశ్వరరావుకు రూ.32,714, వెదులపల్లికి చెందిన దండిమూడి మురళీకృష్ణ భగవాన్‌కు రూ.70,000, మునికూడలి గ్రామానికి చెందిన కొంగల శివసూర్య భాస్కరరావుకు రూ.2,01,540, విలువైన చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అంతర్వేది నృసింహుని వెండి శఠారి బహూకరణ





**సఖినేటిపల్లి జూన్ 21, ప్రభాత వార్త:** అంబేద్కర్ కోనసీమ జిల్లా, సఖినేటిపల్లి మండలం అంతర్వేది గ్రామంలో వేంచేసియున్న శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి దేవస్థానము శ్రీ స్వామి వారికి భీమవరం (చిన్న అమిరం) వాస్తవ్యులు బుద్దరాజు హరినాధ రాజు, దంపతులు సుమారు రూ. 68,000 లు విలువ గల వెండి శఠారి బహుకరించారు. ఆలయ అర్చక స్వాముల ఆద్వర్యములో ప్రత్యేక పూజలు, సంప్రోక్షణ కార్యక్రమములు నిర్వహించి, స్వామి వారి సన్నిధిలో పెట్టారు. దాతలకు శ్రీ స్వామివారి చిత్రపటం, ప్రసాదాన్ని అందజేసారు.

## సంపూర్ణ ఆరోగ్యం యోగా చే సాధ్యం : జల్లి సుజాత



**అమలాపురం కలెక్టరేట్, జూన్ 21 ప్రభాతవార్త** అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా అమలాపురం శ్రీ సాయి సంజీవిని మహిళా నడక యోగా ఆరోగ్య సేవా సంస్థ అధ్యక్షురాలు గుర్రాల అమల ఆధ్వర్యంలో యోగా దినోత్సవం ఈనాటి బాలలే రేపటి పౌరులు అని డిప్యూటీ గవర్నర్ జల్లి సుజాత బాల బాలికలుచే. పలు యోగాసనాలను చేయించారు యోగా చేయడం వల్ల శారీరక దృఢత్వం తో పాటు మానసిక ప్రశాంతత తో పాటు ఏకాగ్రత పెంపొందుతాయి అని అన్నారు. ఈ సందర్భంగా జల్లి సుజాత మాట్లాడుతూ సంపూర్ణ ఆరోగ్యం యోగా సాధించే సాధ్యం అన్నారు, పిల్లలతో యోగా చేయించిన అమలను సుజాత అభినందించారు ఈ కార్యక్రమంలో రేవు జశ్వంత్ అధ్యారత్న , దానియేలు, నందన, ప్రిన్స్ డి దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

## ఒంటెద్దు స్వామి కి సన్మానం



**రాజమహేంద్రవరంఅర్బన్,ధవళేశ్వరం జూన్21(ప్రభాతవార్త)** మాజీ వార్డు మెంబర్ బిజెపి నాయకుడు ఒంటెద్దు స్వామి ని ధవళేశ్వరం లో ఘనం గా సన్మానించారు స్థానిక శ్రీ లక్ష్మీ జనార్ధన స్వామి కాలనీ అభివృద్ధికి ఆయన చేసిన కృషి కి అభినందనలు తెలియజేస్తూ కాలనీవాసులు యోగ డే సందర్భంగా ఒంటెద్దు స్వామిని ఘనంగా సత్కరించారు అనంతరశీ సైకిల్ బహుకరించారు ఈ కార్యక్రమంలో పెచెట్టి శ్రీనివాసరావు, సలాది నానాజీ, మట్టా దుర్గాప్రసాద్, దువ్వరపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యోగా దినోత్సవం



**సీతానగరం, జూన్ 21, (ప్రభాతవార్త) :** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డా.శ్రీరామమూర్తి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో యోగా శిక్షకులు డా. ప్రసూన యోగా ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమం లో డా. నాగేశ్వరావు, డా. సుధామయి, డా. మాధవ్, శ్రీ సుబ్బారావు, షేక్ దర్గా మదీనా, ఫణీంద్ర కుమార్, శివదుర్గా ప్రసాద్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు

## నిత్యం యోగా సాధనతో వ్యాధులు దూరం - వాకర్స్ హెల్త్ క్లబ్ టీమ్




**అమలాపురం కలెక్టరేట్, జూన్ 21 ప్రభాతవార్త** అమలాపురం వాకర్స్ హెల్త్ క్లబ్ మహిళా వాకర్స్ క్లబ్ మరియు మెడ్ యునైటెడ్ హాస్పిటల్స్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ యోగా దినోత్సవం లో యోగా ట్రైనర్ శివ వాకర్స్ సభ్యుల చేత, యునైటెడ్ హాస్పిటల్ సిబ్బంది చేత పలు యోగాసనాలు వేయించారు. నిత్యం యోగా చేయడం వలన అనేక రకాల వ్యాధుల నుంచి ఉపశమనం పొందవచ్చని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ హెల్త్ క్లబ్ ఉపాధ్యక్షులు గోటేటి గంగాధరరావు, కార్యదర్శి కుడుపూడి త్రినాధరావు, డా. జాయ్సన్, డా. హరిత కోశాధికారి పడాల నాయుడు(బాబీ), జోన్ చైర్పర్సన్ యర్రమిల్లి సత్యనారాయణమూర్తి, పుత్సా కృష్ణ కామేశ్వర్, పసుమర్తి గోపాలకృష్ణ, అభినవ్, కంకటాల విజయలక్ష్మి, అభిజ్ఞ తదితరులు పాల్గొన్నారు.

## నల్లచెరువు కాలువ పూడికతీత పనులు ప్రారంభం



**సీతానగరం, జూన్ 21, (ప్రభాతవార్త) :** మండలంలోని నల్గొండ గ్రామ పరిధిలో గల నల్ల చెరువు కాలువ పూడికతీత పనులను ఆదివారం ప్రారంభించారు. తొర్రిగడ్డ చైర్మన్ వేగి శ్రీనివాస్, వైస్ చైర్మన్ శ్రీమందపాటి జగపతి రాజు, కాలువ ప్రెసిడెంట్ కొనే శ్రీను పర్యవేక్షణలో ఈ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ చొరవతో ఈ కాలువ పూడికతీత పనులు ప్రారంభం కావడంపై ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు శ్రీమందపాటి నరేంద్ర వర్మ, ముత్యాల మహేష్, వీరటపు హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

## "యోగా" ఇంటింటికి చేరాలి..



**అంబాజీపేట, జూన్ 21, (ప్రభాతవార్త):** యోగ తోనే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని యోగ ప్రతి ఇంటికి చేరాలని పలువురు అన్నారు. అంబాజీపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవంను ఆదివారం ఘనంగా నిర్వహించారు. యోగ శిక్షకురాలు, పీడీ కుంపట్ల ఆదిలక్ష్మి ప్రజా ప్రతినిధులు అధికారులు విద్యార్థులు స్థానికులచే యోగాసనాలు వేయించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర శెట్టిబలిజ కార్పోరేషన్ డైరెక్టర్ బొంతు పెదబాబు, నియోజవర్గ టిడిపి కో- కన్వీనర్ దాసరి వీర వెంకట సత్యనారాయణ,ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు,ఎంపీడీవో బి. మమత, ఎంఈఓ-1 కె.వెంకటేశ్వరరావు,డిప్యూటీ ఎంపీడీవోలు కె.శ్రీనివాస్, ఎండి అబ్బాస్ అలీ, ఇన్చార్జ్ హెచ్ఎం.బిఎస్ఎన్ మూర్తి, ఎంపిటిసి పబ్బినీడి రాంబాబు, టిడిపి మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు గూడాల ఫణి, మండల తెలుగు యువత జోగి కృష్ణ చైతన్య, రవణం రాము, మైపాల తాతాజీ, పత్తి దత్తుడు, నాగాబత్తుల వెంకట సుబ్బారావు, పెదపూడి శ్రీనివాసరావు, గుత్తుల సురేష్ కుమార్, పంచాయతీ కార్యదర్శి కె వి వి సత్యనారాయణ, టైక్వాండో సీనియర్ కోచ్ పితాని త్రిమూర్తులు,ఉపాధి శ్రామికులు, స్కౌట్, టైక్వాండో, వివిధ శాఖల అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు. మై భారత్ యువజన కార్యాలయం కాకినాడ జిల్లా ఆధ్వర్యంలో స్థానిక జడ్పీ హైస్కూల్లో 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్వామి వివేకానంద ట్రస్ట్ కో-ఆర్డినేటర్ పి.శారద, మై భారత్ వాలంటీర్స్ అనూష సరోజినీలు పాల్గొన్నారు.



తూర్పుగోదావరి, కాకినాడ, పోలవరం.
డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## వైసిపి నేతలపై కక్ష సాధింపు చర్యలు తగదు....

### వైసిపి నేత కుంచే రమణారావు.



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జూన్21,ప్రభాతవార్త.** రాష్ట్రంలో ప్రభుత్వం పోలీస్ స్టేషన్లను టిడిపి కార్యాలయాలు గా మార్చేసిందని అక్రమ మద్యం కేసుల పేరుతో వైసిపి నాయకుల ను లక్ష్యంగా చేసుకుని వేధింపుల కు గురి చేస్తుందని అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ సీనియర్ వైసిపి నాయకుడు కుంచే రమణారావు ఆరోపించారు. ఆదివారం రమణారావు స్థానిక విలేకరులతో మాట్లాడారు అక్రమ మద్యం కేసులతో సంబంధం లేని వైసిపి నేతలు వైసిపి ప్రజా ప్రతినిధులను ఇరికించే ప్రయత్నాలు చేస్తున్నారని ముఖ్యంగా మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు తనయుడు సునీల్ వ్యవహారం లో పోలీసుల తీరు దారుణంగా ఉందని విమర్శించారు.వైసిపి ప్రభుత్వ హయాంలో మద్యం విధానాన్ని పారదర్శకంగా అమలు చేసామని ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని మద్యం ధరలు పెంచి వినియోగా న్ని తగ్గించే చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసు శాఖ పూర్తిగా విఫల మైందని అధికార పార్టీ ఒత్తిడితో పోలీసు శాఖ వ్యవహరిస్తుం దన్నారు. ఎన్నికల ముందు ప్రకటించిన రెడ్ బుక్ విధానాన్ని ప్రస్తుతం అమలు చేస్తున్నారని రాష్ట్రవ్యాప్తంగా వైసిపి నేతలపై దాడులు వేధింపులు జరుగు తున్నాయని విమర్శించారు. వేధింపులు అక్రమ అరెస్టులకు వైసిపి నాయకులు కార్యకర్తలు భయపడేది లేదని రానున్న రోజుల్లో కచ్చితంగా అరాచక పాలనకు విధానాలకు మూల్యం చెల్లించుకోవలసిన రోజు వస్తుందని రమణారావు హెచ్చరించారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

**మారేడుమిల్లి జూన్ 21 ప్రభాత వార్త.** మారేడుమిల్లిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. చతిస్గడ్ రాష్ట్రంలోని బస్తారుకు చెందిన ముగ్గురు యువకులు ద్విచక్ర వాహనంపై మారేడుమిల్లి వైపు అతివేగంగా వస్తున్నారు. ఈ క్రమంలో వాహనం అదుపుతప్పి గ్రామ శివారులోని వేటుకూరు కూడలి వద్ద ఉన్న కల్వర్టులోకి దూసుకుపోయింది. వీరిని హుటాహుట్టిన అంబులెన్స్ లో మారేడుమిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో రంపచోడవరం ఆస్పత్రికి తీసుకెళ్తుండగా అరుణ్ అనే వ్యక్తి మార్గమధ్యలో మృతి చెందారు. మరో ఇద్దరిని అక్కడి నుండి రాజమహేంద్రవరం ఆస్పత్రికి తరలించారు బి. నరసింహమూర్తి ఆధ్వర్యంలో గుర్తుచేయడం ఎస్సై ఎన్ రాజ్కోటి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఎస్వి జాబ్‌మేళాలో 30 మంది ఎంపిక



**అమలాపురం కలెక్టరేట్, జూన్ 21 ప్రభాతవార్త** శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో నిర్వాహించిన పలు బహుళ జాతి కంపెనీలు అయిన పోక్స్ కాన్ మరియు టీ.వీ.ఎస్ మోటార్స్ 6 కంపెనీలు నిర్వా హించిన జాబ్‌మేళాలో శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల విద్యార్థులు 30 మంది ఉద్యోగాలు సాధించారు.వీరికి కంపెనీ కాల్ లెటర్సు అందించారు.ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను కళాశాల కార్యదర్శి మరియు కరస్పాండెంట్ కె.వి.ఆర్.ఎన్.నరసింహరావు,చైర్మన్.మల్లిపూడి విజయలక్ష్మి, కరాటం ప్రవీణ్,కె.శ్రవణ్ దిలీప్,డా.కె.హేమవిజిత, డా.శ్రీరామ్, పద్మావతి, సౌందర్య రోజా,అఖిల్ కుమార్,కె.మనోహర్,రామారావు, శివప్రసాద్, బాబ్జీ, యాలంగి. వరప్రసాద్?.హెచ్. జాన్‌పాల్, బి.శ్రీనివాస్, సంసోను, దివ్య, భవాని, వైష్ణవి, వెంకట్, అరుణ్, వెంకటేష్ తదితరులు అభినందించారు.

## రామచంద్రపురంలో ఘనంగా యోగా దినోత్సవం

**- ?రూ. కోటితో శివాలయం పార్క్ అభివృద్ధి**




**రామచంద్రాపురం,జూన్ 21 (ప్రభాత వార్త):**యోగా అనేది కేవలం వ్యాయామం మాత్రమే కాదని, శారీరక, మానసిక, ఆధ్యాత్మిక ఆరోగ్యానికి మార్గదర్శకమని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు.అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఆదివారం పట్టణంలోని ఇందిరాగాంధీ మున్సిపల్ హైస్కూల్‌లో నిర్వహించిన వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.?ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రూ. కోటి వ్యయంతో రామచంద్రపురంలోని శివాలయం పార్కును అభివృద్ధి చేస్తున్నట్లు ప్రకటించారు.అందులో యోగా,మెడిటేషన్ హాల్‌తో పాటు మహిళల కోసం ప్రత్యేకంగా ఓపెన్ జిమ్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.నేటి వేగవంతమైన జీవనశైలిలో ఒత్తిడిని అధిగమించడానికి ప్రతి ఒక్కరూ యోగాను దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు.ఆర్డీవో సరళావతి, మున్సిపల్ కమిషనర్ కె.వి.ఆర్. రాజు మాట్లాడుతూ.. విద్యార్థులు చిన్నతనం నుంచే యోగా అలవాటు చేసుకోవడం ద్వారా ఏకాగ్రత,క్రమశిక్షణ పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు,అధికారులు, ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొని యోగాసనాలు వేశారు.

## కష్టాల్లో ఉన్నవారికి మంత్రి సుభాష్ ఆర్థిక సాయం



**రామచంద్రాపురం,జూన్ 21 (ప్రభాత వార్త):** ఆర్థిక ఇబ్బందులు,అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్న పలువురు నిరుపేదలకు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆదివారం రూ.45 వేల ఆర్థిక సాయం అందజేశారు.కాజులూరు మండలం మంజేరు గ్రామానికి చెందిన యాదగిరి చిరంజీవి భర్త గుండెపోటుతో మృతి చెందడంతో ఆమె కుటుంబానికి రూ.15 వేలు, పిల్లల చదువుల కోసం రామచంద్రపురానికి చెందిన ఆటో డ్రైవర్ వంశీకి రూ.20 వేల ఆర్థిక సాయాన్ని మంత్రి అందించారు.?అదేవిధంగా ఊపిరితిత్తులు,గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న కొత్తూరు టిడ్కో కాలనీకి చెందిన శివంగల కామాక్షికి రూ.10 వేల సాయంతో పాటు, మెరుగైన వైద్యం కోసం మంగళగిరి వెళ్లేందుకు సొంత ఖర్చులతో అంబులెన్స్ ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పేదరికం వైద్యానికి అడ్డంకి కాకూడదన్నారు.నియోజకవర్గ ప్రజల కోసం మూడు కంటైనర్ ఆసుపత్రులు,ఒక సంచార వైద్యశాల ఏర్పాటు చేశామని,ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సుభాష్ కోరారు.

## యోగా సాధన సర్వ రోగ నివారిణి

### జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్



**అమలాపురం కలెక్టరేట్, జూన్ 21: ప్రభాతవార్త** మానవ జీవితంలో సర్వ రోగ నివారిణి యోగ అని, వయస్సుతో సంబంధం లేకుండా యోగ చేస్తే సత్ఫలితాలు వస్తాయని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ తెలిపారు. ఆది వారం స్థానిక జి ఎం సి బాలయోగి స్టేడియం నందు 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను జిల్లాస్థాయిలో ఘనంగా నిర్వ హించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా సాధనతో మానసిక, శారీరక ఆరోగ్యం లభిస్తుందన్నారు. మన సంస్కృతి, విలువలే భారత దేశాన్ని ప్రపంచానికి విశ్వ గురు స్థానంలో నిలిపాయన్నారు 12 అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని విజయ వంతం చేసిన పలువురిని జిల్లా జాయింట్ కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ సుబ్బారావు ,యోగా టీచర్ చంద్రశేఖర్, బ్రహ్మకు మారీస్ ప్రతినిధులు, ఆయుష్ వైద్యాధికారి శ్యాం సుందర్ జిల్లా పర్యాటక అధికారి అన్వర్ హుస్సేన్, జిల్లా పౌర సరఫరాల అధికారి అడపా ఉదయభాస్కర్ డి ఎస్ డి ఓ రుద్ర, డిఆర్డిఏ పిడి డి రాంబాబు జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు

Print and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajamahendravaram-533 103. Phone : 2469407, 2469408. RNI No.64863/96, Editor : Damerla Sai Baba, Responsible for s election of News-under the PRB Act. Regd.: No.H/SD/337/09-11 Air Surcharge: Delhi : 40Ps